జూన్
2023

206

సంపుటి :19 సంచిక : 1

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో......

పార్టీ ఐక్యత, పటిష్టతకై దిద్దుబాటు ఉద్యమం
హిందుత్వ సైన్యాన్ని తయారు చేస్తున్న ఆర్ఎస్ఎస్ పాఠశాలలు
ప్రత్యామ్నాయ సంస్కృతికోసం పెద్ద పోరాటం జరగాలి
క్రీపూ. 200-క్రీ.శ.300 మధ్య ఆర్థిక, సామాజిక పరిస్థితులు
ఆటవిక పెట్టుబడిదారీ వ్యవస్థతో ప్రమాదం
కమ్యూనిస్టు దార్శనికుడు కామ్రేడ్ రజనీ పామీదత్
మన్‌కీ బాత్ 'మహారాజు'కి మల్లయోధుల గోడు పట్టదా?
ఋగ్వేద ఋషులు

# ఋగ్వేద ఋషులు

**పిబి చారి**



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

ఇంద్రుడు అగ్ని మొదలగు మానవాతీత దేవతల పేర్లు మినహాయిస్తే ఋగ్వేద ఋషుల సంఖ్య 350 కంటే ఇంకా కొంచెం ఎక్కువగానే ఉంటుంది. ఋగ్వేదంలో 10 మండలాల క్రమాన్ని బట్టి చూస్తే మండల ప్రముఖులు లేదా కర్తలు, రెండవ మండలానికి గృత్సమదుడు, మూడో దానికి విశ్వామిత్రుడు, 4వ దానికి వామదేవుడు, ఐదవ దానికి అత్రి, ఆరవ మండలానికి భరద్వాజుడు, ఏడో మండలానికి వశిష్ఠుడు, ఎనిమిదో మండలానికి కణ్వుడు, 9 ,10వ మండలాలకు ఒకే ఋషి గాని వారి గోత్రీకులు కానీ పెద్దగా ప్రాధాన్యత లేదు. సూత్రాల ఆధిక్యత ప్రకారం వశిష్ఠునికి ప్రథమ స్థానం. ఆయన 103 సూక్తాల కర్త. రెండవ స్థానం భరద్వాజునికి 60 సూక్తములు కర్త. తర్వాత స్థానం వామదేవుడు 50 సూత్రాలకు, విశ్వామిత్రుడు 43 సూక్తాలకు, గృత్సమదుడు 40, కక్షీవాహనుడు 27, అగస్త్యుడు 26, దీర్ఘతముడు 25, గోతముడు 20, మేధాతిథి 20 ఇలా ఈ వరుస క్రమంలో ఉన్న వారందరూ ఋగ్వేద ఋషులలో అత్యంత ముఖ్యమైన వాళ్ళు.

ఋగ్వేదం ప్రకారం ఋషుల పూర్వీకులను చూస్తే ఏ ఒక్కరి తరం ముత్తాతలు దాటదు. అంటే అంతకు మించి గుర్తుపెట్టుకోలేకపోయారు. భరద్వాజుని తండ్రి బృహస్పతి, తాత లోకనామ ముత్తాత అంగీరస.

కశ్యపుని తండ్రి మరీచి అంతవరకే తెలుసు. గౌతముని తండ్రి రాహూగనుడు తర్వాత తెలియదు. విశ్వామిత్రుని నాలుగు తరాలు తెలుసు. తండ్రి గాధి, తాత కుశికుడు, ముత్తాత ఇషీరథుడు. విశ్వామిత్రుని కొడుకు మధుచందుడు. విశ్వామిత్రుడు జహ్నుశాఖకు, గుడ్లగూబ(కు శక) టోటెమ్ కి చెందిన గుడ్లగూబ ఆయన కుదురు చిహ్నం. పరిపాలక యోధ వంశానికి చెందిన అంటే ఆర్యక్షత్రియుడు. భృగు మహర్షి తండ్రి వరుణుడు. జమదగ్నులు అనేది ఆర్య నామమే అయినా వీరు తర్వాతికాలంలో ఆర్యుల లో కలిసిన వీరి ఇకి ప్రత్యేక వంశ గ్రంథం లాంటిది ఏమీ లేదు. దీన్నిభృగు శాఖకు ఉపశాఖ గా పేర్కొంటారు. సుదాసు చేతిలో ఓడిపోయిన పది తెగలలో భృగు తెగ ఒకటి. కణ్వుడి తండ్రి ఘోర ఋషి. కన్వుడి కొడుకులు మేధాతిథి,వత్స. అంతకు ముందు వాళ్ళ సంగతి తెలియదు. పూర్వీకులను ఎందుకు గుర్తు పెట్టుకో లేదో మరి ఆశ్చర్యమే. వశిష్ఠుడు ఆయన తమ్ముడు అగస్త్యుడు. మిత్రా వరుణులుఅనే దేవతలు నడుస్తుండగా ఊర్వసి ఎదురు పడుతుంది. ఆమె అందాన్ని చూసి సమ్మోహనం చెంది వీర్య స్కలనం చేసుకున్నారు ఆ ఇద్దరు దేవతలు. ఆ వీర్యాన్ని రెండు కుండల లో పెట్టగా ఆ కుండలు నుండి పుట్టినవారు వశిష్ఠుడు, అగస్త్యుడు. వశిష్ఠుడు ఊర్వశి మనస్సు నుండి పుట్టాడని మరొక కథ. పుష్కరిణిలో దొరికాడని మూడవ కథ. వశిష్ఠుడి కొడుకులు పరాశరుడు. గౌర వీతి వశిష్ఠుడిని తమ మూలపురుషుడిగా పరిగణించే బ్రాహ్మణ గోత్రాలులో పౌష్కరసాది, కౌండిన్య అనేవి రెండు. పుష్కరములో ఉండేవారు, కుండలో పుట్టిన వారు అని వీటికి అర్థం.

మూడవ మండలానికి ద్రష్ట అయిన విశ్వామిత్రుడు, ఏడో మండల ద్రష్ట అయిన వశిష్ఠుడు వీరిద్దరూ రుగ్వేద కాలం నాటి చారిత్రక ఋషులు. ఈ పేర్లు మనకు రామాయణం లోనూ మహాభారతంలోనూ కనిపిస్తూ ఉంటాయి. అది కేవలం పౌరాణిక కల్పన మాత్రమే. చారిత్రక సత్యం కాదు. అందుకే వేదానికి భిన్నంగా ఉన్న దాన్ని త్యాజ్యం అన్నారు. (విసర్జించాలి అని).

**ఋగ్వేద ప్రజల వృత్తులు:**

ఋగ్వేదంలో వృత్తి మీద ఆధారపడ్డ సామాజిక పని విభజన కనపడుతుంది. నేను కవిని, మా నాన్న వైద్యుడు, మా అమ్మ వృత్తి పిండి రుబ్బటం ఇలా వివిధ వృత్తులు చేసుకుంటూ జీవించేవారు . అప్పటికి ఇంకావర్ణ వ్యవస్థ వేళ్ళూనుకోలేదు. యజుర్వేద కాలానికి స్పష్టంగా సమాజం నాలుగు వర్ణాలుగా విభజితం అయింది.

ఋగ్వేద ప్రజలు వ్యవసాయం చేసేవారు. వ్యవసాయానికి సంబంధించిన ప్రస్తావనలు ఋగ్వేదంలో అనేకంగా ఉన్నాయి. వారు ఎడ్లతో పొలం దున్నే వారు (1-23-15). వ్యవసాయానికి చిన్న చిన్న కాలువలు ఉండేవి. వాటిని కుల్య అన్నారు (5-83-8). నేడు కూడా కొండ జాతి వారు ఆకుల్య లను" కూల" లేక "గుల్ "అని పిలుస్తారు. వామదేవ రుషి(4-57-4) లో నాగలి, నాగలితో దున్ని నచాలు కర్రు( 4-57-8) లను పేర్కొన్నాడు. (10-146-6) లో పేర్కొన్నట్లు కృషీ వల అంటే వ్యవసాయం చేసే రైతు. వీరు భూమిని రెండుగా విభజించారు. ఒకటి క్షేత్రం, అరణ్యం అని(6-61-14). ఈ క్షేత్రంలో అంటే పొలంలో యవలు, తృణ ధాన్యాలను నుపండించేవారు. అరణ్యంలో పశువులను మేపుకొనేవారు. వరి (వ్రీహి), గోధుమలు (గోధూన) వారికి అప్పటికి తెలియదు. మలివేద యుగంలో వాటిని సాగుచేశారు. సాగు భూమిని క్షేత్రం అన్నారు. నాగలితో దున్నే టాన్ని కృషి అన్నారు. నాగలిని (సీర, లాంగల), కర్రు (ఫాల), నాగటి చాలు ను(సీత) అనిఅన్నారు. కొడవలి (దాత్రం), తవ్వు గోల (ఖనిత్రం), లగురించి ఋగ్వేద ప్రజలకు తెలుసు. దున్నని నేలలను (అకృషీ వల) అన్నారు. నాగలితో దున్నటాన్ని కృషి అన్నారు. ఎద్దులను అదుపుచేసేందుకు దీన్నే వ్యక్తి ఉపయోగించే ముల్లు కర్ర (అస్త్ర ) ప్రస్తావన కూడా ఉన్నది. క్రీస్తుపూర్వం 11వ శతాబ్దం నాటి కి చెందినదిగా భావిస్తున్న నాగటి చాళ్లు ఉన్న భూమిని ఆలి గ్రామ్ (స్వాత్ లోయ) వద్ద కనుగొన్నారు. ఋగ్వేద కాలపు ముందటి నాగరికత అయిన సింధు నాగరికతలో బావుల వాడకం విరివిగా ఉన్నప్పటికీ నీటిని పైకి తోడే ''కప్పి ''కి సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు. కానీ ఋగ్వేదం రాతి గిలక ను (అష్మ చక్ర) గురించి చెబుతుంది. బావి (అవత) నుంచి నీటిని పైకి తోడేందుకు తోలుతో కప్పిన కొయ్య కడవలు(అహావ)(10-101-7) ఉపయోగించేవారు. బావుల లోని నీటిని సేద్యం చేయడానికి వినియోగించేవారు. పంటలకు సంబంధించి ఋగ్వేదం ఇచ్చే సమాచారం పెద్దగా లేదు. ఋగ్వేదం ధాన్యపు విత్తనాలు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఋగ్వేద ఋషులు

పిబి చారి ......2

2. పార్టీ ఐక్యత, పటిష్టతకై దిద్దుబాటు ఉద్యమం

వి శ్రీనివాసరావు........4

3. హిందుత్వ సైన్యాన్ని తయారు చేస్తున్న ఆర్ఎస్ఎస్ పాఠశాలలు

అస్త సవ్యసాచి........9

4. ప్రత్నామ్నాయ సంస్కృతికోసం పెద్ద పోరాటం జరగాలి

ఎస్ వీరయ్య .........17

5. క్రీ.పూ. 200-క్రీ.శ.300 మధ్య ఆర్థిక, సామాజిక పరిస్థితులు

ఎంవిఎస్ శర్మ........20

6. ఆటవిక పెట్టుబడిదారీ వ్యవస్థతో ప్రమాదం

నోమ్ చోమ్స్కీ......23

7. కమ్యూనిస్టు దార్శనికుడు కామ్రేడ్ రజనీ పామీదత్

వై రాము.......29

8. మన్‌కీ బాత్ 'మహారాజు'కి మల్లయోధుల గోడు పట్టదా?

ఎ కోటిరెడ్డి ....31



**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పార్లమెంటు భవనం


**భా**రత దేశ నూతన పార్లమెంటు భవన ప్రారంభం సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చిన రెండు ఫొటోలు నేటి భారత దేశ పరిస్థితికి దర్పణం పడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పార్లమెంటు భవనం ఎదుట నాటి అగ్రనాయకుల ఫొటో ఒకటి. అందులో బాబూ రాజేంద్ర ప్రసాద్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, బాబాసాహెబ్ అంబేద్కర్, జకీర్ హుస్సేన్, బాబూ జగ్జీవన్‌రామ్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి ఉద్దండులు, దేశాన్ని ముందుకు నడిపించే ఆలోచనా పరులు ఉన్నారు. రెండో ఫొటో గత మే 28న న్యూఢిల్లీలో నూతన భవన ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ కాషాయ వస్త్రధారులైన తమిళనాడు పీఠాధిపతులతో పార్లమెంటు భవనం వద్ద దిగినది. ఈ పీఠాధిపతులు చోళరాజుల కాలం నాటి రాజదండాన్ని తెచ్చి ప్రధానికి ఇస్తే ఆయన దానికి పూజా పునస్కారాలు నిర్వహించి కొత్త భవనంలోని స్పీకర్ స్థానం ప్రక్కన ప్రతిష్టాపించారు.

ఒక ఫొటోలో సమ్మిశ్రిత భారత దేశ ప్రాతినిధ్యం కనిపిస్తుంది. మరో ఫొటోలో అగ్రవర్ణ ఆధిపత్య, మనువాద హిందూత్వ కనిపిస్తుంది. మొదటిది భారత దేశ భవిష్యత్తు అయితే, రెండోది భారత దేశాన్ని తిరిగి ఫ్యూడల్ యుగాలవైపు నడిపించే ఆర్ఎస్ఎస్-బిజెపి వికృత రూపం. కేవలం ఫొటోల ప్రాతినిధ్యం మాత్రమే కాదు నూతన పార్లమెంటు భవనం ప్రారంభం సందర్భంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఈ దేశాన్ని ప్రజాస్వామ్యానికి దూరంగా, ఫ్యూడల్ యుగాలవైపు నడపడానికి హిందూత్వ శక్తులు జరుపుతున్న దుర్మార్గ ప్రయత్నాల్లో ఒక భాగమే. మొదటిది, భారత దేశానికి అత్యున్నత అధినేత అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. నిజానికి ఒక దేశాధినేతగా రాష్ట్రపతిచేత భవనాన్ని ప్రారంభించడం సముచితం. అందునా ద్రౌపది ముర్మ ఒక మహిళ, ఆదివాసీ. సరిగ్గా ఈ కారణం చేతనే మనువాద హిందూత్వ వాదులు ఆమెచేత భవనాన్ని ప్రారంభించకపోవడమే కాదు, కనీసం ఆమెను కార్యక్రమానికి కూడా ఆహ్వానించలేదు. ఇది ఆర్ఎస్ఎస్-బిజెపి అప్రజాస్వామిక, తిరోగమన వైఖరిని బయటపెడుతోంది.

రెండోది, నూతన పార్లమెంటు భవనాన్ని నిర్మించడంలో పూర్తిగా ఏకపక్ష ధోరణి ప్రదర్శించడంతోపాటు ప్రారంభాన్ని కూడా పూర్తిగా హిందూ మత క్రతువుగా మార్చారు. ప్రపంచ వారసత్వ సంస్థ అభ్యంతరాలను కూడా లెక్కచేయకుండా అనేక వారసత్వ కట్టడాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త పార్లమెంటు భవనం నిర్మించారు. మోడీ మనల్ని శతాబ్దాల వెనక్కు నడిపించడమే కాదు, శతాబ్దాల మన నిజమైన వారసత్వాన్ని నాశనం చేసి దాని స్థానంలో హిందూత్వ ప్రచారం చేసే కుహనా వారసత్వ విలువలను ప్రతిష్టాపించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్య యుగ పద్ధతులకు భిన్నంగా ఫ్యూడల్ రాజులకు పట్టాభిషేకం చేసే మాదిరిగా పీఠాధిపతుల నుండి రాజదండాన్ని ప్రధాని స్వీకరించి పార్లమెంటు భవనంలో ప్రతిష్టించడం మన దేశం ఇన్నాళ్లూ అనుసరిస్తూ వచ్చిన, మన రాజ్యాంగంలో లిఖించుకున్న లౌకికతత్వానికి విరుద్ధం. అందుకే న్యూయార్క్ టైమ్స్ పత్రిక 'భారత దేశ నూతన పార్లమెంటు భవనం, బ్రిటిష్ వారు నిర్మించిన పాత భవనంతోపాటు స్వాతంత్ర్యానంతరం దేశం అనుసరించిన లౌకికతత్వాన్ని కూడా విడిచిపెట్టేసింది' అని రాసింది.

ప్రజాస్వామ్యంపై దాడిగా జరిగిందికాబట్టే భవన ప్రారంభోత్సవాన్ని దేశంలోని ముఖ్యమైన ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించి తమ అసమ్మతిని తెలియజేశాయి. "నూతన పార్లమెంటు భవనాన్ని తానే ప్రారంభించాలని మోడీ తీసుకున్న నిర్ణయం, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పూర్తిగా విస్మరించడం మన ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే కాకుండా దానిపై నేరుగా జరిగిన దాడి" అని ప్రతిపక్షాలు సంయుక్త ప్రకటనలో సముచితంగానే పేర్కొన్నాయి. ఈ అప్రజాస్వామిక క్రతువును దాదాపు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలన్నీ బహిష్కరించగా ఒడిషా, ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవడం దురదృష్టకరం, ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షాలు రెండూ దీన్ని సమర్ధించడం సిగ్గుచేటైన విషయం. ఏమైనా దేశ ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవలసిన నూతన పార్లమెంటు భవన ప్రారంభం అనే పండుగ దినాన్ని మోడీ ఆయన హిందూత్వ విధానాలు ప్రజాస్వామ్యంపై దాడి చేసే దుర్దినంగా మార్చేశాయి. దీనికిగాను ఆయనకూ, ఆయన పార్టీకీ, దాని వెనుకనున్న చీకటి శక్తులకూ ప్రజలు ప్రతిఫలం అందజేయాలి.

# పార్టీ ఐక్యత, పటిష్టతకై దిద్దుబాటు ఉద్యమం



రచయిత సిపిఐ(ఎం)
ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి

**వి. శ్రీనివాసరావు**

దేశవ్యాపితంగా పార్టీ ఆంతరంగిక నిర్మాణాన్ని పటిష్టం చేసుకోడానికి, ఐక్యతను పెంపొందింప జేసుకోవడానికి దిద్దుబాటు ఉద్యమం నిర్వహించాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నిర్ణయించింది. గతంలో రెండు ముఖ్యమైన సందర్భాల్లో ఇలాంటి దిద్దుబాటు ఉద్యమాలు జరిగాయి. ప్రపంచీకరణ విధానాలు దూకుడుగా సమాజంపై దాడి చేస్తున్న నేపథ్యంలో అనేక దుర్లక్షణాలు, పెడధోరణులు పార్టీలో ప్రవేశించాయి. ఇవి పార్టీ నిర్మాణాన్ని బలహీనపర్చడమే కాకుండా ప్రజలనుండి పార్టీని దూరం చేశాయి. పార్లమెంటరీతత్వం, సంస్కరణవాదం, స్వీయ మానసిక ధోరణులు పార్టీ పురోగతికి ఆటంకంగా మారాయని వీటికి వ్యతిరేకంగా పార్టీలో ఆంతరంగిక పోరాటం జరపాలని 23వ మహాసభ పిలుపునిచ్చింది. విప్లవ పార్టీగా సిపిఐ(ఎం) నాణ్యతను పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై కలకత్తా ప్లీనం అనేక సూచనలు చేసింది. వాటిని అమలు జరపడంలోనూ నిర్లక్ష్యం, అలసత్వం కనిపిస్తున్నాయి. శాఖలు మొదలుకొని రాష్ట్ర కమిటీ వరకు పనిచేయించడంలో కీలక బాధ్యతల్లో ఉన్న హోల్‌టైమర్ల నాణ్యతలోనూ అనేక లోపాలున్నట్లు గుర్తించాము. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న లోపాల గురించి 23వ మహాసభ ప్రత్యేకంగా ప్రస్తావించింది. వీటిని దిద్దుకోవడానికి హోల్‌టైమర్ల పనిని ఒక పద్ధతి ప్రకారం సమీక్షించి రాష్ట్ర కమిటీ కొన్ని నిర్ణయాలు చేసింది. ఈ అనుభవాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్రంలో దిద్దుబాటు ఉద్యమాన్ని సమిష్టిగా, పట్టుదలతో సాగించాల్సిన అవసరం ఉంది. జూలైలో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశం ఈ అంశాలనే ప్రత్యేకంగా చర్చించనుంది.

దిద్దుబాటు ఉద్యమం ప్రధానంగా వ్యక్తుల లోపాలను సరిదిద్దే ప్రక్రియ. ఈ దిద్దుబాటు ఉద్యమాన్ని రెండు దశలుగా నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. మొదటి దశలో మూడు ప్రత్యేక అంశాలపై చర్చించి నిర్ణయాలు చేయాలి. అవి.. 1) పార్టీ కమిటీల పనివిధానం, 2) కమ్యూనిస్టు ప్రమాణాలు, 3) ఆర్థిక క్రమశిక్షణ. ప్రస్తుతం పార్టీని ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యల్లో ఈ మూడూ అగ్రభాగాన ఉన్నాయి. అందుకే ఈ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. రెండవ దశను పార్లమెంట్ ఎన్నికల తరువాత నిర్వహిస్తుంది. అందులో ఏయే అంశాలను చర్చించాలో కేంద్ర కమిటీ తరువాత నిర్ణయిస్తుంది.

**పార్టీ మౌలిక స్వభావం :** సిపిఐ(ఎం) కార్మికవర్గ పార్టీ. విప్లవ పార్టీ. కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక-కర్షక ఐక్యత పునాదిగా జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మించి రాజ్యాధికారాన్ని సాధించాలి. పార్టీలోని వ్యక్తులకు, నాయకులకు పదవులు పొందడం మన లక్ష్యం కాదు. శ్రామిక వర్గానికి అధికారం కావాలి. అలాంటి వర్గ సంఘటన నిర్మించడంలో కార్మిక వర్గం చొరవ తీసుకోవాలి. తనకోసం తను పోరాడడమే కాకుండా ఇతరుల హక్కులు, తరగతుల కోసం కార్మికవర్గం పోరాడాలి. వారిలో ఆ చైతన్యాన్ని కమ్యూనిస్టు పార్టీ తీసుకురావాలి. కమ్యూనిస్టులు ఏ వర్గం లేదా సామాజిక తరగతి నుండి వచ్చినా శ్రామికవర్గ ప్రతినిధులుగా మారిపోవాలి. వర్గ దృక్పథాన్ని అలవరుచుకోవాలి. దీన్నే డీ-క్లాస్ కావడం అంటాము. 1950లలో ఒకసారి చౌఎన్‌లై, కృశ్చేవ్‌ల మధ్య సైద్ధాంతిక అంశాలపై చర్చలకోసం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృశ్చేవ్ నేను అచ్చమైన కార్మికవర్గం నుండి వచ్చాను, నీవు భూస్వామ్య కుటుంబం నుండి వచ్చావు అన్నాడు. చౌఎన్‌లై దానికి సమాధానమిస్తూ మనిద్దరం వర్గ ద్రోహులమే అన్నాడు. అంటే కృశ్చేవ్ కార్మికవర్గం నుండి వచ్చినా సామ్రాజ్యవాదులకు బంటుగా, పెట్టుబడిదార్ల ఏజెంటుగా మారాడు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చౌఎన్‌లై కార్మికవర్గ ప్రతినిధిగా మారి భూస్వామ్యవర్గాన్ని కూలద్రోసి వారి దృష్టిలో ద్రోహిగా మారాడు. దాన్ని దృష్టిలో పెట్టుకునే చౌఎన్‌లై ఆ మాటలన్నాడు. మన దేశంలో ఎంతటివారైనా ఏదో ఒక కులంలో పుట్టకతప్పదు. పుట్టిన తర్వాత అతని భావాలు, కృషి ఏ తరగతి కోసం ఉపయోగపడుతుందన్నదే ముఖ్యం. అదే కమ్యూనిస్టు చైతన్యానికి కొలబద్ద. పార్టీలోకి వచ్చాక కుల దురహంకారాన్ని లేదా కులతత్వాన్ని ప్రదర్శించడం క్షమించరాని నేరం. కులాన్ని బూర్జువా పార్టీల తరహాలో పార్టీలో లాబీలు నడపడానికి సాధనంగా వాడుకోవడాన్ని అనుమతించదు. కమ్యూనిస్టు ఒక కార్మికవర్గ పార్టీ ప్రతినిధిగా కుల వివక్షతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడాలి. కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి. ఇది వర్గ పోరాటంలో అంతర్భాగం. కమ్యూనిస్టు పార్టీలో నేను ఫలానా వర్కర్‌ను లేదా రైతును, నేను కూలీని లేదా భూస్వామిని, వ్యాపారస్తుడినంటూ ఎవరి వర్గం అస్తిత్వాన్ని వారు ప్రదర్శించరు. ఫలానా మతం, కులం వాడినని - కుల, మత, ప్రాంతీయ అస్థిత్వాలను కొనసాగించడం, ప్రదర్శించడం, కూడగట్టడాన్ని పార్టీ అనుమతించదు. పార్టీని ఏకశిలా సదృశ్యంగా తీర్చిదిద్దడమే పార్టీ నిర్మాణ లక్ష్యం. అందరం శ్రామికవర్గ ప్రతినిధులం అన్న చైతన్యంతో పనిచేయాలి. అయితే అదే సమయంలో సమాజంలో వున్న కుల, మత, వర్గ, ప్రాంతీయ, లింగ అసమానతలను వాస్తవాలుగా గుర్తించి వాటి నిర్మూలనకు కృషి చేయాలి. వివక్షతలపై

పోరాడాలి. ఎలాంటి వివక్షతలు లేని సమాజాన్ని నిర్మించడమే కమ్యూనిస్టుల లక్ష్యం. అది సోషలిజంలోనే సాధ్యం.

**పార్టీ కమిటీల పనివిధానం :** పార్టీ రోజువారీ పనిలో కీలకపాత్ర కమిటీలదే. కేంద్ర కమిటీ మొదలుకొని మండల కమిటీల వరకు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై ఆధారపడే పార్టీ పురోగతి ఉంటుంది. సిపిఐ(ఎం) కమిటీలు మిగతా పార్టీలకన్నా భిన్నంగా పనిచేస్తాయి. సిపిఐ(ఎం) నిర్మాణంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం శరీరంలో నాడీ మండల వ్యవస్థలా పనిచేస్తుంది. బడా పెట్టుబడిదారీ నాయకత్వంలోని బూర్జువా, భూస్వామ్య వర్గపాలనను అంతమొందించి జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై ఆధారపడిన నిర్మాణ వ్యవస్థ కీలక భూమికను పోషిస్తుంది. పార్టీ సభ్యులకు, ప్రజలకు మధ్య బలమైన బంధాన్ని నిర్మించడంలో కమిటీలు చేసే నిర్ణయాలే కీలకం. ప్రజాసంఘాలను గైడ్ చేయడంలో, పార్టీ శాఖలను నడిపించడంలో ఈ కమిటీలదే ముఖ్యపాత్ర. క్షేత్రస్థాయి కృషి, క్షేత్రస్థాయి నాయకత్వం బలపడకుండా ప్రజలకు బలమైన నాయకత్వాన్ని అందించ లేము. క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వం లేకుండా నయా–ధనికవర్గంగా రూపాంతరం చెందిన భూస్వామ్య పెత్తందారీ శక్తులను ఎదుర్కోలేము. నాయకత్వం పని శైలిలో ప్రజాపంథాను అనుసరించాలని కలకత్తా ప్లీనం పిలుపునిచ్చింది. కానీ దీనిని అర్థం చేసుకోవడంలోనూ, అనుసరించడంలోనూ అనేక లోపాలు, బలహీనతలు కొనసాగుతున్నాయి. వివిధ స్థాయి నాయకత్వాలు పార్టీని ప్రజలకు అనుసంధానం చేయడంలో చైతన్యవంతమైన కృషి చేయడం లేదని పార్టీ ఆత్మవిమర్శ చేసుకున్నది. క్రింది కమిటీలు రెగ్యులర్‌గా పై కమిటీకి రిపోర్టులు పంపుతుండాలి. కార్యకలాపాలేకాక స్థానిక ప్రజల స్థితిగతులు, రాజకీయ మార్పులు గురించి పంపాలి. పై నుండి వచ్చే నిర్ణయాలను అమలు చేయాలి. సంబంధిత కమిటీ నిర్ణయాలతో పై కమిటీ నిర్ణయాలు సమన్వయం చేసుకోవాలి. అందువలన నాయకత్వ స్థానాల్లో ఉన్న కామ్రేడ్స్ పని శైలి, నైపుణ్యం అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. సమాజంలోని అనేక పెడధోరణులకు నాయకత్వ స్థానాల్లో ఉన్నవారు కూడా గురవుతారు. పార్టీ నిర్మాణ స్ఫూర్తికి భిన్నంగా పార్టీలో పైస్థాయిలకు ఎగబాకాలన్న తపన, ఆర్థికంగా బలపడాలనే వాంఛ, వీటి

“నాయకత్వం పని శైలిలో ప్రజాపంథాను అనుసరించాలని కలకత్తా ప్లీనం పిలుపునిచ్చింది. కానీ దీనిని అర్థం చేసుకోవడంలోనూ, అనుసరించడంలోనూ అనేక లోపాలు, బలహీనతలు కొనసాగుతున్నాయి. వివిధ స్థాయి నాయకత్వాలు పార్టీని ప్రజలకు అనుసంధానం చేయడంలో చైతన్యవంతమైన కృషి చేయడం లేదని పార్టీ ఆత్మవిమర్శ చేసుకున్నది. క్రింది కమిటీలు రెగ్యులర్‌గా పై కమిటీకి రిపోర్టులు పంపు తుండాలి. కార్యకలాపాలేకాక స్థానిక ప్రజల స్థితిగతులు, రాజకీయ మార్పులు గురించి పంపాలి.”

సాధనకు తప్పుడు పద్దతులు అనుసరించి అయినా సాధించాలనుకోవడం, వ్యక్తి ప్రయోజనాల చుట్టూ గ్రూపులు కట్టడం, బూర్జువా పార్టీల తరహాలో మీడియాకు ఎక్కడం, బయటి శక్తుల జోక్యాన్ని అనుమతించడం లాంటి పెడధోరణులు పార్టీలోకి ప్రవేశిస్తాయి. వీటిని సమిష్టిగా, చైతన్యయుతంగా ఎదుర్కోవడానికి పార్టీ కమిటీలు చేసే ఆంతరంగిక పోరాటం కీలకమవుతుంది.

**ఫ్రాక్షన్ కమిటీల పని :** పార్టీ ఫ్రాక్షన్ కమిటీలకు, ప్రజాసంఘాల సాధారణ కార్యవర్గాలకు చాలా మంది తేడా చూడడం లేదు. ప్రజాసంఘాల ఉన్నత వేదికలుగా పార్టీ ఫ్రాక్షన్ కమిటీలను భావిస్తుంటారు. ప్రజాసంఘాల కమిటీలో చర్చించాల్సిన విషయాలను కూడా ఫ్రాక్షన్ కమిటీల్లో చర్చిస్తుంటారు. ఆయా రంగాలలో పార్టీని నిర్మించాల్సిన కీలక బాధ్యతను ఫ్రాక్షన్ కమిటీలను నడపడంలో విస్మరిస్తుంటారు. ఫ్రాక్షన్ కమిటీల సమావేశాల నోటీసులను, నిర్ణయాలను కూడా ప్రజాసంఘాల లెటర్‌పాడ్స్‌పై పంపిస్తుంటారు. ప్రజా సంఘాలలో ప్రమోషన్‌లకు పార్టీ సభ్యత్వాన్ని ఒక మెట్టుగా భావించేవారు అనేకమంది ఉన్నారు. ఈ పొరపాటు అభిప్రాయాన్ని తొలగించాలి. ఫ్రాక్షన్ కమిటీలను సంబంధిత పార్టీ కమిటీలు నియమిస్తాయి. ఉదా:– ఒక పార్టీ జిల్లా కమిటీ తన పరిధిలో ఒక రంగానికి ఫ్రాక్షన్ కమిటీని దానికొక కన్వీనర్‌ను నియమిస్తుంది. ఇందులో ఆ ప్రజారంగంలోని ఆఫీసు బేరర్‌లే కాకుండా అవసరమైతే ఒకరిద్దరు బయటివారిని కూడా చేర్చవచ్చు. పార్టీ సభ్యులు కానివారు ఈ ఫ్రాక్షన్ కమిటీలలో ఉండరు. ఈ కమిటీలు సంబంధిత పార్టీ కమిటీలకు బాధ్యత వహిస్తాయి. అంతేగానీ ఆ ప్రజారంగంలోని పై కమిటీకి బాధ్యత వహించవు. కొన్నికొన్ని సందర్భాలలో ఒక ప్రజాసంఘం పై కమిటీ బాధ్యులు క్రింది కమిటీల్లోని ఫ్రాక్షన్ కమిటీలకు హాజరవుతుంటారు. ఈ సమావేశం ఏర్పాటు గురించిగానీ, నిర్ణయాల గురించి సంబంధిత పార్టీ కమిటీలకు తెలియజేయరు. ప్రజాసంఘం పై కమిటీ బాధ్యులు క్రిందిస్థాయిలోని పార్టీ ఫ్రాక్షన్ కమిటీలకు సంబంధిత పార్టీ కమిటీ అనుమతి లేకుండా హాజరు కాకూడదు. సంబంధిత రంగం ఇన్‌చార్జికి సమాచారం ఇవ్వాలి. ఆ కమిటీల బాధ్యులతో సమన్వయం చేసుకోవాలి. ప్రజాసంఘాల కమిటీలు పై నుండి క్రిందకు నిర్మాణమవుతాయి. ఫ్రాక్షన్ కమిటీలు ఎక్కడికక్కడే కమిటీల పరిధిలో ఉంటాయి. ఒక జిల్లా స్థాయి ప్రజాసంఘంలో పార్టీ నాయకత్వం అనుసరించే పద్ధతులపట్ల పై కమిటీ స్థాయిలోని ఒక ప్రజారంగం బాధ్యులకు భిన్నాభిప్రాయాలుంటే వాటిలో నేరుగా జోక్యం చేసుకోకూడదు. సంబంధిత పార్టీ కమిటీల ద్వారా మాత్రమే వాటిని పరిష్కరించుకోవాలి. ఒక ప్రజారంగంలోని వివిధ పార్టీ సభ్యులమధ్య ఉండే బేధాభిప్రాయాల పరిష్కారానికి పార్టీ కమిటీలే బాధ్యత వహించాలి. పత్యేకంగా అవసరమైతే పై కమిటీ రంగాల బాధ్యుల సహకారాన్ని ఆ పార్టీ కోరవచ్చు. సంబధిత ఫ్రాక్షన్ కమిటీల ద్వారా వాటిని పరిష్కరించాలి. ఫ్రాక్షన్ కమిటీల నిర్ణయాలు ఆటోమెటిక్‌గా అమలు కావు. అవి సంబంధిత కమిటీల ద్వారా వారి అనుమతితో మాత్రమే అమలవుతాయి. అవగాహన లోపం వల్ల ఈరోజు అనేక ఫ్రాక్షన్ కమిటీలు తప్పుదారిలో నడుస్తున్నాయి. వీటి ఫంక్షనింగు సరిదిద్ది పార్టీ నిర్మాణ సూత్రాలకనుగుణంగా పనిచేయించడం ఒక ముఖ్యమైన కర్తవ్యం. పార్టీ లేదా ఫ్రాక్షన్ కమిటీలు ఆయా ప్రజాసంఘాలపై తమ నిర్ణయాలు రుద్దకూడదు. సంఘాలను ప్రజాతంత్రయుతంగా, స్వతంత్రంగా పనిచేయించాలి. అదే సమయంలో పార్టీ నిర్ణయాన్ని అమలు చేసే బాధ్యత ఆ రంగంలోని

> **"టీమ్ వర్క్, కమిటీల ద్వారా సమిష్టిగా నిర్ణయాలు చేయడం రెండూ ఒకటి కాదు. నిర్ణయాలు సమిష్టిగా చేసినంత మాత్రాన అవి ఆటోమెటిక్‌గా అమలుకావు. నిర్ణయాలు అంగీకరించి అమలులో వెనకబడుతున్నవారు అనేకమంది ఉన్నారు. నిర్ణయాలు చేయడంలో కమిటీల పాత్ర ఎంత ఉండాలో అంతకు మించి వాటిని అమలు చేయడంలో ప్రత్యక్ష పాత్ర ఉండాలి. పార్టీ కేంద్రాలలో తగినంత మంది కార్యదర్శివర్గం లేదా కమిటీ సభ్యులు ఉంటేనే టీమ్ వర్క్ సాధ్యమవుతుంది."**

పార్టీ సభ్యులది. పార్టీ సభ్యులు కానివారికి నచ్చజెప్పుకొని అమలు చేయాలి. ప్రజాసంఘాలను పార్టీ జేబు సంస్థలుగా మార్చడాన్ని పార్టీ అనుమతించదు. సంఘాలు సంఘాలుగా స్వతంత్రంగా పని చేయాలి. అందులోని పార్టీ సభ్యులు పార్టీ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలి. ప్రజలకు పార్టీకి మధ్య ప్రజాసంఘాలు వారధిలాంటివి. ఆ ప్రజా సంఘాలకు పార్టీకి మధ్య అనుసంధానం పార్టీ సభ్యులు. ఈ అవగాహనతో ప్రజాసంఘాలలో పార్టీ సభ్యులు పనిచేయాలి. పార్టీ సభ్యులు ఆయా రంగాలలో పార్టీకి బాధ్యులుగా ఉంటారు. అంతేకానీ పార్టీలో వీరు ఆయా రంగాల తరపున ప్రతినిధులు కాదు. అందుకే కమిటీ సభ్యులకు సమగ్ర దృక్పథం వుండాలి.

**సమిష్టి పనివిధానం :** పార్టీలో నాయకత్వం అంటే సమిష్టి నాయకత్వమే. వ్యక్తిగత పోకడలను పార్టీ అనుమతించదు. నాయకుడు, అనుచరుడు అనే భూస్వామ్య తరహా పద్ధతి ఇక్కడ పనికిరాదు. ఎంత పెద్ద నాయకులైనా సమిష్టి నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిందే. సిపిఐ(ఎం) చరిత్రలో ఇలాంటి ఆదర్శవంతమైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పార్టీ 1964లో సిపిఐ(ఎం)గా ఏర్పడినప్పుడు ఇప్పుడు నవరత్నాలుగా భావిస్తున్న నాటి పొలిట్‌బ్యూరో మన పార్టీకి మార్గదర్శకంగా ఉంటుంది. సుందరయ్య, బసవపున్నయ్య మొదలుకొని బిటిఆర్, ఈఎంఎస్, ఎకెజి, జ్యోతిబసు, సూర్జిత్ లాంటి యోధులు కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేశారు. విబేధాలున్నా పరిష్కరించుకున్నారు. తమకు సమ్మతం కాని నిర్ణయాలను బలంగా అమలు జరిపి చూపెట్టారు. ముఖ్యంగా కార్యదర్శి స్థానంలో ఉన్నవారు టీం లీడర్‌గా వ్యవహరించాలి. తమ వ్యక్తిగత స్వేచ్ఛకన్నా సమిష్టి స్వేచ్ఛకు, ఉమ్మడి అభిప్రాయాలకు ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే సమిష్టి పనివిధానానికి కేంద్రంగా ఉండే టీమ్ బలపడుతుంది. కార్యదర్శి కేంద్రంగా వుండే టీమ్ ఐక్యతకు కేంద్రంగా వుంటుంది. అప్పుడది ఒక శక్తిగా మారుతుంది.

**టీమ్ వర్క్ :** టీమ్ వర్క్, కమిటీల ద్వారా సమిష్టిగా నిర్ణయాలు చేయడం రెండూ ఒకటి కాదు. నిర్ణయాలు సమిష్టిగా చేసినంత మాత్రాన అవి ఆటోమెటిక్‌గా అమలుకావు. నిర్ణయాలు అంగీకరించి అమలులో వెనకబడుతున్నవారు అనేకమంది ఉన్నారు. నిర్ణయాలు చేయడంలో కమిటీల పాత్ర ఎంత ఉండాలో అంతకుమించి వాటిని అమలు చేయడంలో ప్రత్యక్ష పాత్ర ఉండాలి. పార్టీ కేంద్రాలలో తగినంత మంది కార్యదర్శివర్గం లేదా కమిటీ సభ్యులు ఉంటేనే టీమ్ వర్క్ సాధ్యమవుతుంది. అందుకే కేంద్రాలను బలపర్చుకోవడం ఒక ముఖ్యమైన కర్తవ్యంగా పార్టీ భావిస్తుంది. ఒకసారి నిర్ణయం అయ్యాక దాని అమలులో ఊగిసలాటలు ఉండకూడదు. అలసత్వం పనికిరాదు. తేలిగ్గా తీసుకోకూడదు. ముఖ్యంగా భిన్నాభిప్రాయం ఉన్నవాళ్ళు అమలులో చురుగ్గా వ్యవహరించడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. నేను పలానా నిర్ణయాన్ని ఒప్పుకోలేదు కాబట్టి, నేను అమలు జరపను అనే హక్కు ఎవరికీ లేదు. అమలు జరపడంలో అందరికన్నా ముందుండాలి. ఏ నిర్ణయమైనా సరైందో కాదో ఆచరణలోనే రుజువవుతుంది. నిర్ణయాలయ్యాక రకరకాల సాకులు చెప్పి తప్పుకోవడం కొంత మందికి పరిపాటిగా మారింది. పని చేయనివారికి అభిప్రాయం చెప్పే హక్కు లేదని మావో అన్నాడు. ఇలాంటి వారికి అది చక్కగా అతికినట్టు సరిపోతుంది. ఒక నిర్ణయాన్ని అమలు జరపడంలో అనేక సూక్ష్మ వివరాలు ఇమిడి ఉంటాయి. కొన్ని ఆటంకాలు ఎదురవుతాయి. కొన్ని అవకాశాలూ లభ్యమవుతాయి. వీటిని ఎప్పటికప్పుడు భేరీజు వేసుకొని నిర్ణయాన్ని ముందుకు తీసుకుపోవడంలో టీమ్ ముఖ్యపాత్ర పోషించాలి. కార్యదర్శి కేంద్రంగా ఉండే ఈ టీమ్ సభ్యులు విడివిడిగా తాము తీసుకున్న పనులకు బాధ్యత వహించాలి. ఆ బాధ్యతలను నెరవేర్చడంలో వారు కేంద్రంగా వుండే టీమ్‌లో వర్క్ జరగాలి. తాను సభ్యుడిగా ఉన్న టీమ్ నిర్ణయాన్ని తాను నాయకత్వం వహించే టీమ్ ద్వారా అమలు చేయాలి. ఇలాంటి వివిధ టీమ్‌ల మధ్య జరిగే సమన్వయం ఒక యంత్రంలో ఉండే వివిధ విడిభాగాల మధ్య జరిగే సమన్వయం లాంటిదే. చక్రాలు ఒకదానికొకటి పెనవేసుకొని ఎలా యంత్రాన్ని నడుపుతాయో అలా టీమ్‌ల పని జరగాలి. ఒక చక్రానికి మరొక చక్రానికి సంబంధం లేకుంటే ఇంజన్ పనిచేయదు. గేర్ పడదు. బండి ముందుకు కదలదు. అలాగే ఏ టీమ్‌కు ఆ టీమ్ స్వతంత్రం అని భావిస్తే సమన్వయం లోపించి పనిలో సమగ్రత దెబ్బతింటుంది. ఇక్కడే టీమ్ సభ్యుల నిబద్ధత, చిత్తశుద్ధి బయట పడుతుంది. పనిలో టీమ్‌లీడర్, సభ్యులమధ్య బలమైన అనుసంధానం ఉండాలి. భిన్నాభిప్రాయాలుంటే సమీక్షల ద్వారా సవరించుకోవాలి. సభ్యులు తమ కార్యకలాపాల గురించి టీం లీడర్‌తో నిరంతరం మార్పిడి చేసుకోవాలి. అభిప్రాయాలు వ్యక్తపరచుకోవాలి. వారి మధ్య పొరపచ్చాలు ఉండకూడదు. పరస్పర గౌరవం, విశ్వాసం, నమ్మకం వుండాలి. అదే టీమ్ ముఖ్య లక్షణం. అది బలహీనపడితే నిర్మాణంపైనా దాని ప్రభావం వుంటుంది. నిరంతర అసంతృప్తి, సందర్భ రహితంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం, చెప్పిందే చెప్పడం, చేసిన నిర్ణయాలను తిరగదోడడం, నిర్ణయాలకు భిన్నంగా వ్యవహరించడం ఉమ్మడి శక్తిని దెబ్బతీసి పార్టీని బలహీన పరుస్తాయి. అందువల్ల టీమ్ వర్క్ ప్రాధాన్యతను అర్థం చేసుకొని వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకత్వం పనిచేయాలి.

**చర్చల్లో స్వేచ్ఛ - అమల్లో క్రమశిక్షణ :** వివిధ కమిటీల్లో ఉండే సభ్యులు సమిష్టి నిర్ణయాలు చేయడంలో కీలక భూమిక వహిస్తారు. సమిష్టి నిర్ణయాలు జరగాలంటే సమావేశాలు రెగ్యులర్‌గా జరపాలి. ఆ సమావేశాల్లో స్వేచ్ఛగా చర్చలు జరగాలి. చర్చల అనంతరం సమిష్టిగా ఉమ్మడి అభిప్రాయాలకు రావాలి. చర్చల పేరుతో ఎడతెగని చర్చలు చేయుడం పనికి ఆటంకమవుతుంది. అందువలన చర్చల్లో స్వేచ్ఛ తీసుకుంటూనే ఆ స్వేచ్ఛను పనికి

> "పార్టీలో స్వప్రయోజనాలు అజెండాగా కలిగిన కొన్ని శక్తులు తమ స్వీయ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ఉద్దేశపూర్వకంగా మీడియాకు కొన్ని లీకేజీలు ఇస్తుంటారు. ఈ సమస్యను మన రాష్ట్రంలో మరింత తీవ్రంగా ఎదుర్కొంటున్నాము. పార్టీలో జరిగే కొన్ని ఘటనలు, కమిటీల్లో వచ్చే కొన్ని చర్చల్ని ఆసరా చేసుకొని మసిపూసి మారేడుకాయ చేసి ఉన్నవి లేనివి, అసత్యాలు అర్థసత్యాలతో పార్టీ పై దుష్ప్రచారం చేయడం, నాయకత్వప్రతిష్టను దెబ్బతీయటం చివరికి శీలహరణం వరకు తెగించటం వంటి పద్ధతులు అనుసరిస్తున్నారు."

ఆటంకం కాకుండా చూసుకోవాలి. తమ స్వేచ్ఛను కాపాడుకుంటూనే ఇతరుల స్వేచ్ఛకు అవకాశం కల్పించాలి. ఆంతరంగిక ప్రజాస్వామ్యంలో ఉండే వైవిధ్యం ఇదే. ఒకసారి నిర్ణయం అయ్యాక దాని అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులు ఈ పర్యవేక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తారు. అవసరాన్ని బట్టి ఇతర కమిటీ సభ్యులు ముఖ్యంగా కేంద్రాల్లో ఉండేవారు, ఆఫీసు స్టాఫ్ దీనికి సహకార పాత్ర పోషిస్తారు. నిర్ణయాలు అమలు చేయడంలో చూపే నిబద్ధతనే, క్రమశిక్షణగా భావిస్తాం. పార్టీలో క్రమశిక్షణ స్వచ్ఛందంగా అమలు చేయాలి. అదే చైతన్యానికి కొలబద్ద.

**విమర్శ – ఆత్మవిమర్శ :** పని క్రమంలో వచ్చే లోపాలను సరిదిద్దుకోవడం, విమర్శ, ఆత్మవిమర్శ ద్వారానే సాధ్యం. లోపాలు, బలహీనతలు సరిద్దుకోకుండా పార్టీ ముందుకు పోదు. పెటీబూర్జువా అవలక్షణాలు కలిగినవారు ఈ విమర్శ, ఆత్మవిమర్శలను తట్టుకోలేరు, సహించలేరు. బూర్జువా మీడియా ప్రభావంలో పడి ఆత్మవిమర్శ అంటేనే భయపడిపోతుంటారు. తమ లోపాలకు ఇతరులను నిందిన్తుంటారు. విమర్శ, ఆత్మవిమర్శ ఒకరినొకరు వేధించుకునే యంత్రాంగం కాదు. ఒకరికొకరు తోడ్పాటునిచ్చుకుని సరిదిద్దుకోడానికి సహకరించుకునే యంత్రాంగం. కమ్యూనిస్టుగా తనను తాను తీర్చిదిద్దుకునే సాధనమే విమర్శ – ఆత్మ విమర్శ. భిన్నాభిప్రాయాలున్నంత మాత్రాన ఎవరినైనా లక్ష్యంగా చేసుకొని నాయకత్వం వేధింపులకు పాల్పడితే దాన్ని పార్టీ అనుమతించదు. ప్రతీకారేచ్ఛలు పార్టీ స్ఫూర్తికి భిన్నమైనవి.

**ఆంతరంగిక ప్రజాస్వామ్యం :** ఏ పార్టీలో లేని విధంగా సిపిఐ(ఎం)లో ఆంతరంగిక ప్రజాస్వామ్యం ఉంది. పార్టీ కార్యక్రమం మొదలుకొని రాజకీయ తీర్మానాలు, ఎన్నికల ఎత్తుగడలు, రోజువారీ అంశాలపై ఉద్యమాలు, పోరాటాలు అన్నీ ఉమ్మడిగా చర్చించుకొనే చేస్తారు. స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పడం, ఓపిగ్గా వినడం, అభిప్రాయాల్లోని తప్పులను సవరించుకోవడం, భిన్నాభిప్రాయాలను గౌరవించుకోవడం ఆంతరంగిక ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన అంశాలు. మెజారిటీ నిర్ణయాన్ని మైనారిటీ గౌరవించి అమలు చేయాలి. క్రింది కమిటీలు చెప్పే అభిప్రాయాలను ఓపిగ్గా వినడం, వాటిని పరిగణనలోకి తీసుకొని చర్చించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. అదే సమయంలో తుది నిర్ణయం పై కమిటీదే. నిర్మాణ పద్ధతులకు భిన్నంగా బయట ప్రచారంలో వాళ్ళు వీళ్ళు చెప్పే గాలినంతా పోగేసుకొచ్చి కమిటీలో చెప్పడం, నిర్ధారణ కాని విషయాలను, మరొకరు చెప్పిన విషయాలను వెరిఫై చేసుకోకుండా నేరుగా కమిటీలలో లేవనెత్తడం చేయడం అనైక్యతకు దారితీస్తుంది. సమావేశాల సమయం వృధా అవుతోంది. ప్రధాన కర్తవ్యాలపై కేంద్రీకరణ తగ్గుతుంది. వాటిని పూర్తిగా నివారించాలి.

**లీకేజీలు :** పార్టీలో స్వప్రయోజ నాలు అజెండాగా కలిగిన కొన్ని శక్తులు తమ స్వీయ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ఉద్దేశపూర్వకంగా మీడియాకు కొన్ని లీకేజీలు ఇస్తుంటారు. ఈ సమస్యను మన రాష్ట్రంలో మరింత తీవ్రంగా ఎదుర్కొంటున్నాము. పార్టీలో జరిగే కొన్ని ఘటనలు, కమిటీల్లో వచ్చే కొన్ని చర్చల్ని ఆసరా చేసుకొని మసిపూసి మారేడుకాయ చేసి మసాలాలు దట్టించి ఉన్నవి లేనివి, అసత్యాలు అర్థసత్యాలతో పార్టీపై దుష్ప్రచారం చేయడం, నాయకత్వ ప్రతిష్టను దెబ్బతీయటం చివరికి శీలహరణం వరకు తెగించటం వంటి పద్ధతులు అనుసరిస్తున్నారు. వీటితో పార్టీలో గందరగోళం సృష్టించటం, పార్టీలో కమిటీ సభ్యుల ద్వారా వీటిని కమిటీలలో ప్రశ్నించేటట్లు చేయటం, వాటినే ఎజెండాగా చర్చల్లోకి తీసుకురావడం పరిపాటిగా మారుతోంది. ప్రజా సమస్యలపై చర్చలు, రాజకీయ అంశాలు, ఉద్యమాలు పోరాటాలను దారితప్పించి సొంత అజెండాలపైకి మళ్లించడమే వీటి లక్ష్యం. పార్టీలో నిరాశ నిస్పృహలు, మందకొడితనం ఇవన్నీ ప్రవేశించి పార్టీని నిరాయుధంగా చేయటం, నిర్మాణాన్ని బలహీనపర్చటం దాని దుష్ఫలితాలే. మీడియాలో వచ్చే ఇలాంటి లీకేజీలను పార్టీ శ్రేణులు నమ్మకూడదు.

**నిర్మాణ సమస్యలకు సోషల్ మీడియా వేదిక కాదు :** సోషల్ మీడియా వచ్చిన తర్వాత వీటి వేగం పెరిగింది. ఎంతో కొంత నిజం ఉంటుందేమో అని నమ్మే వాళ్ళు ఉంటారు. లేదా దాన్ని ఇతరులకు షేర్ చేసే వాళ్ళు ఇతరులతో చర్చించే వాళ్ళు కూడా ఉంటారు. ఇలాంటివన్నీ కూడా పార్టీ పద్ధతులకు వ్యతిరేకం. 2019లో పార్టీ కేంద్ర కమిటీ సోషల్ మీడియాలో పార్టీ సభ్యుల నడవడిక ఎలా ఉండాలో మార్గదర్శకాలు రూపొందించింది. పార్టీ ఆంతరంగికచర్చలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడం చర్చించడం పార్టీ ప్రమాణాలకు, నిర్మాణానికి విరుద్ధమని అలాంటి చర్యలను సహించవద్దని కోరుతూ పార్టీ సభ్యులకు ఒక సర్కులర్ జారీ చేసింది. అయినప్పటికీ కొన్ని శక్తులు వీటిని నిరోధించడానికి బదులు తమ అకౌంట్లో నుండి కాకుండా ఇతరులు, శత్రువర్గాలు నడిపే వెబ్‌సైట్లలో వీటిని పెట్టించి వాటిని వాట్సాప్‌ల ద్వారా గ్రూపుల్లో షేర్ చేయడం, ఎవరో రాశారని ఇంకొందరికి పంపటం, వారే స్వయంగా పార్టీ నాయకత్వానికి వీటిని షేర్ చేసి అమాయకత్వాన్ని ప్రదర్శించటం లాంటి తప్పుడు పద్ధతులు ఈరోజు కొందరు అనుసరిస్తున్నారు. పార్టీలోని పై కమిటీ సభ్యులు ఎవరైనా పద్ధతికి విరుద్ధంగా అంతర్గత విషయాలు మాట్లాడినా, స్వంత వ్యాఖ్యానాలు చేసినా వినీ విననట్లు వుండటం, ఆనందించడం పార్టీకి నష్టం. అలాగే క్రింది కమిటీల సభ్యులు ఏదైనా అభిప్రాయంపై వారితో చెబితే దానిపై పైకమిటీ నాయకులు అక్కడికక్కడే వ్యాఖ్యానాలు చేయడం, తప్పుడు పద్ధతుల్ని ప్రోత్సహించడం, తమకు నచ్చనివారిపై చేసే కామెంట్లు విని ఆనందించడం, ఖండించకపోవడం వంటి పద్ధతులు కమ్యూనిస్టు నిర్మాణ పద్ధతులకు వ్యతిరేకం. ఎక్కువ సందర్భాలలో పై కమిటీ నాయకులు చేసే వ్యాఖ్యానాలే ఎక్కువ నష్టం కలిగిస్తుంటాయి. తమకు తెలిసినా పేర్లు వెల్లడించడానికి కొంత మంది సిద్ధపడడం లేదు. ఉద్దేశపూర్వకంగా లీకేజీలు చేసే వారిని ఉపేక్షించడం, వారి గురించి పై కమిటీ దృష్టికి

**❝ పార్టీ నిర్మాణంలో అనుమతించ రాని లక్షణం ముఠాతత్వం అని కా॥ స్టాలిన్ పేర్కొన్నాడు. దాన్ని సహిస్తే పార్టీకి చెదలు పట్టిస్తుంది. ముఠాతత్వాన్ని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించాలి. బూర్జువా పార్టీలకు ముఠాల నిర్మాణమే పార్టీ నిర్మాణంగా ఉంటుంది. వ్యక్తులచుట్టూ ముఠాలు ఏర్పడతాయి. ముఠాలన్నీ కలిసి పార్టీగా ఉంటాయి. కమ్యూనిస్టు పార్టీ ఇలాంటి ముఠాతత్వాన్ని అనుమతించదు. అంగీకరించదు. ముఠా తత్వం పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది. ❞**

తీసుకురాకపోవడం సరైన పద్ధతి కాదు. మనకెందుకీ రిస్క్ అనుకోవడం పార్టీకి తెలిసీ నష్టం చేయడం. దీన్ని అరికట్టడం ఈరోజు ముఖ్యమైన కర్తవ్యం. పార్టీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అన్ని స్థాయిల్లోని శ్రేణులు ఐక్యంగా ఎదుర్కోవటం మినహా మరో మార్గం లేదు. పార్టీలో ఉండే విభేదాలు, బేధాభిప్రాయాల పరిష్కారానికి ఇది వేదిక కాదు. పద్ధతి కాదు. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు ఇలాంటి తప్పుడు పద్ధతుల్ని ఎదుర్కోవాలి. పార్టీ దృష్టికి తీసుకువచ్చి వాటిని అరికట్టేందుకు ప్రయత్నించాలి.

**ముఠాతత్వం :** ఆంతరంగిక ప్రజాస్వామ్యం పేరుతో భిన్నాభిప్రాయాన్ని కమిటీల వెలుపల వెల్లడించడం, ఫోరంతో సంబంధం లేని వ్యక్తులతో షేర్ చేసుకోవడం, మీడియాకు ఎక్కడం, మీడియా ద్వారా పార్టీమీద ఒత్తిడి తేవాలనుకోవడం, తమకు నచ్చనివారిపై బురద చల్లడం, వ్యక్తులపట్ల కోపతాపాలను బహిరంగంగా ప్రదర్శించడం మొదలగు చర్యలు ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చి ముఠాతత్వానికి ప్రాతిపదికను ఏర్పర్చుతాయి. అనైక్యతకు మూలమైన భిన్నాభిప్రాయాలను ప్రాథమిక దశలోనే పరిష్కరించుకోవడం ద్వారా ఐక్యతను కాపాడుకోవచ్చు. కొన్ని కమిటీలు భిన్నాభిప్రాయాలు చూసి భయపడి ఏదోరకంగా వాటిని పక్కకు తోసేస్తుంటాయి. పై కమిటీ బాధ్యులు కూడా అలసత్వంతో ఆలస్యం చేస్తుంటారు. దీనివల్ల భిన్నాభిప్రాయాలు ముదిరి అసంతృప్తికి దారితీసి పనికి ఆటంకంగా మారతాయి.

పార్టీ నిర్మాణంలో అనుమతించ రాని లక్షణం ముఠాతత్వం అని కా॥ స్టాలిన్ పేర్కొన్నాడు. దాన్ని సహిస్తే పార్టీకి చెదలు పట్టిస్తుంది. ముఠాతత్వాన్ని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించాలి. బూర్జువా పార్టీలకు ముఠాల నిర్మాణమే పార్టీ నిర్మాణంగా ఉంటుంది. వ్యక్తులచుట్టూ ముఠాలు ఏర్పడతాయి. ముఠాలన్నీ కలిసి పార్టీగా ఉంటాయి. కమ్యూనిస్టు పార్టీ ఇలాంటి ముఠాతత్వాన్ని అనుమతించదు. అంగీకరించదు. ముఠా తత్వం పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది. ముఠాతత్వం పట్ల రాజీ పార్టీని బలహీన పర్చడమేగాకుండా ముఠాతత్వానికి కూడా బలం చేకూరుస్తుంది. అలాంటి పార్టీ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడలేదు. వర్గ పోరాటానికి సారధ్యం వహించలేదు. శత్రువులు దాన్ని ఉపయోగించుకుంటారు. బలహీనుల్ని టార్గెట్ చేసి కోవర్టుగా మార్చుకుంటారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవం ఇదే. భిన్నాభిప్రాయాలను అంశాలవారీ పరిష్కరించడం ద్వారా మాత్రమే ఐక్యతను పెంపొందించగలము. ఎక్కువ సందర్భాల్లో పార్లమెంటరీ తత్వమే ముఠాతత్వానికి మూలమవుతుంది. అందువలన ఈ రెంటికీ వ్యతిరేకంగా పోరాడడం ద్వారా మాత్రమే పార్టీ ఐక్యత బలపడుతుంది.

గత కొంతకాలంగా పార్టీ ప్రజా పునాది బలహీనపడుతున్న నేపథ్యంలో నిర్మాణం కూడా సడలింది. అంతర్జాతీయంగా ఎదురైన దెబ్బలు, దేశంలో మతోన్మాదం పుంజుకోవడం, వామపక్షాల బలం తగ్గిపోవడం తదితర కారణాలతో కొంతమంది పార్టీ పట్ల విశ్వాసాన్ని కోల్పోయారు. ఇలాంటివారు తాము నిరాశ నిస్పృహలకు గురికావడమే కాకుండా తమ తోటి వారిని కూడా వెనక్కి గుంజుతుంటారు. అలాంటి వారు కొందరు పార్టీ సభ్యులుగా డ్రాప్ అయిన పరిస్థితి కూడా ఉంది. ఈ స్థితిలో పార్టీ ప్రజా పునాదిని స్వతంత్ర బలాన్ని పెంచుకోవడం అత్యంత కీలకం. స్థానిక సమస్యలు మొదలుకొని జాతీయ సమస్యల వరకు ప్రజల్ని సమీకరించి పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించాలి. ప్రజా సమూహాల్లోనీ ఉన్నత శ్రేణిని గుర్తించి వారి చైతన్యాన్ని పెంచాలి. ఉద్యమ కృషికి రాజకీయ కృషిని జోడించడం ద్వారా మాత్రమే ప్రజా పునాది సంఘటితమవుతుంది. ప్రజల మధ్య కృషిని, పార్టీ నిర్మాణాన్ని వేరువేరుగా చూడరాదు. ఈ రెండు ఏకకాలంలో నెరవేర్చాల్సిన కర్తవ్యాలు. నేడు ప్రజల్లో కమ్యూనిస్టుల పట్ల గౌరవం ఉంది. అభిమానం ఉంది. పార్టీ ఆశయబలం అంకితభావం కలిగిన కార్యకర్తలు, పెట్టుబడిదారీ విలువలకు భిన్నంగా కమ్యూనిస్టుల నైతికత నైతిక విలువలు ఈరోజు పార్టీకి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. వీటిని కాపాడుకుంటూ ప్రజాపునాదిని పెంచుకోవడం ద్వారా మాత్రమే పార్టీని ఒక అగ్రశ్రేణిరాజకీయ శక్తిగా మలచగలం. నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉండటం, అంతర్జాతీయ బలాబలాలలో వస్తున్న మార్పులు కమ్యూనిస్టులకు సానుకూలమైన నేపథ్యాన్ని సృష్టిస్తున్నాయి. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# హిందుత్వ సైన్యాన్ని తయారు చేస్తున్న ఆర్ఎస్ఎస్ పాఠశాలలు

**అస్త సవ్యసాచి**



రచయిత న్యూ ఢిల్లీలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు

దేశవ్యాప్తంగా ఉన్న విద్యాభారతి పాఠశాలలో తాము భారతీయ సంస్కృతిని నేర్పిస్తున్నామని ఆర్‌ఎస్‌ఎస్ తప్పుడు వాదన చేస్తున్నది. నిజానికి అది హిందుత్వ సిద్ధాం తాన్ని, ముస్లిం వ్యతిరేకతను చిన్నపిల్లల మనస్సులో సమర్ధవంతంగా నాటడానికి ఈ పాఠశాలలను ఉపయోగించు కుంటున్నది. కార్యక్రమం మొదలయే సమయం ఆసన్నమయింది. పాఠశాల వార్షికోత్సవానికి భారీగా సన్నాహాలు జరిగాయి. అట్టహాసంగా స్టేజ్ అలంకరించబడింది. విద్యుత్ దీపకాంతులతో హాల్ వెలుగు జిలుగులు నింపుతూ అతిథులతో కిటకిటలాడుతున్నది. వచ్చిన అతిథులంతా ఉన్నత వర్గాలకు చెందిన వారే. కేంద్రమంత్రి డివి సదానంద గౌడ్, పుదుచేరి గవర్నర్ కిరణ్ బేడీ, కర్ణాటక నుండి వచ్చిన అనేకమంది మంత్రులు అందులో ఉన్నారు.

**సకాలంలో స్టేజ్ తెరలు లేచాయి**

కనీసం 100 మంది విద్యార్థులు-అంతా 11, 12 తరగతులకు చెందిన వారే- తెల్ల చొక్కాలు, ప్యాంట్లు, కాషాయ ధోవతులు కట్టుకుని, కాషాయ జండాలు చేతపట్టుకుని స్టేజ్ పైకి వచ్చారు, వారంతా స్టేజ్ మధ్యలో ఉన్న భారీ పోస్టర్ దగ్గరకు వెళ్లారు. బాబ్రీ మసీదు చిత్రం ఉన్న పోస్టర్ అది. వెంటనే వ్యాఖ్యాత కన్నడంలో మైకులో వ్యాఖ్యానం మొదలు పెట్టారు : "వారు తమ చేతికందిన ఆయుధాలతో నిర్మాణాన్ని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఎంతో ఉత్సాహంగా హనుమంతుడి భక్తులు కోపంతో బాబ్రీ మసీదును కూల్చారు." వ్యాఖ్యానానికి స్టేజ్ పై ఉన్న విద్యార్థులు, స్టేజ్ కింద ఉన్న అతిథులు చప్పట్లు కొడుతూ తమ ఆనందోత్సాహాలను వ్యక్తం చేసారు-స్టేజ్ పైన ఉన్నవారంతా రామచంద్రుడికి జేజేలు! హనుమంతుడి కి జేజేలు- అంటూ నినాదాలు చేస్తూ బాబ్రీ మసీదు ఉన్న పోస్టర్‌ని చించి పోగులు పెట్టారు.

ఇది శ్రీ రామవిద్యా కేంద్ర ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో జరిగిన యదార్ధ సంఘటన. ఆ విద్యాలయం కర్ణాటకలోని దక్షిణ ప్రాంతం కల్లందకలో ఉంది. ఆ సంఘటన జరిగిన మరుసటి నెలలో సుప్రీంకోర్టు బాబ్రీమసీదులో జరిగిన సంఘటన "చట్ట వ్యతిరేకమైనదని" తీర్పు చెప్పింది. కానీ ఈ విద్యాలయంలో విద్యార్థులు అదే విధ్వంసాన్ని స్టేజ్ మీద ప్రదర్శించారు. ఆ పాఠశాల కర్ణాటకలోని కల్లడికా ప్రభాకర్ భట్ అనే ఆర్ ఎస్ ఎస్ నాయకుడిది. అలా నాటకాన్ని వేయడాన్ని భట్ సమర్థిస్తూ, "అదేం మసీదు కాదు, ఒక భవనం మాత్రమే. మేము చూపినది ఒక చారిత్రిక సంఘటన. బాబరు పిల్లలు ఎవరు? మేము ముస్లింలకు వ్యతిరేకం కాదు. మేము కేవలం తీవ్రవాదులకు వ్యతిరేకం. ఆ నాటకం ఒక చారిత్రిక సంఘటనను మాత్రమే చూపింది. అందులో సమస్య ఎక్కడుంది? "అన్నారు. ఈ భట్ గారు మన ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయ గురువులలో ఒకరు.

విద్యార్థులను హైందవీకరించడానికి కృషి చేసిన సంస్థలలో ఇదేం మొదటిది కాదు. ఆ సంస్థలన్నీ విద్యార్థులలో ఇస్లాం వ్యతిరేకత, అప్రజాస్వామిక, రాజ్యాంగేతర అసహన భావజాలం జొప్పిస్తుంటాయి.

నాగపూర్లోని భోంసలా సైనిక పాఠశాల (బి ఎం ఎస్)కి అనేక హిందూ తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు ఈ మధ్య తేలింది. 2008 లో మాలెగావ్ పేలుళ్ళు జరిగిన సందర్భంలోను, 2006 లో నాందేడ్ బాంబు పేలుడు జరిగినప్పుడు మహారాష్ట్ర తీవ్రవాద వ్యతిరేక బృందం (ఏ టి ఎస్)బి ఎం ఎస్ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నదని, తీవ్రవాదులను తయారు చేస్తున్నదని, బాంబులు వేసేందుకు సమావేశాలు వేస్తున్నదని, ప్రణాళికలు రచిస్తున్నదని కనుగొన్నారు. ఆర్ ఎస్ ఎస్ సీనియర్ నాయకులకు, వారి అనుబంధ సంస్థలకు బి ఎం ఎస్ తో సత్సంబంధాలు ఉన్నట్టు తేలింది. మాలెగావ్ బాంబు పేలుడు ఘటనలో ప్రథమ ముద్దాయి అయిన శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్ పూనాలో మహారాష్ట్ర మిలిటరీ ఫౌండేషన్ - దీనిని లెఫ్టినెంట్ కల్నల్ (విశ్రాంత) జయంత్ చితాలే నడుపుతున్నారు-లో చదివారని అక్కడ భద్రపరచబడిన అతిథుల పుస్తకంలో వివరాలలో తెలియవచ్చిందని అవుట్ లుక్ పత్రికలో రాశారు.

**గతం, వర్తమానం**

1946లో ఎం ఎస్ గోల్వాల్కర్ కురుక్షేత్రంలో ఆర్ ఎస్ ఎస్ మొదటి పాఠశాలను స్థాపించాడు. దాని పేరు గీత స్కూల్. కానీ నాథురాం గాడ్సే మహాత్మా గాంధీని హత్య చేసిన వెంటనే ఆర్ ఎస్ ఎస్ నిషేధించబడడంతో గీత స్కూల్ బడి నమూనాలు దేశమంతా వ్యాపించడానికి ఆస్కారం దొరకలేదు. కానీ 1952 లో నిషేధం ఎత్తివేసిన వెంటనే కృష్ణచంద్ర గాంధీ, భావురావు దేవరస్, నానాజీ దేశ్ ముఖ్ వంటి నాయకులంతా కలిసి భారతదేశంలో మొట్టమొదటి సరస్వతి శిశు మందిర్ ను ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక అద్దెఇంట్లో ఈ సంస్థ మొదటి పాఠశాల ప్రారంభమయింది. ఆనాడు దాని అద్దె నెలకు రూ 5/-.

క్రమంగా ఇటువంటి పాఠశాలలను దేశవ్యాప్తంగా నెలకొల్పారు. వాటన్నింటి యజమాన్య నిర్వహణకు శిశు శిక్ష ప్రబంధక్ సమితి ఏర్పాటు చేశారు. ఆ తరువాతి కాలంలో

> **"1977లో విద్యాభారతి అనే అఖిల భారత శిక్ష సంస్థాన్‌ను ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ఈ విద్యా సంస్థల కార్యకలాపాలను అనుసంధానం చేయడం, నిర్వహణ దీని పని. మహాత్మాగాంధీ హత్య: హిందూ మతతత్వ ప్రాజెక్ట్ అనే పుస్తకంలో ఆచార్య ఆదిత్య ముఖర్జీ, మృదుల ముఖర్జీ, సుచేత మహాజన్‌లు ఈ సంస్థ ఎందుకు ఏర్పడిందో, దీని ప్రాధాన్యత ఏమిటో వివరిస్తూ "ఇప్పటికే దేశంలో 500 ఆర్‌ఎస్ ఎస్ బడులు నెలకొల్పబడ్డాయి. ఇందులో 20 వేల మంది విద్యార్థులు ఉన్నారు" అని వ్రాసారు."**

అనేక ఇతర రాష్ట్రాలలో ఈ బడులు ప్రారంభం కావడంతో ఇటువంటి కమిటీలు ఢిల్లీ, బీహార్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ లలో కూడా ఏర్పడ్డాయి. పంజాబ్‌లో సర్వహిత శిక్షాసమితి ఏర్పాటు చేశారు. చండీఘర్, హర్యానాలలో హిందూ శిక్ష సమితులు ఏర్పడ్డాయి.

1977లో విద్యాభారతి అనే అఖిల భారత శిక్ష సంస్థాన్‌ను (విద్య భారతి) ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ఈ విద్యా సంస్థల కార్యకలాపాలను అనుసంధానం చేయడం, నిర్వహణ దీని పని. విద్యాభారతి కేంద్ర కార్యాలయం లక్నోలో రిజిస్టర్ చేసారు. కానీ కార్యకలాపాలు అన్ని ఢిల్లీ నుండే జరుగుతుంటాయి. మహాత్మాగాంధీ హత్య: హిందూ మతతత్వ ప్రాజెక్ట్ అనే పుస్తకంలో ఆచార్య ఆదిత్య ముఖర్జీ, మృదుల ముఖర్జీ, సుచేత మహాజన్‌లు ఈ సంస్థ ఎందుకు ఏర్పడిందో, దీని ప్రాధాన్యత ఏమిటో వివరిస్తూ "ఇప్పటికే దేశంలో 500 ఆర్‌ఎస్ ఎస్ బడులు నెలకొల్ప బడ్డాయి. ఇందులో 20,000 మంది విద్యార్థులు ఉన్నారు" అని వ్రాసారు.

విద్యాభారతి ఎలా విస్తరించిందో ఈ పుస్తకంలో వివరించారు. "1990 తొలినాళ్లలో బీజేపీ పాలిస్తున్న ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు విద్యాభారతి బడులను ప్రోత్సహించాయి. తమ పాఠ్యాంశాలను తామే రూపొందించుకునే అనుమతులను వాళ్ళకి ఇచ్చింది. వారి అధ్యాపకులకు కూడా వారే శిక్షణ ఇచ్చేవారు. 1993-94 కల్లా విద్యాభారతి నడిపే బడులు 6,000 లకు చేరాయి. ఆనాడు వారి ఆధ్వర్యంలో నడిచే మొత్తం బడులలో ఉపాధ్యాయుల సంఖ్య 40,000, విద్యార్థుల సంఖ్య 12,00,000 మాత్రమే. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత, 1998 కి విద్యారంగంలో ఆర్ ఎస్ ఎస్ ప్రభావం అంగలు పంగలుగా పెరిగింది. దానితో పాటుగా బడుల సంఖ్య కూడా పెరిగింది. 1999 కల్లా 14,000 విద్యాభారతి బడులు ఏర్పడ్డాయి; అందులో 80,000 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 18,00,000 విద్యార్థులు నమోదు అయ్యారు. 1998 సెప్టెంబర్ లో కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వం అన్ని రాష్ట్ర పాఠశాలలను ఆర్ ఎస్ ఎస్ శాఖలకు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. రాష్ట్రం ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని ప్రాథమిక పాఠశాలలలో ఆర్ ఎస్ ఎస్ ప్రచారకుల జోక్యానికి అనుమతించింది; ఆర్ ఎస్ ఎస్ ప్రచారకులు నైతిక శిక్షణ ఇవ్వడం తప్పనిసరి చేసింది."

తనకు భారతదేశ వ్యాప్తంగా 12,828 నియత విద్య సంస్థలు ఉన్నాయని, అందులో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని విద్యాభారతి వెబ్ సైట్ చెబుతున్నది. ఈ సంస్థకి సంస్కార కేంద్రాలు అనే పేరు మీద 6,400 అనియత విద్య సంస్థలు కూడా ఉన్నాయి. విద్యాభారతి లక్ష్యం, "హిందుత్వకి కట్టుబడే యువతి యువకులను తీర్చిదిద్దడం, వారిలో దేశభక్తి నింపడం" అని స్పష్టంగా పేర్కొంది. యువతను భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పరిపూర్ణంగా అభివృద్ధి చేయడం తన ధ్యేయమని, జీవితంలో ఎదుర్కొనే సవాళ్ళను సమర్ధవంతంగా తిప్పిగొట్టగలగడం బోధించాలని, పల్లెలలో, అడవులలో, గుహలలో, మురికి కూపాలలో మగ్గుతున్న వారికి, అనాధ అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్లకు తమ సేవలు వినియోగించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. తద్వారా వారిని సామాజిక సంకెళ్ల నుండి విముక్తులను చేయటంతో సౌభాగ్యవంతమైన, సామరస్యపూర్వకమైన, సాంస్కృతికంగా ఉన్నతమైన దేశాన్ని నిర్మించడానికి వారు ఉపయోగపడతారు" అని చెప్పుకుంటున్నది.

విద్యాభారతి, దాని పాఠ్యాంశాలను ది వైర్ వెబ్‌సైట్ పరిశీలించింది. అవి కేవలం మతవైషమ్యాలను రెచ్చ గొట్టేవిగా ,ఆర్ ఎస్ ఎస్ సైనికులను తయారుచేసేవిగా ఉన్నాయని కనుగొంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్‌లలో వీరి ఆధ్వర్యంలో నడుస్తున్న బడులలో విద్యార్థులతో మాట్లాడినప్పుడు కూడా ఇదే విషయం వెలుగులోకి వచ్చింది.

**విద్యాభారతి పాఠ్య పుస్తకాల నుండి...**

"కాన్పూర్‌లో గోవు మూత్రం ద్వారా జ్యోతిని ప్రజ్వలింప చేయగలమని కనుగొన్న యువ శాస్త్రవేత్త పేరు వ్రాయండి "– అనే ప్రశ్న వరుసక్రమంలో ప్రచురిస్తున్న బోధ్‌మాలలో 5 వ పుస్తంలో ఉన్నది. ఈ సిరీస్ నే విద్యాభారతి బోధిస్తుంటుంది.

ఈ బోధ్‌మాల సిరీస్ 4 నుండి 12 వ తరగతి వరకు బోధించే పుస్తకాలు, విద్యాభారతి సంస్కృతి శిక్షణ, ప్రధాన కార్యాలయం అయిన హర్యానాలోని కురుక్షేత్రం నుండి ప్రచురించబడుతుంటాయి. చరిత్ర, భౌగోళిక శాస్త్రం, రాజకీయ, వ్యక్తిత్వ వికాసం, అమరులు, నైతికత, పండుగలు(కేవలం హిందువులవే) మతానికి సంబంధించిన పుస్తకాలు, విజ్ఞానశాస్త్రం, సాధారణ విజ్ఞానం, వగైరా ఈ పుస్తకాలలో చర్చించబడుతుంటాయి. వాటిని బోధించేందుకు నైపుణ్యం గల ఉపాధ్యాయులు లేనందువలన విద్యార్థులే ఆ పుస్తకాలను చదువుకోవలసి ఉంటుంది. కానీ ఆ పుస్తకాల ఆధారంగానే దేశవ్యాప్తంగా సంస్కృతి జ్ఞాన పరీక్ష (అఖిల భారత సంస్కృతి పరీక్ష) నిర్వహించబడుతుంది. అందులో 50 శాతానికి మించి మార్కులు వచ్చిన వారికి పత్రాలు ఇవ్వబడతాయి. విద్యాభారతిలో చదవని విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరవుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరవుతుంటారని వైర్ నిర్వహించిన ఇంటర్వ్యూలలో తేలింది. అయితే ఆ హాజరు కేవలం విద్యార్థుల ఎంపికే. ప్రభుత్వాల నుండి ఒత్తిడి ఉండదు.

బోధ్‌మాల పుస్తకాలను పరిశీలిస్తే, అవి హిందూమతాన్ని కొనియాడడం, భారత దేశంలోని ప్రజల మనసులలో గర్వాన్ని నింపే ఏకైక మతంగా దానిని చిత్రించడం, పసి హృదయాలలో హిందుత్వ బీజాలు నాటటం కనిపిస్తుంది. "ఈనాటి యువతి యువకులకు మతం, సంస్కృతి జాతీయవాదం బోధిస్తున్నామని విద్యాభారతి సంస్థాన్ వాదిస్తుంటుంది. యువతి యువకులను మతం వైపు మళ్ళించడంలో భాగంగానే సంస్థాన్ మత సంబంధిత గ్రంథాలను

ప్రచురిస్తుంటుంది. వీటిలో అత్యధిక శాతం మతతత్వాన్ని, మితవాదాన్ని ప్రోత్సహించేవే. ఆర్ ఎస్ ఎస్ విధానాలు, కార్యక్రమాలను ప్రచారం చేసేవే."

**మతోన్మాదం, హిందూ ఆధిపత్యం**

హిందూ ఆధిపత్యాన్ని పసి మనసులలో నాటటమే బోధ్‌మాల ప్రచురణల లక్ష్యం. ప్రతి పుస్తకం ఈ లక్ష్యానికి అనుగుణంగానే ఉంటుంది. ఇవి 1. భారతదేశం నాగరికతలన్నిటికి మూలం. 2. హిందూ సనాతన ధర్మం అతి గొప్పదని చాటుతుంది. 3. ఇతర దేశాలను, వారి సంస్కృతులను, చరిత్రను ఎద్దేవా చేస్తుంది, అవమానిస్తుంది. ఉదాహరణకి బోధ్‌మాలలోని 8 వ పుస్తకంలో, ''హిందూ సంస్కృతి ఒక గొప్ప మహా సముద్రమంతటిది. ఇది ప్రపంచంలోని విభిన్న సంస్కృతులు, నాగరికతల సంగమం. ప్రపంచంలో అనేక సంస్కృతులు, నాగరికతలు పుట్టాయి. కానీ వాటి పేర్లు కూడా ఈనాడు మనకు తెలియవు. 'మానవులందరు భారతదేశంలోనే అవిర్భవించారు' అని ఉంటుంది.

ఈ సిరీస్‌లోని తొమ్మిదో పుస్తకంలో, "ఒకప్పుడు భూమి మీద క్రూరమైన మానవులు మాత్రమే జీవించేవారు. వారికి బట్టలు వేసుకోవడం తెలియదు, పశువులలాగా సంచరించేవారు. భాష తెలియదు. ఆలోచనలు లేవు. సంజ్ఞలు చేసుకునే వారు... పవిత్రమైన హిమసాగర్ మీదే మొదటిసారిగా మనిషి జన్మించాడని పేర్కొన్నారు. "ఈ పుస్తకాలు గొప్పలకుపోతూ ఉంటాయి. వాటిలో వాస్తవాల ధ్రువీకరణ ఉండదు, దావా చేసిన వాటి నిరూపణ ఉండదు, ఏ విధమైన ఆధారాలు ఉండవు. "హిందూ సంస్కృతి గుర్తులు గ్రీక్ నాణాలపై ఉన్నదంటుంది, అగస్త్య ఋషి(సం అగస్టీన్ ) పేరు మీద కొలంబియా పవిత్ర నగరం ఏర్పడిందంటుంది. బాబిలోన్‌లో కర్ణుడి చరిత్ర ప్రసిద్ధికెక్కింది అని, కాస్పియన్ సీ ప్రాంతం కశ్యపుడికి చెందినదని అంటారు. మలేసియా, జావా ద్వీపాల సాహిత్యంపై భారతదేశ ప్రభావం ఎక్కువగా ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. శ్యామ్‌దేశ్ జాతీయ పుస్తకం రామాయణమే. ఇరాన్ ప్రాచీన పేరు ఆర్యాన్ అని, పార్సీల ప్రాచీన గ్రంథాలలో – మేము ఆర్యుల కార్యాలకు బలులిస్తున్నామని ఉన్నదని" అంటారు.

బోధ్‌మాలలోని 6 వ పుస్తంలో, "ఈ విశ్వము 'బ్రహ్మ' యొక్క అపూర్వ చేతనం నుండి సృష్టించబడింది ... ప్రపంచంలోని అనేక

❝ విద్యాభారతి బడులన్నిటిలో గోడలన్నీ కాషాయ వస్త్రం ధరించి, సింహం తో ఉన్న, కాషాయ జండా పట్టుకున్న భరత మాత రూపం, ఆ వెనక భారీఎత్తున భారతదేశ జండా చిత్రించి ఉంటుంది. అది ఆర్ఎస్ఎస్ వారి విభజనకు గురికాని 'అఖండ భారత్ హిందుత్వ గుర్తు. దీనినే వారు బృహత్తర భారత్ అని, మహా భారతం అని అంటారు. అందులో ఆఫ్ఘనిస్తాన్, బాంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవ్స్, పాకిస్థాన్, శ్రీలంక ఉంటాయి. ❞

సంస్కృతులు సొంపయిన భారతదేశం నుండే అవిర్భవించాయి'' అని ఉంది. "చైనాలో సాంస్కృతిక దీప కాంతులకు కారణం ప్రాచీన భారతదేశం. ప్రాచీన చైనాకి భారతదేశం తల్లి వంటిది. వారి పూర్వీకులు భారత క్షత్రియులు. ఇరాన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్న ప్రజలు భారతీయులు. ఆర్యుల ప్రసిద్ధ గ్రంథం – వాల్మీకి రామాయణం యువనులను (గ్రీకులను), వారి ప్రముఖ కవి హొమార్‌ను ప్రభావితం చేసిందంటారు. అక్కడి స్థానిక భాష (రెడ్ ఇండియన్స్), ఉత్తర అమెరికా భాష, భారతీయ భాషల నుండే ఉద్భవించాయి."

మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 2005లో 'కేంద్ర విద్య సలహా బోర్డు 'ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వ విద్యా విధానానికి అవలనున్న పాఠ్య పుస్తకాల, సమాంతర పాఠ్య పుస్తకాల విధానాన్ని క్రమబద్ధీకరించడమే దాని లక్ష్యం. భారత దేశంలోని అనేక రాష్ట్రాలలో ఉన్న నిపుణులు, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విద్యా సంస్థలు, పౌర సంఘాలు ఒక్క చోటికి చేర్చబడ్డాయి. వాటి సలహాలు, సూచనలు తీసుకోడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఈ కమిటీ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న బడుల గురించి తీవ్రమైన ప్రకటన చేసింది. "పాఠ్యాంశాలు ప్రాచీన హిందూ దేశ విజయాలను మరీ అతిశయోక్తులుగా చూపాయి. వాటికి వాస్తవ ఆధారాలు గాని, గణాంకాలతో నిరూపణలు గాని లేవు. హిందూ మతతత్వంతో నిండి ఉన్నాయి. ఈ దేశం విదేశాల దాడులకు పదేపదే గురయినట్టు, ప్రధానంగా ముస్లిం పాలకుల దాడులకు గురైనట్టు చెబుతున్నవి. ముస్లిం పాలకులకు ముందు ఉన్న యుగాలలోనే అన్ని విజయాలు సాధించినట్టు చూపుతున్నారు. ఈ భూభాగంలో ముస్లిం, క్రిస్టియన్ సంస్కృతి ఆనవాళ్లే లేనట్టు చిత్రిస్తున్నారు. చరిత్ర అంతా ఒకే ఇరుసు చుట్టూ తిప్పబడుతున్నది. భారతదేశ ప్రజలలో హిందువులు నిజమైన భారతీయులుగా, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు 'ఇతర' భారతీయులుగా విభజించబడ్డారు, అంటే' హిందువులు', 'ఇతరులు'గా విభజించబడ్డారు, 'భారతదేశంలో ఒకజాతిని బాధితులుగాను, మరో జాతిని నిరంకుశులుగాను, ఒకరు దాడిచేసిన వారుగాను, మరొకరు పరాజితులుగాను చూపబడ్డారు. నిజానికి భారతదేశం అనాదిగా వివిధ సంస్కృతుల, భాషల, మిశ్రమ సంప్రదాయాల సమ్మిళిత సమాజం. ఆ విధంగా భారతీయులను సంకుచిత మనస్కులుగా, అసహనశీలురుగా భావితరాలకు చూపే ప్రయత్నాలు జరిగాయి."

**అఖండ భారతం**

విద్యాభారతి బడులన్నిటిలో గోడలన్నీ కాషాయ వస్త్రం ధరించి, సింహం తో ఉన్న, కాషాయ జండా పట్టుకున్న భరతమాత రూపం, ఆ వెనక భారీఎత్తున భారతదేశ జండా చిత్రించి ఉంటుంది. అది ఆర్ఎస్ఎస్ వారి విభజనకు గురికాని 'అఖండ భారత్ హిందుత్వ గుర్తు. దీనినే వారు బృహత్తర భారత్ అని, మహా భారతం అని అంటారు. అందులో ఆఫ్ఘనిస్తాన్, బాంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవ్స్, పాకిస్థాన్, శ్రీలంక ఉంటాయి. ఇవన్నీ ఒకప్పటి భారతదేశ భాగాలే అని వారి వాదన. ఇప్పటికీ ఇక్కడ ఆగస్టు 14 స్వతంత్ర దినోత్సవంగా జరపబడుతుందని ఈ విద్యాసంస్థల విద్యార్థులు ధృవీకరించారు. 1947, ఆగస్టు 14 వరకు భారతదేశం అఖండంగా ఉండేదని ఆర్ ఎస్ ఎస్ నమ్మడమే దీనికి ప్రధాన కారణం. 2003–2005 మధ్య మధ్యప్రదేశ్‌లోని భండారులోని సరస్వతి శిశు మందిర్‌లో చదివిన పూర్వ విద్యార్థి తిలక్ పాల్ సింగ్, "నిజానికి ఈ విద్యసంస్థలలో ఆగస్టు 15 కన్నా ఆగస్టు 14 కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని "అన్నారు.

వారి పాఠ్య పుస్తకాలలో కూడా అనేక చోట్ల 'అఖండ భారత్ అనే ఉంటుంది.

> **“ప్రతి బాలుడు దేవితో సమానం. ప్రతి బాలుడి శరీరం రాముడి మందిరం. ఆవు అంటే అమ్మంత ప్రియమైన నేల ఇది. ఇక్కడి సైనికులు సమర భూమిలో గీతను గానం చేసే వారు”. బోధ్‌మాలలోని 4 వ పుస్తకంలో ఉన్న ఈ వాక్యాలలో అన్ని హిందూ ముద్రలు ఉండడం వలన ఆ పసి మనసులలో భారత దేశం హిందూ దేశమనే ముద్రపడుతుంది. ఇక్కడ హిందూమతా నికి చెందిన -దేవి, రాముడు, గుడి, గోవు , భాగవద్గీత అన్ని మొత్తం దేశంలోని బాలలందరిని వర్ణించడానికి ఉపయోగించినవే.”**

బోధ్‌మాల పుస్తకాలలో దేశాల ప్రాచీన పేర్లు ఇలా ఉంటాయి- మోయ్ (మెక్సికో), ఆర్యన్ / పరశు దేశం (ఇరాన్), ఉపగణస్థాన్ (ఆఫ్ఘనిస్తాన్), లవా దీప్ (లావోస్) వరుణ్ ద్వీప్ (బోర్నియో),శ్యాం దేశ్ (థాయిలాండ్), చంపదేశ్ (వియాత్నం) బ్రహ్మ దేశ్ (మయనార్), మలే ద్వీప్ (మలేసియా). బోధ్‌మాల 5 లో “అఖండ భారతదేశాన్ని శత్రువులు విభజించడం మన ఆలోచనల్లో కూడా ప్రతిబింబిస్తుందని “అంటూ, “మనం తిరిగి అఖండ భారతదేశాన్ని పునర్ నిర్మించేందుకు శపథం చేద్దాము, దానినే కొలుద్దాం” అని విద్యార్థులు ప్రమాణాలు చేయాలని విజ్ఞప్తి చేస్తారు.

తిలక్ ఒక అంతర్జాతీయ సంస్థలో పని చేస్తారు. దానితో పాటుగా ఆయనకి ఆసక్తి ఉన్న నృత్య శాస్త్రం (ఆంత్రోపోలోజి)లో కూడా పరిశోధన చేస్తారు. “మా బడి వ్యాసరచనల పోటీలు కూడా నిర్వహించారు. సాధారణంగా అవి హిందుత్వ సిద్ధాంతాన్ని, అఖండ భారత్ ఆలోచనలని ప్రతిబింబించేవి. నాకు ఒక సారి జరిగిన ఆ పోటి జ్ఞాపకం ఉంది. అందులో వ్యాసరచనకు ఇచ్చిన అంశం ‘అఖండ భారత్ భావన అందులో హిందూత్వ స్థానం’ అని ఆయన చెప్పారు.

బీహార్‌లోని విద్యాభారతిలో ఉపయోగించే పుస్తకాలలో, ‘‘ఉన్నతమైన ‘సంస్కారం’ అలవరచుకున్న తరువాతే ప్రజలు ఆర్యులుగా పిలవబడ్డాడు. … తరువాత వారు ఉత్తర, దక్షిణాలకు పయనించి వైదిక సంస్కృతిని ప్రచారం చేసారు” అని ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లో, “ఈ నాడున్న భారతదేశ ఆధునిక భావనలో ‘దేశం’ కి ప్రాచీన కాలంలోని దేశం అర్థాన్ని చెప్పి, పసి మనసులలో ఆ భావనలను నాటి, వారిలో జాతి అనే గర్వాన్ని పాదుగొల్పాలని చైతన్యపూరితంగా ఆర్ ఎస్ ఎస్ కృషి చేస్తున్నదని సిఎబిఇ బోర్డు అభిప్రాయ పడింది.

బోధ్‌మాలలతో పాటుగా వి బి ఎస్ ఎస్ ఉపాధ్యాయులకు గైడ్ పుస్తకాలను కూడా ప్రచురించింది- ప్రవేశిక (ప్రాథమిక), మాధ్యమ (మధ్య ), ఉత్తమ (సీనియర్)లకు ఇవి ఉపయోగపడాలని భావన. ఈ పుస్తకాలన్నీ అఖండ భారత సిద్ధాంతానికి అనుగుణమైనవే. “త్రిష్టప (టిబెట్), ఉపగణస్థాన్ (ఆఫ్ఘనిస్తాన్) బ్రహ్మదేశ్ (మయన్మార్). సింహళ (శ్రీలంక) కింగ్పురుష్ (నేపాల్) ఒకప్పుడు భారతదేశంలో ఉండే స్వతంత్ర రాజ్యాలని నేటి నవచరిత్ర కారులు కూడా నిరూపిస్తున్నారు “అని ఉంది.

## హిందూ రాష్ట్రం

“ప్రతి బాలుడు దేవితో సమానం. ప్రతి బాలుడి శరీరం రాముడి మందిరం. ఆవు అంటే అమ్మంత ప్రియమైన నేల ఇది. ఇక్కడి సైనికులు సమర భూమిలో గీతను గానం చేసే వారు”.

బోధ్‌మాలలోని 4 వ పుస్తకంలో ఉన్న ఈ వాక్యాలలో అన్ని హిందూ ముద్రలు ఉండడం వలన ఆ పసి మనసులలో భారతదేశం హిందూ దేశమనే ముద్రపడుతుంది. ఇక్కడ హిందూమతానికి చెందిన -దేవి, రాముడు, గుడి, గోవు , భాగవద్గీత - అన్ని మొత్తం దేశంలోని బాలలందరిని వర్ణించడానికి ఉపయోగించినవే. ఈ పుస్తకంలోని మొదటి పంక్తులలో, “పవిత్రమైన పర్వత శ్రేణులు, నదులు, పుణ్యస్థలాలు, గుడులు, గురుద్వారాలు, ఇక్కడ అన్ని కాలాలలో నిర్మించబడ్డాయి అని ఉంది. వీటన్నిటిని చూసిన మనం పవిత్రమైన వారం, శుభాశీస్సులు పొందినవారం” అనే భావన కలగక మానదు.

బోధ్‌మాల లాగే ‘ఇతిహాస్ గా రహా హై’ (ఇతిహాసం గానం చేస్తోంది - ఐజిఆర్‌హెచ్ కూడా ఒక క్రమంలో అనుబంధ పుస్తకాలు విడుదల చేసింది. ఇవి కూడా విద్యాభారతి బడులలో బోధించబడు తున్నాయి. సిఏబిఇ నివేదికలు చండీఘర్ లో ఐజిఆర్‌హెచ్ సిరీస్ పై ప్రధానమైన విమర్శ చేసింది,” ఆర్ ఎస్ ఎస్ యొక్క ప్రధానమైన అంశమే ‘పవిత్ర భూమి’ ‘భరతమాత ‘(పుణ్యభూమి)తో సమానమని అనడం- ముస్లింలకు, క్రిస్టియన్లకు పవిత్ర భూమి మక్కా, ఇతర స్థలాలు ఉన్నాయని, కాబట్టి వారు భారతదేశానికి విధేయులు కారని చెబుతున్నారు. పిల్లలు తామెవరో గుర్తుంచుకోవాలని, అప్పుడే మళ్లీ బానిస బతుకు బతకరని ఈ పాఠ్య పుస్తకాలలో ఎద్దేవా చేస్తారు. అందులో ‘ఈ దేశం ఎవరిది ? ఎవరి మాతృ భూమి, పితృ భూమి, పుణ్యభూమి? ఎవరి సంప్రదాయాలు, పండగలు వ్యవసాయ కాలాలకు అనుగుణంగా జరుగుతాయి? శివాజీ, రాణాప్రతాప్, చంద్రగుప్త, శ్రీరాముడు, కృష్ణుడు, దయానంద్‌లను ఏ ప్రజలు గొప్ప నాయకులుగా కొలుస్తారు? (దానర్థం ఈద్, క్రిస్మస్ పండగలు మనవి కావని చెప్పడం). ఈ పుస్తకాల్లో తడవతడవకు ‘భరతమాత ‘గర్భం నుండి అనేకమంది వీరులు జన్మించారని, వారంతా ఆమెను కొలిచారని, గీతను చేబూని ఆమెకోసం మరణాన్ని కూడా ఆలింగనం చేసుకున్నారని, వందేమాతరం పెదవులపై నాట్యమాడుతూనే ఉండేదని” జి ఆర్ హెచ్ సిరీస్‌లలో వ్రాసారు.

## ఎవరు హిందువు?

హిందువు ఎవరన్నది ఈ పుస్తకాలలో స్పష్టంగా వివరించబడింది. దానితో పాటుగా హిందుత్వ “ఆదర్శప్రాయమైన సిద్ధాంతం”, “భారతదేశానికి ఈనాడు అవసరమైనది” అని చేర్చింది.

బోధ్‌మాల పదవ తరగతి పుస్తకంలో హిందువు ఎవరు అనే ప్రత్యేకమైన శీర్షిక ఉంది. అందులో, “హిందుత్వాన్ని నిర్వచిస్తూ డాక్టర్ రాధాకృష్ణ ‘హిందుత్వ’ ఒక జీవన విధానం, సరళమైన జీవితం, సంపద, సంప్రదాయం, పశువుల నుండి మానవ సమూహం వరకు ప్రతివారి సంక్షేమం కాంక్షించే ఆలోచనల వైపు ప్రవహింప చేస్తుందని” వ్రాసారు. దానితో పాటుగా “హిందుత్వ శక్తి ఒకటే మొత్తం ప్రపంచానికి శాంతిని, సంతోషాన్ని, సంపదను అందిస్తుంది. అదే ఈనాటి అవసరం. అదొక ఆదర్శప్రాయమైన జీవన విధానం. మనుషులు మనుషులుగా జీవించాలని బోధిస్తుంది. హిందుత్వాన్ని మతతత్వ విధానంగా భావించడం తప్పు. “అని చేర్చారు. సావర్కర్ రూపొందించిన సిద్ధాంతం, ‘‘హిందుత్వకు ప్రధానమైనవి’’ అనే కరపత్రంలో - దానినే “హిందుత్వ- ఎవరు హిందువు’’ అనే పేరుతో 1928లో

పునర్ముద్రించారు – "ఈ దేశంలో నివసిస్తున్న ప్రతి పౌరుడు హిందువే, అయితే వారు ఈ దేశాన్ని తమ మాతృభూమిగా, పితృభూమిగా, పవిత్రభూమిగా గౌరవించాలి. ''అని వ్రాసారు.

బోధ్‌మాల సిరీస్‌లోని ప్రతి పుస్తకంలో ఒక ప్రశ్న, సమాధాన పత్రం ఉంటుంది. ఆర్ ఎస్ ఎస్, విహెచ్ పి (విశ్వ హిందూ పరిషద్)లు విధేయులైన తమ అనుయాయులు ప్రచారం చేయడానికి, గుర్తుంచుకునే విధంగా ఆకర్షణీయంగా పొందుపరిచారు.

❝ 9 వ బోధ్ మాలలో భాగ్యచంద్ర అనే యువకుడు మణిపూర్‌లో వైష్ణవ మత ప్రచారానికి ఎలా కృషి చేసాడు అని, హిందూ మతాన్ని రాష్ట్ర మతంగా చేసిన వారెవరని మరో ప్రశ్న ఉంటుంది. అందులో "నారాయణ గురు నిర్మించిన గుడులు హిందూమత సమాజ నిర్మాణానికి కేంద్రాలుగా ఉండేవి. నారాయణ గురు గనక కేరళలో హిందూ సమాజం మత మార్పిడులకు గురికావడాన్ని అడ్డుకో కుండా ఉండి ఉంటే ఈ పాటికి అక్కడ హిందువులు మెజారిటీ నుండి మైనారిటీ మతంగా మారి ఉండేవారు. ❞

ప్రశ్న : శ్రీ రాముడు పుట్టిన అయోధ్యలో మొదటిగా గుడిని కట్టినది ఎవరు?

సమాధానం : శ్రీరాముడి కుమారుడు కుశలవ మహారాజు

ప్రశ్న : ఈ గుడిని ధ్వంసం చేసిన మొదటి విదేశీ ఆక్రమణ దారుడు ఎవరు?

సమాధానం : గ్రీస్‌కి చెందిన మీనాన్డర్ (150 బిసి )

ప్రశ్న : ప్రస్తుతం ఉన్న రాముడి గుడిని కట్టినది ఎవరు?

సమాధానం : చంద్రగుప్త విక్రమాదిత్య మహారాజు.

ప్రశ్న : 1033 ఏడి లో అయోధ్య గుడిని దోచుకున్న ముస్లిం దోపిడీ దొంగ ఎవరు?

సమాధానం :మొహమ్మద్ ఘజిని మేనల్లుడు సాలార్ మసూద్

ప్రశ్న : 1528 ఏ డి లో రాముడి గుడిని ధ్వంసం చేసిన ముఘల్ ఆక్రమణ దారుడు ఎవరు?

సమాధానం : బాబరు.

ప్రశ్న : బాబ్రీ మసీదు, మసీదు కాదు. ఎందుకని ?

సమాధానం : ముస్లింలు ఎవరు ఈ నాటి వరకు అక్కడ ప్రార్ధనలు చేసుకోలేదు కనక అది మసీదు కాదు .

ప్రశ్న : రాముడి గుడిని విముక్తి చేయడానికి 1528 ఏ డి నుండి 1914 వరకు ఎంతమంది రామభక్తులు తమ ప్రాణాలను బలిదానం చేసారు?

సమాధానం : మూడు లక్షల యాభై వేల మంది.

ప్రశ్న : ఇప్పటి వరకు విదేశీయులు రాముడి గుడి పై ఎన్ని సార్లు దండయాత్రలు చేసారు?

సమాధానం : డెబ్బై ఏడు సార్లు

ప్రశ్న : కరసేవ చేయడానికి శ్రీ రామకర సేవాసమితి నిర్ణయించిన తేదీ ఏది ?

సమాధానం : 1990 అక్టోబర్ 30.

ప్రశ్న : 1990 నవంబర్ 2 వ తేదీ మన భారతదేశ చరిత్రలో నల్ల అక్షరాలతో ఎందుకు లిఖించుకోవాలి ?

సమాధానం : ఎందుకంటే ఆనాడు ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి నిరాయుధులైన కరసేవకులపై పోలీసు కాల్పులు జరిపి, వందలాది కరసేవకులను పొట్టన పెట్టుకున్నారు.

ప్రశ్న : రామజన్మభూమిలో శిలాన్యాసం ఎప్పుడు జరిగింది?

సమాధానం: 1989 నవంబర్ 1 వ తేదీ.

ప్రశ్న : రాముడిని విముక్తుడిని చేయడానికి 1990 అక్టోబర్ 30 నుండి ఎన్ని పోరాటాలు జరిగాయి?

సమాధానం : 78 పోరాటాలు. మరికొన్ని ప్రశ్నలలోనే సమాధానాలు కూడా చేర్చబడ్డాయి.

ప్రశ్న : రామభకులైన కరసేవకులు రామజన్మభూమిలో ఎప్పుడు కాషాయ జండాని ఎగురవేశారు?

ప్రశ్న : కాషాయజండాని ఎగురవేస్తూ తమ ప్రాణాలు బలిదానం చేసిన యువకుల పేర్లేమిటి?

"విద్యాభారతి సాంస్కృతిక జ్ఞాన పరీక్షలో పాల్గొనే విద్యార్థులు రాముడిని విముక్తుడిని చేయడానికి తమ ప్రాణాలు అర్పించినట్టు చెప్పుకుంటున్న 3,50,000 మంది రామభక్తులపేర్లను గుర్తుంచుకోవాలి. రాజస్థాన్లోని నౌగుర్‌లో ఆర్ ఎస్ ఎస్ నిర్వహించే శారదా బాల్‌నికేతన్‌లో 1993–2005 మధ్య చదివిన వినయ్ సుల్తాన్ అనే 34 ఏళ్ల జర్నలిస్టు "రాజస్థాన్ విద్యాభారతి నిర్వహించే బడులలో 'సంస్కార్ సౌరవ్' అనే కార్యక్రమాలు నిర్వహించబడేవి. అందులో రామజన్మభూమి గురించి ,కొఠారి అన్నదమ్ముల గురించి చెప్పేవారు. (కొఠారి అన్నదమ్ములు కలకత్తా నుండి అయోధ్యకు 1990 అక్టోబర్ లో కరసేవలో పాల్గొనడానికి వచ్చారు. పోలీసు కాల్పులలో మరణించారు. అప్పుడు మరణించిన రామ్ వయసు 23, శరద్ వయసు 20 సంవత్సరాలు). వారు మాకు రాజస్థాన్లో రామజన్మభూమి ఉద్యమంలో 'ప్రాణత్యాగం' చేసిన వారి గురించి బోధించేవారు. ఆ తరువాతి కాలంలో గోద్రా సంఘటన గురించి కూడా ఒక అధ్యాయాన్ని చేర్చారు. 'సంస్కార్ సౌరవ్ 'కి ఒక పరీక్ష ప్రత్యేకంగా ఉండేది. చివరి పరీక్షకి దీని మార్కులు కూడా కలిసేవి. అది ఒక ప్రధానమైన పరీక్షే. అనుబంధం కాదు" అని వైర్ కి తెలిపాడు.

8 వ తరగతి బోధ్‌మాలలో కొఠారి అన్నదమ్ముల మీద ఒక ప్రశ్న ఉండేది. 9 వ బోధ్ మాలలో భాగ్యచంద్ర అనే యువకుడు మణిపూర్‌లో వైష్ణవ మత ప్రచారానికి ఎలా కృషి చేసాడు అని, హిందూ మతాన్ని రాష్ట్ర మతంగా చేసిన వారెవరని మరో ప్రశ్న ఉంటుంది. అందులో "నారాయణ గురు నిర్మించిన గుడులు హిందూమత సమాజ నిర్మాణానికి కేంద్రాలుగా ఉండేవి. నారాయణ గురు గనక కేరళలో హిందూ సమాజం మత మార్పిడులకు గురికావడాన్ని అడ్డుకోకుండా ఉండి ఉంటే ఈ పాటికి అక్కడ హిందువులు మెజారిటీ నుండి మైనారిటీ మతంగా మారి ఉండేవారు.

6 వ బోధ్‌మాలలో హిందూ మతం కోసం ప్రాణా లర్పించిన నాయకుల గురించి – "మీకు డబ్బు వస్తుంది. రాజ్యం వస్తుంది! కానీ ఎలా ?' కేవలం మీ మతాన్ని విడిచిపెట్టండి. ఇస్లాం మతం స్వీకరించండి.'

'అదెప్పటికీ సంభవం కాదు..'.

'చివరికి అయ్యన్నను చంపేశారు. ఆ పిల్లవాడు ఎవరో కాదు హాకీకత్ రే పృథ్విసింగ్.'

ఆ ఇతరులు ఎవరు ?

ఆర్ ఎస్ ఎస్ నిర్వహించే బడులలో జ్ఞాన సంస్కృతి అనే పేరు మీద నిర్వహించే కార్యక్రమాలు "సంస్కృతిని నేర్పే పేరుమీద యువతి యువకులకు మతమౌఢ్యం, మతోన్మా

**"'ఇతిహాస్‌గా రహాహై' 12 లో క్రైస్తవం గురించి ప్రస్తావిస్తూ... "ఈ మతాన్ని అనుసరిస్తున్నవారు చేసిన ద్రోహం వలనే భారతదేశం రెండుగా విభజించబడింది. ఈ నాటికీ క్రిస్టియన్ మిషనరీలు నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, కేరళ ఇతర అనేక రాష్ట్రాలలో దేశద్రోహాన్ని రెచ్చగొడుతున్నారు. భారతదేశ ఐక్యత ఈనాడు పెద్ద ప్రమాదంలో పడింది" అని చెప్పారు."**

దం నేర్పే ప్రయత్నాలే చేస్తున్నారు" అని సి ఏ బి ఇ కమిటీ చెప్పింది. నాలుగో తరగతికి బోధించే గౌరవ్ కథలు - సరస్వతి శిశు మందిర్ ప్రచురణలు- అశోకుడి కాలం గురించి చెపుతూ, "అహింస ఈ కాలంలోనే బోధించడం జరిగింది. అన్ని రకాల హింసలు దోషాలుగా పరిగణించ బడేవి. ఆఖరికి వేట, యజ్ఞాలలో బలులు ఇవ్వడం కూడా. ఆయుధాలు పట్టడమే నేరమైంది. అది సైన్యం పై దుష్ప్రభావం చూపింది. రాజ్యాన్ని నెమ్మదిగా పిరికితనం ఆవహించింది. బౌద్ధ బిక్షువులకు ఆహారాన్ని అందించే బాధ్యత రాజ్యం పై పడింది. ప్రజలు సన్యాసులుగా మారడం మొదలయింది. యుద్ధాలు చేసి ఆ యుద్ధాలతో సాధించిన విజయాలు చెడ్డవిగా పరిగణించ బడేవి. సరిహద్దులను కాపలాకాసే సైనికుల నైతికత దెబ్బతినింది. ... అహింస బోధించడం వలన ఉత్తర భారతదేశం బలహీన పడింది."

ఇస్లాం పెరగడం గురించి, "వారు ప్రతి చోటికి కత్తులు చేబూని వెళ్లేవారు. వారి సైన్యం నలువైపుల నుండి కమ్ముకెళ్లేది. ఏ దేశానికీ వెళ్లినా దానిని నాశనం చేసేవారు. ప్రార్ధనా మందిరాలు, విశ్వవిద్యాలయాలు ధ్వంసం చేసేవారు. గ్రంథాలయాలు అగ్నికి ఆహుతి చేసేవారు. మతగ్రంథాలు దహనం చేసేవారు. అమ్మలు, అక్కాచెల్లెళ్లు అవమానాలకు గురికావలసి వచ్చేది. దయా దాక్షిణ్యాలు వారెరుగరు. 'ఢిల్లీలోని కుతుబ్‌మినార్ నేటికీ కుతుబుద్దీన్ ఐబక్ పేరుమీద ఉంటుంది. కానీ దీనిని కట్టింది అతడు కాదు. అది అతడి వలన సాధ్యమయే పని కాదు. దీనిని కట్టినది సముద్రగుప్తుడు. దాని అసలు పేరు విష్ణు స్తంభం ... ఈ రాజు (కుతుబుద్దీన్ ఐబక్) నిజానికి అందులో కొన్ని భాగాలను తొలగించి పేరు మార్చుకున్నాడు' అని వ్రాసుకున్నారు.

శిశుమందిర్ బడులలో అదనపు బోధనలు చేసే 'ఇతిహాస్ గా రహాహై' (ఇతిహాసం గానం చేస్తున్నది) లో 5 వ తరగతికి చేసే బోధనలలో, "హిందువుల బలవంతపు మత మార్పిడులను గురించి ఉంది. కత్తితో బెదిరించి లెక్కలేనంత మంది హిందువులను ముస్లింలుగా మార్చుతున్నారు. స్వేచ్ఛకోసం చేసే పోరాటం మత పోరాటంగా మారింది. మతంకోసం అనేకమంది ప్రాణాలు పణంగా పెట్టారు. మనం ఒక పోరాటం తరువాత మరొకటి గెలుస్తూనే ఉన్నాము. మనం విదేశీయులను మన దేశంలో స్థిరనివాసం ఏర్పటుచేసుకోకుండా ఆపగలిగాము. కానీ మతం మారిన మన సోదరులను తిరిగి హిందూమతం వైపుకు తిప్పుకోలేకపోతున్నాము."

'ఇతిహాస్‌గా రహాహై' 12 లో క్రైస్తవం గురించి ప్రస్తావిసస్తూ... "ఈ మతాన్ని అనుసరిస్తున్నవారు చేసిన ద్రోహం వలనే భారతదేశం రెండుగా విభజించబడింది. ఈ నాటికీ క్రిస్టియన్ మిషనరీలు నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, కేరళ ఇతర అనేక రాష్ట్రాలలో దేశద్రోహాన్ని రెచ్చగొడుతున్నారు. భారతదేశ ఐక్యత ఈనాడు పెద్ద ప్రమాదంలో పడింది."

అదే పుస్తకంలో ముస్లింల గురించి... "విగ్రహారాధనను వ్యతిరేకించే వేలాదిమంది ముస్లింలు "శివలింగాన్ని" కొలవడానికి కాబాకి యాత్రగా వెళతారు. ముస్లిం సమాజంలో ఆ నల్లటి శివలింగాన్ని దర్శించుకోవడం జీవితంలో సాధించిన పెద్ద ఘనకార్యంగా భావిస్తారు. మరో చోట పిల్లల చేత ఖాళీలు పూరింపజేస్తారు. మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతవ్యాప్తికి ఏమి చేసాడనే ప్రశ్నకి సమాధానంగా 'రక్తపు టేరులు' పారించాడని సమాధానం వచ్చేటట్టు రాసారు.'

ఈ పుస్తకాలు విద్యార్థుల మనసులను మతమౌఢ్యం వైపుకి మార్చేవిగా ఉన్నాయి. హిందువుగా గుర్తించబడాలన్న పేరుతో, మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రచారం చేసేవిగా ఉన్నాయి- 1. హిందూ మతం ఔన్నత్యాన్ని, సంప్రదాయాలను ,రాజులను చరిత్రలోని ఇతరులను పదేపదే ప్రస్తావించడం ద్వారా, హిందువులు కాని వారిని దుష్టులుగా చూపే ప్రయత్నాలు చేయడం ద్వారా, వారిని కించపరచడం, వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం, వారి కృషిని చిన్నచూపు చూడడం జరుగుతుంది.

మధ్య ప్రదేశ్‌లో భండారులోని సరస్వతి శిశు విద్యా మందిర్ పూర్వ విద్యార్థి పుష్పేంద్ర సింగ్ బాగెల్ వైర్‌తో, "మాబడిలో ప్రతి క్రిస్మస్, కొత్త సంవత్సరం రోజు ఉపాధ్యాయులు ఇవి మన పండగలు కావని తరగతి గదిలో తప్పనిసరిగా చెప్పేవారు. విద్యాభారతి బడులలో పంచి పెట్టే దేవపుత్ర పత్రికలో కూడా ఈ విషయం ఉంటుంది. "మా పుస్తకాలలో 'సంస్కార సౌరభ్', లో ముస్లింల గురించి వ్రాసేటప్పుడు 'ఆక్రమణలు చేసేవారు', 'విదేశీ ఆక్రమణదారులు', అధర్ములు, వగైరా పదాలు వాడతారు. "దేవపుత్ర' లో ఆర్ ఎస్ ఎస్ సిద్ధాంత కర్తలు వ్రాసిన ఒక వ్యాసంలో, 1945-1949 మధ్య కాలంలో అనేక తప్పులు జరిగాయి. రెండు దేశాల సిద్ధాంతం అంగీకరించి ముస్లింలు ఒక దేశాన్ని తీసుకున్నప్పుడు, మనం హిందువులం ఒక దేశాన్ని ఎందుకు తీసుకొని ఉండకూడదు? యూరప్‌లో అన్ని దేశాలూ మతంతో ముడిపెట్టుకునే ఉన్నాయి. మన దేశానికి మాత్రం మతం ఎందుకుండకూడదు? అన్ని వ్యాసాలలో మత సామరస్య సహజీవనానికి చోటే లేదని వ్రాస్తారు. వారి పాఠ్య పుస్తకాలలో లౌకికతత్వం గురించి ఉండదు. భారతదేశంలో హిందువులు తప్ప ఇతరులు ఉండకూడని వారి సిద్ధాంతం. "మా ఉపాధ్యాయులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముస్లింలను నమ్మలేమని బోధిస్తారు. 'ముస్లింలు విదేశీయులు. వారు బయటి నుండి వచ్చారు హింసాయుతులు. వారు గతాన్ని మరిచిన హిందువులను తమ మతంలోకి మార్చారు. ప్రాణ భయంతో వారు ఆ రోజుల్లో మతం మారారు. అటువంటి వారిని ఎలా నమ్మగలం?'

పాఠ్యాంశాలన్నిటిలో 'మనం', 'ఇతరులు' అనే స్పష్టమైన విభజన ఉండేటట్టు చూస్తారు. బోధ్‌మాల 7 లో, "మేము పునర్జన్మను నమ్ముతాము- అంటే హిందువులు/జైనులు/బౌద్ధులు - అని అర్థం. మిగతా మతాలవారు పునర్జన్మను నమ్మరు కదా! బోధ్ మాలా 8 లో ఆర్ ఎస్ ఎస్ కి సంబంధించిన రంగు 'నిశ్శబ్దాన్ని సూచిస్తున్నట్టు, దానికి వైజ్ఞానిక, రసాయనిక గుణాలు ఉన్నాయి, త్యాగానికి పరిత్యాగానికి ప్రేరణ కల్పిస్తుందని' వ్రాసు

కున్నారు.'

మనము, ఇతరులను మరింత స్పష్టంగా బోధ్‌మాల 9 లో వివరించారు. “మన ఆచారాలు గంగాజలం లేకుండా ముగియవు. మనం గంగాజలాన్ని, గోవును, తులసిని మాతృ మూర్తులుగా భావిస్తాము.”

మేము కలిసి మాట్లాడిన విద్యార్థులంతా ఇదే అభిప్రాయాలను వెలిబుచ్చారు – మొత్తం బడిలో ఇద్దరు ముగ్గరికన్నా ఎక్కువమంది ముస్లిం విద్యార్థులు లేరు. మైనారిటీలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఒక్కరు కూడా లేరు. బడులలో ఎన్నడూ ముస్లిం, క్రిస్టియన్ పండుగలు జరుపుకోరు. ప్రిన్సిపల్ ఆర్ ఎస్ ఎస్ సభ్యుడు. సాధారణంగా శాఖా ప్రముఖుడు, బ్రాహ్మడు అయి ఉంటాడు. విద్యార్థులలో చాలామంది, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆర్ ఎస్ ఎస్ శాఖలకు క్రమం తప్పకుండా హాజరు అవుతుంటారు.

**చరిత్రను వక్రీకరించడం**

“విద్యాభారతి పాఠ్య పుస్తకాలలో వాస్తవాలకు, కథనాలకు, పౌరాణికాలకు బేధమే ఉండదు. హిందూ మతతత్వాన్ని పెంచడానికి, భారతదేశంలో ప్రధానంగా, పూర్తిగా, సదా ఒక హిందూ రాజ్యముండేదని చూపడానికి చరిత్ర పుస్తకాలను తయారు చేసినట్టు ఉంటాయి. హిందూ రాజుల అధీనంలో హిందూ రాజ్యాంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉండేదని, మహోన్నతంగా ఎదిగిందని చూపడం జరుగు తుంటుంది” అని సి ఏ బి ఇ నివేదిక స్పష్టం చేసింది. ఈ పాఠ్య పుస్తకాలు ప్రధానంగా మొఘల్ పాలకులు భారతదేశంపై దండయాత్ర చేయడం, హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడంలో వారి పాత్ర పైనే కేంద్రీకరించాయి. విద్యాభారతి పుస్తకాలలో మతవిద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రకటనలు ఉన్నాయి. .. ఉదాహరణకి “మొహమ్మద్ బిన్ కాసిం కుక్క చావు చచ్చాడు”, శివాజీ గో, ధర్మ, సంస్కృతి రక్షణ చేసాడు.., అతడు గోవులను, బ్రాహ్మణులను రక్షించే వాడిగా పేరు తెచ్చుకున్నాడు.” వీరు ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడిన హిందువుల పైనే దృష్టి పెట్టారు. ఉదాహరణకి హాకీకత్ రాయి, మహారాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ. నెమ్మెదిగా మీ మనసులపై హిందుత్వ ముద్ర పడేటట్టు చేస్తారు.”

భారతదేశంపై విదేశీయుల దండయాత్రలు, వారిపై ప్రతి దాడులు అనే పాఠం బోధ్‌మాలా 10 లో ఉంది. అందులో ఇరాన్ చక్రవర్తి పురుష మహాన్, (పురుషోత్తముడు), గ్రీక్ చక్రవర్తి అలెగ్జాండర్, అరబ్బులు

“విద్యాభారతి పాఠ్య పుస్తకాలలో వాస్తవాలకు, కథనాలకు, పౌరాణికాలకు బేధమే ఉండదు. హిందూ మతతత్వాన్ని పెంచ డానికి, భారతదేశంలో ప్రధానంగా, పూర్తిగా, సదా ఒక హిందూ రాజ్యముండేదని చూపడానికి చరిత్ర పుస్తకాలను తయారు చేసినట్టు ఉంటాయి. హిందూ రాజుల అధీనంలో హిందూ రాజ్యాంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉండేదని, మహోన్న తంగా ఎదిగిందని చూపడం జరుగు తుంటుంది” అని సిఏబిఇ నివేదిక స్పష్టం చేసింది.

చేసిన అనేక దండయాత్రలు, మొహమ్మద్ ఘజని, మొహమ్మద్ ఘోరీ, అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఇబ్రహీం లోది, వాస్కోడగామా ల దండయాత్రలు ఉన్నాయి. అందులో స్పష్టంగా “1947 లో పాకిస్థాన్ భారతదేశంలో ఒక భాగం. ఆ తరువాత మన శత్రువు అయింది. వారు ఏ రకమైన సందేశాలు లేకుండా గిరిజనులను మనపైకి దాడులకు పంపి కాశ్మీరుని లోబరుచుకునే ప్రయత్నాలు చేసారు. ఆజాద్ కాశ్మీర్ పేరుతో కొంత విజయాన్ని కూడా సాధించారు. కానీ భారత సైనికదళాలు దాడులను తరిమి కొట్టాయి.” బోధ్‌మాల పుస్తకాలలో దాడులు చేసిన వారి గురించి తప్పుడు కథనాలు వ్రాసారు. “రాణాప్రతాప్ భీకరయుద్ధంలో మొగలు సైన్యాన్ని ఓడించాడని, హల్దీఘాట్ యుద్ధం పరిసమాప్తం అయిందని” వ్రాయడాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

“ఈ పుస్తకాలు చాలామంది ఇతరుల కన్నా కొంతమంది నాయకులు గొప్పవారని అతిశయోక్తులతో ముంచెత్తి, పరమ పరాక్రమవంతులుగా చిత్రిస్తాయి. గాంధీ, నెహ్రూలు చేసిన పనుల గురించి చెప్పేటప్పుడు ఇతర హిందూ నాయకులు చేసిన కార్యకలాపాలకు కూడా సమాన ప్రాధాన్యత నిచ్చి చూపుతారు. ముస్లింలీగ్ సంస్థని మతతత్వ సంస్థగా చూపుతారు. నిజానికి అది వాస్తవమే. అయితే ఆర్ ఎస్ ఎస్ కి కూడా మతతత్వ దృష్టి ఉన్నా దాని గురించి మాట్లాడరు. ఆర్ ఎస్ ఎస్ హిందూరాష్ట్ర ఏర్పాటు తమ లక్ష్యం అని చెప్పుకోడాన్ని ఈ పుస్తకాల్లో ఎక్కడ కనిపించదు.”

విద్యాభారతి ప్రచురించే దేవపుత్ర పత్రికను గురించి పుష్పేంద్ర మాట్లాడుతూ, “ఈ పత్రిక గోల్వాల్కర్, సావర్కర్, హెడ్గెవార్, ఇతర ఆర్ ఎస్ ఎస్ నాయకులను ఆకాశానికి ఎత్తేస్తుంది. భారతదేశ స్వతంత్రం కోసం చేసిన పోరాటంలో ఆర్ ఎస్ ఎస్ భాగస్వామ్యం గురించి ఘనంగా చెప్పుకునేది. ఆ వ్యాసాలలో ఆర్ ఎస్ ఎస్ పై నెహ్రూ నిషేధం విధించడాన్ని, ఆర్ ఎస్ ఎస్ ని ద్వేషించడాన్ని పేర్కొంది.”

ఆర్ ఎస్ ఎస్ బడులలో వ్యాప్తిచేసే రకరకాల పుకార్లను గురించి తిలక్ గారు ప్రస్తావించారు. “మా బడులలో గాంధీ గురించి గౌరవంగా మాట్లాడేవాళ్ళం కాదు. సర్దార్ గనక లేకపోతే దేశం చిన్నాభిన్నం అయిఉండేదని అనేవారు. భగత్ సింగ్ బతికి ఉండాలని గాంధీ కోరుకోలేదనే వారు.

గాంధీ తలుచుకుంటే భగత్‌సింగ్‌ని కాపాడగలిగే వాడని అనేవారు. నెహ్రూ గురించి, “నెహ్రూ ఏంత ధనికుడంటే ఆయన బట్టలు లండన్‌లో ఉతికించుకునే వాడు. బ్రిటిష్ వారు నెహ్రూను పదేపదే జైళ్ల నుండి ఎందుకు విడిపిస్తున్నట్టు? ఇతరులలాగే నెహ్రూ కూడా జైళ్లలో ఎందుకు చనిపోలేదు? ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది. నెహ్రూ పూర్వీకులు ఆఫ్ఘనిస్తాన్‌కి చెందిన వారని, అతను పుట్టుకతో ముస్లిం అని, ఆ తరువాతి కాలంలో హిందువుగా మారాడని .. ఇటువంటివి ప్రచారంలో పెడుతూ అనేక సందేహాలకు తావునిచ్చే ప్రశ్నలను లేవనెత్తేవారు.

ఆర్‌ఎస్‌ఎస్ పాఠశాలలలోని ఉపాధ్యాయులు గాడ్సే గురించి ఎలా మాట్లాడతారో వివరిస్తూ,” వారు గాడ్సేని ఎంతగానో గౌరవించేవారు. అతనిని ఒక విప్లవకారుడిగా పరిగణించేవారు. గాంధీని గనక గాడ్సే చంపి ఉండకపోతే, గాంధీ హిందువులకి మరింత నష్టం కలిగించేవాడని అనేవారు. ఒక తరగతి గదిలో ఉపాధ్యాయుడు – గాడ్సేకి గాంధీని చంపడానికి కొన్ని కారణాలు ఉండి ఉండవచ్చు. ఆ ఫైళ్లను పునఃపరిశీలించండి. ఎవరూ ఊరికే ఒక మనిషిని చంపేయరు. ఏదో కారణం ఉండే ఉంటుంది. కొన్ని వాస్తవాలను కావాలనే తొక్కి పెట్టి ఉంటారు.” అని చెప్పేవారని తిలక్ అంటారు.

“ఆర్‌ఎస్‌ఎస్ అంటే అభిమానమున్న సంస్థలు కర్ణాటకలో పేదవారు ఉండే

> "గాడ్సే చేసింది సరైనదని మా బడులలో ఉపాధ్యాయులు బాహాటంగానే అనేవారు. భారతదేశం విభజించబడడానికి గాంధీ కారణమని, నెహ్రూని ప్రధానమంత్రిని చేయడానికే గాంధీ దేశాన్ని విభజించడానికి అంగీకరించాడని అనేవారు. 'నేను గాంధీని ఎందుకు చంపాను', అనే పుస్తకం ఇతర ఆర్ ఎస్ ఎస్ సాహిత్యం మా బడులలో బాహాటంగా అమ్మేవారు అని వినయ్ గుర్తుచేసుకున్నారు."

ప్రాంతాలలో పుస్తకాలు పంచిపెట్టేవి. అయితే పుస్తకాలు పంచి పెట్టే సంస్థలు ఏవో ఎవరికీ తెలియదు. ఉదాహరణకి ఇన్ఫోసిస్ గ్రంధాలయాల కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రభుత్వేతర బడులకు "భారతదేశంలో మహనీయుల" జీవిత చరిత్రలను పంచేవారు. ఈ పుస్తకాల ప్రచురణ కర్తలు రాష్ట్రోత్తం ప్రచురణలు. ఇది ఆర్ ఎస్ ఎస్ తో దగ్గరి సంబంధం కల ప్రచురణ సంస్థ. ఉన్నత కుల హిందువులకి చెందిన సంస్థ. వారు ప్రచురించిన మహనీయులలో మతపెద్దలు, పౌరాణిక నాయకులు, రాజులూ, కర్ణాటకకు చెందిన కొంతమంది సంస్కర్తలు ఉండేవారు. ఆర్ ఎస్ ఎస్ ప్రస్తుతించే వారిలో అనేకమంది జాతీయ నాయకులు ఉండేవారు. అయితే గాంధీ, నెహ్రూ మాత్రం ఉండేవారు కాదు" అని సిఏబిఇ నివేదిక నిచ్చింది.

"గాడ్సే చేసింది సరైనదని మా బడులలో ఉపాధ్యాయులు బాహాటంగానే అనేవారు. భారతదేశం విభజించబడడానికి గాంధీ కారణమని, నెహ్రూని ప్రధానమంత్రిని చేయడానికే గాంధీ దేశాన్ని విభజించడానికి అంగీకరించాడని అనేవారు. 'నేను గాంధీని ఎందుకు చంపాను', అనే పుస్తకం ఇతర ఆర్ ఎస్ ఎస్ సాహిత్యం మా బడులలో బాహాటంగా అమ్మేవారు అని వినయ్ గుర్తుచేసుకున్నారు.

**విద్యార్థుల నుండి సైనికులుగా**

విద్యాభారతి పాఠశాల పూర్వ విద్యార్థులలో చాలామందితో సంభాషించిన తరువాత పాఠ్య పుస్తకాలలోని పాఠ్యాంశాలు, కార్యక్రమాలు, బడులు నిర్వహించే అనేక కార్యక్రమాలు హిందుత్వను విద్యార్థులలో జొప్పించడానికి ఎలా దోహద పడ్డాయో తెలిసింది. తామిప్పటికీ ఆ ప్రభావం నుండి పూర్తిగా బయట పడలేకపోతున్నామని కొంతమంది అన్నారు.

పదమూడేళ్ల నుండి అరవై ఏళ్ళ వయసులోని బాలురు, చక్కగా ఖాకి నిక్కర్లతో తెల్లటి చొక్కాలతో, తలపై నల్లటి టోపీలు ధరించి మార్చ్ చేస్తుంటే సైన్యంలో ఉన్న భావన కలుగుతుంది. ఆర్ ఎస్ ఎస్ దీనినే శక్తి ప్రదర్శన అంటుంది. అదే సమయంలో హిందు మితవాదులు తమ బలాన్ని ప్రదర్శిస్తున్న భావన ఈ మార్చ్ వలన కలుగుతుంది. అంతేకాదు, మైనారిటీలున్న ప్రాంతాలలో కవాతు చేసినప్పుడు వారిని బెదరగొడుతుంది." ప్రతి ఏడూ దసరా పండగ రోజు కత్తులు, త్రిశూలాలు, లాఠీలు, బల్లేలతో, ఒక్కొక్కసారి తుపాకులతో కూడా వారు కవాతు చేసేవారు. ఈ శక్తి ప్రదర్శన విద్య భారతి, ఆర్ ఎస్ ఎస్ ప్రాంతీయ కార్యాలయం అయిన భోపాల్‌లో జరిగేది. ఇందులో ఉపాధ్యాయులు, అనేకమంది విద్యార్థులు కూడా పాల్గొనేవారు. అధికారికంగా ఏ ఉత్తర్వులు లేకపోయినా ప్రదర్శనలో పాల్గొనడం తప్పనిసరి అని ఉపాధ్యాయులు తరగతి గదులలో ప్రకటించేవారు. అలాగే ముస్లింలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల నుండి ఈ ప్రదర్శనలు తీసుకెళ్తారన్నది కూడా స్పష్టం. వాటిద్వారా అక్కడి ప్రజలను భయభ్రాంతులను చేయాలన్నదే వారి లక్ష్యం అని తిలక్ అన్నారు.

"పెద్ద మందిరం ఉన్న ప్రతి చోట ఆ పక్కనే ముస్లింలు తమ మసీదులు కట్టుకున్నారని మా ఉపాధ్యాయులు అనేవారు. మనం ఒక నిర్ణయానికి రాకపోతే మన మందిరాలను కాపాడుకోవడం కష్టమవుతుంది. .. ఆర్ ఎస్ ఎస్ మా బడులలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకునేది. వారి నాయకులు మా బడులకువచ్చి .. 'మీరు అనేక రకాల ఆయుధాలను వాడడంలో నైపుణ్యం సంపాదించాలి. లేకపోతే అల్లర్లు జరిగినప్పుడు మిమ్మల్ని మీరు ఎలా కాపాడు కుంటారు?' అనేవారు. హిట్లర్ గొప్ప నాయకుడని తరగతి గదులలో బోధించేవారు. అతడు పెద్ద జాతీయవాది అని, హక్కుల కోసం పోరాడాడని చెప్పేవారు. జాతిని శుద్ధి చేయడం న్యాయమని, మన కష్టాలన్నీ ముస్లింల వలన ఏర్పడ్డవే అని ఉపాధ్యాయులు పరోక్షంగా చెప్పేవారని తిలక్ అన్నారు.

"2002 లో గోద్రా అల్లర్లు జరిగాయి. మా బడిలోని వారంతా ఎంతగా ఉద్వేగానికి గురయ్యారో నాకిప్పటికీ గుర్తే. అక్కడ రామభక్తులు ఎలా హత్యకి గురయ్యారో ఉపాధ్యాయులు చర్చించుకుంటూ ఉండేవారు" అని తన ఆరేళ్ళ వయసు నుండి కిందటి దశకం వరకు ఎంతో విధేయతతో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తగా పనిచేసిన వినయ్ సుల్తాన్ అన్నారు. మరింత విపులంగా చెప్పమని ఆయనని కోరినప్పుడు, "ప్రతి నెల 'ముఖ్య స్థానం శాఖ' జరిగేది, ఈ శాఖకి అన్ని శాఖల వారు, నగరంలోని విద్యా భారతి బడులలో చదువుకునే వారందరూ వచ్చేవారు. మా శాఖ నుండే 15-20 మంది పిల్లలు వెళ్ళేవాళ్ళు. నేను అందులో ఒకడిని. అక్కడి నుండి తిరిగి వచ్చే క్రమంలో మేము అదేపనిగా ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల గుండా వాళ్ళని ఉసిగొల్పే నినాదాలు చేస్తూ వచ్చే వాళ్ళం. మా చేతులలో ఆర్ఎస్ఎస్ ఇచ్చిన కర్రలు కూడా ఉండేవి. అలా నడవడంలో ఓ మజా ఉండేది "అంతే కాదు " మా బడి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడి తో సహా ఆర్ ఎస్ ఎస్ కి చెందిన వారే. వారు కరసేవకులు కూడా. బాబ్రీ మసీదు విధ్వంసంలో పాల్గొన్నవారే. ఎంత వీరోచితంగా వారు పోరాడారో తరగతి గదిలో వివరించేవారు. ఆ విధ్వంసాన్ని ఎంతో ఘనంగా చెప్పుకునే వారు" అని గుర్తుచేసుకున్నారు వినయ్ సుల్తాన్.

ప్రస్తుతం ఒక పరిశోధకునిగా ఉన్న పుష్పేంద్ర," 2007-08 లలో రామసేతు ఆందోళన నడుస్తున్న కాలంలో "రామసేతును నిర్మూలించకూడదని, అది హిందువుల వారసత్వ సంస్కృతి అని' బడి అధికారులు రాష్ట్రపతికి ప్రతి విద్యార్థి చేత ఉత్తరం వ్రాయించారు. మేమందరం ఇళ్ల నుండి పోస్ట్ కార్డులు తీసుకెళ్లి బడులలో కూచుని ఉత్తరాలు వ్రాసేవారం" అని గుర్తుచేసుకున్నారు.

ముగింపులో సూక్ష్మంగా చెప్పుకోవాలంటే ఈ బడులన్నిట్లో, "విద్యార్థులుగా మాకు ఈ విషయాలు తెలియలేదు. కానీ నెమ్మది నెమ్మదిగా మాలో హిందుత్వాన్ని నింపే ప్రయత్నం జరిగింది. అందువలన ఎప్పుడయినా అల్లర్లు జరిగితే, విద్యార్థుల మందరం పరిపూర్ణ హిందువులుగా ప్రతిస్పందించేవారం. అందుకు ఈ బడులు మమల్ని సన్నధులను చేసాయి."

**(అనువాదం: కె ఉషారాణి)**

# ప్రత్యామ్నాయ సంస్కృతికోసం పెద్ద పోరాటం జరగాలి



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్ వీరయ్య**

సంక్లిష్టమైన సాంస్కృతిక సంబంధాలకు నిలయం మన దేశం. అనేక సాంస్కృతిక విలువలు పాటించే ప్రజాసమూహాల కలయికతో ఏర్పడిన దేశం. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఏర్పడిన బంధం. ఒకవైపు సనాతన ధర్మం, సాంస్కృతిక విలువల పేరుతో జరుగుతున్న దాడి... మరోవైపు అభివృద్ధి, ఆధునిక సంస్కృతి పేరుతో విస్తరిస్తున్న విలువలు... ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయ సంస్కృతి గురించి చర్చిస్తున్నాం. నేడు ప్రజలకు అభివృద్ధి కావాలి. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కావాలి. అవి మరింత అభివృద్ధి కావాలి. వాటి ఫలాలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలి. శ్రమ పట్ల గౌరవం, శ్రమ సంబంధాలకు విలువ పెరగాలి. దోపిడీ వ్యవస్థను అంతం చేయాలి. సమాజంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ, కార్మికవర్గ సాంస్కృతిక విలువలు మనముందున్నాయి. శ్రమదోపిడీ, సామాజిక ఆధిపత్యం మీద పోరాటానికి ఏ విలువలు అనుసరణీయం? శ్రమదోపిడీ కొనసాగించడానికి కులాన్ని వాడుకుంటున్న పెట్టుబడిదారీ వర్గమే, తమ లాభాలకు కులమే ఆటంకమైనపుడు, డబ్బు సంబంధాలకు కులమే అడ్డుగోడ అయినపుడు, ఆ గోడలను తొలగించుకోడానికి ఏ మాత్రం వెనుకాడటంలేదు కదా! కార్మికవర్గ ఐక్యతకు ఆ కులమే ఆటంకమైనపుడు కార్మికవర్గం ఏమి చేయాలి? ఒకవైపు దోపిడీ వ్యవస్థమీద పోరాడుతున్న ప్రజా ఉద్యమం... మరోవైపు డబ్బు సంబంధాలు. సమాజ మార్పు కోసం కృషి చేసే కార్యకర్తలు, సంస్థలు, కమ్యూనిస్టు పార్టీలు దేనిమీద ఆధారపడాలన్నదే సమస్య. ప్రజా పునాది మీద ఆధారపడాలా లేక ఆర్థిక వనరుల మీద ఆధారపడాలా అన్నదే నేడు వేధిస్తున్న ప్రశ్న. విప్లవ సాధన కోసం అంకితమై పనిచేయదలచిన వారెవరూ విస్మరించజాలని విషయం ఇది. "విప్లవం వచ్చిన నాటి సంగతి" అని సరిపెట్టుకునేవారికి ఈ చర్చ మింగుడుపడదు. ఇక్కడ విప్లవం పట్ల విశ్వాసమే అసలు సమస్య. అదే లోపించినపుడు సహజంగానే గుర్తింపు, సౌకర్యాలు, సంపాదన, పదవులు ముందుకొస్తాయి. విప్లవ చైతన్యంతో పని చేసినపుడు ప్రత్యామ్నాయ సంస్కృతి మీద దృష్టి సారిస్తారు. ఫ్యూడల్, పెట్టుబడిదారీ విలువలకు భిన్నంగా, కార్మికవర్గ సంస్కృతిని ముందుకు తెస్తారు. నిజాయితీగా కార్మికవర్గ ప్రయోజనం కోసం కట్టుబడి పనిచేసేటపుడు కార్మికవర్గ సంస్కృతిని విస్తరింపజేసేందుకు సకల శక్తులూ ఒడ్డి కృషి చేస్తారు. ఇప్పుడు కావల్సింది కూడా అదే.

సరళీకృత ఆర్థిక విధానాల పర్యవసానంగా వినిమయదారీ సంస్కృతి వెంటాడుతున్నది. సమాజంలో సరుకుల వ్యామోహం, ఆడంబరాలు, దర్పం ప్రదర్శించటం సాధారణంగా మారిపోతున్నాయి. దానిని మార్చేందుకు ప్రయత్నిస్తున్న కార్యకర్తలు పని చేస్తున్నది ఈ సమాజంలోనే కదా! సహజంగానే ఇవన్నీ వారిమీద కూడా ప్రభావం చూపుతున్నాయి. భోగలాలసాలకు సరిపడు సంపద భూస్వాములు, పెట్టుబడిదారుల దగ్గర తప్ప శ్రామికుల చేతిలో, కార్మికవర్గం కోసం పనిచేసే పార్టీల దగ్గర ఉండదు. కానీ ఉన్న పరిమిత వనరులను దేనికి ఖర్చు చేస్తున్నామన్నదే పరిశీలించాలి. దుబారా ఖర్చు చేయటం భూస్వామ్య లక్షణం. తనకు ప్రయోజనం అనుకుంటే విలాసవంతమైన జీవితం గడపటం, అందుకు ఖర్చు చేయటం పెట్టుబడిదారీ లక్షణం. కమ్యూనిస్టు కార్యకర్త ఇందుకు భిన్నంగా వ్యవహరించాలి. కార్మికవర్గ ప్రయోజనం కోసం/ ప్రజా ప్రయోజనం కోసం, పార్టీ ప్రయోజనం కోసం, అవసరాల ప్రాతిపదికగా ఖర్చు చేయాలి. పార్టీ నాకేం చేసిందన్న ప్రశ్న కార్మికవర్గ పార్టీ లక్షణం కాదు. "ఇంతకాలం నుంచి పార్టీ కోసం పని చేసాను. అన్నీ వదులుకుని వచ్చాను. పార్టీ మాత్రం నన్ను పట్టించుకోలేద"ని అంటుంటారు. ఎన్నికలు, పదవులు, వ్యక్తిగత సమస్యలు వచ్చినపుడు కొందరు ఈ అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. మౌలికంగా, కమ్యూనిస్టు పార్టీలో చేరే సందర్భంగానే, 'ఎల్లవేళలా పార్టీ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి పని చేస్తాన'ని ప్రమాణం చేస్తాం. కానీ, తనదాకా వచ్చినపుడు పరీక్షకు నిలబడటం ప్రమాణం చేసినంత సులభం కాదు. తన వ్యక్తిగత ప్రయోజనం, కుటుంబ ప్రయోజనమే ప్రధానంగా వ్యవహరించటం కార్మికవర్గ లక్షణం కాదు.

ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నపుడు కుటుంబం, బంధుత్వం, బాంధవ్యాలు, ఆస్తిపాస్తులను లెక్కచేయరు. పోరాట చైతన్యం అట్లా నిలబెడుతుంది. కానీ ఇప్పుడు కమ్యూనిస్టు ఉద్యమ పునాది చెదిరిన నేపథ్యం. ఆదాయాలు, ఆస్తులు పూర్తికాలం కార్యకర్తలను కూడా ప్రభావితం చేసే అవకాశాలు పెరిగాయి. పెండ్లి సందర్భంగా ఆస్తిపాస్తులు చూడటం, కట్నకానుకలు ఒక సమస్యగా ముందుకొస్తున్నాయి. కుల పట్టింపులు కూడా వ్యక్తమవుతున్నాయి. పెండ్లిలో తాళి కట్టడం, సాంప్రదాయ క్రతువులు ఆచరించటం, ముహూర్తాలు పాటించటం కార్మికవర్గ సంస్కృతి కాదుకదా! వీటికి భిన్నంగా ప్రత్యామ్నాయ పెండ్లి పద్ధతులు అనుసరించ వచ్చు. రిజిస్టర్ పెండ్లి లేదా దండల పెండ్లి ద్వారా మన చుట్టూ ఉన్న సమాజాన్ని సంతృప్తిపరిచేందుకు ప్రయత్నించవచ్చు. ప్రత్యామ్నాయ పెండ్లి పద్ధతులకు అవతలివారు ఒప్పుకోనపుడు ఏమి చేయాలి? అప్పుడు పెండ్లి చేసుకునే జంటలో మన పిల్లల అభిప్రాయం కీలకమవుతుంది. మన పిల్లలు కూడా ప్రత్యామ్నాయ పద్ధతులే కోరుకుంటే ఆ సంబంధం రద్దుకావచ్చు. ఇలాంటి సందర్భాలలో ఆ కుటుంబాన్ని ప్రోత్సహించి, అభినందించాలి. ఇందుకు భిన్నంగా ఇది

> **ఆడంబరాలు, దర్పం, ఆధిపత్య ప్రదర్శన కార్మికవర్గానికి అవసరం లేదు. అమ్మకాల ప్రోత్సాహం, సంపద ప్రదర్శన కూడా వీరికి అవసరం లేనిది. అందుబాటులో ఉండనివి. తన కుటుంబ అవసరాలు, ఆరోగ్యకరమైన సౌకర్యాలు, గౌరవప్రదమైన జీవితం కార్మికవర్గం కోరుకుంటుంది. శ్రమసంబంధాలు, సాంస్కృతిక సంబంధాలే తప్ప హోదా (స్టేటస్) ప్రదర్శించటం, గొప్పలకు పోవటం కార్మికవర్గ లక్షణం కాదు.**

'చాదస్తం' అని ముద్ర వేసే ధోరణి భూస్వామ్య సంస్కృతి మీద జరిగే పోరాటాన్ని నీరుగారు స్తుంది. పెండ్లి జంటే సంప్రదాయ పద్ధతిలో జరగవల్సిందేనని కోరుకుంటే తల్లిదండ్రులు ఆ పెండ్లిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. క్రతువులలో తాము భాగస్వాములు కాకుండా, పెండ్లి ఏర్పాట్లన్నీ చేయవచ్చు. పిల్లలు ఒప్పుకోవటం లేదనే పేరుతో క్రతువులు పాటిస్తే ఇక భూస్వామ్య సంస్కృతి మీద పోరాటానికి అర్థం ఉండదు. ఇతరులకు ఆదర్శమూ కాదు. తనకు దైవం మీద నమ్మకం లేనపుడు, తన జీవిత భాగస్వామి పూజలు చేస్తే ఏమి చేయాలి? శాస్త్రీయ అవగాహన కల్పించే ప్రయత్నం కీలకం. అయినా సాధ్యపడనపుడు కుటుంబంలో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలి. తన నమ్మకాలను జీవిత భాగస్వామి మీద బలవంతంగా రుద్దకూడదు. అశాస్త్రీయ పద్ధతులకు తలవంచకుండా, తనవరకు నిబద్ధత పాటించాలి. పండుగల సందర్భంగా కుటుంబ జీవితంలో మూఢ నమ్మకాలు పాటించటం కొనసాగుతున్నది. కట్నకానుకల భారం లేకపోతే సాధారణ కుటుంబాలు కూడా కులపట్టింపులు వదులుకుంటున్న సందర్భాలున్నాయి. కమ్యూనిస్టు శ్రేణులు అంతకన్నా అభ్యుదయకరంగా స్పందించాలి. కుటుంబంలో పిల్లలను గడప దాటించటం, పంచె కట్టించడం, ఓణీ వేయటం, చీర కట్టించటం, భర్త మరణిస్తే, తల్లిదండ్రులు మరణిస్తే గుండు గీయించుకోవటం, మేనరికం తదితర పద్ధతులు ఇంకా అనేకచోట్ల పాటిస్తున్నారు. బిడ్డ రజస్వల అయినప్పుడు విడిగా కూర్చోబెడుతున్నారు. అశాస్త్రీయ పద్ధతులు, మూఢ నమ్మకాలకు అతీతంగా కమ్యూనిస్టు శ్రేణులు నిలిచేందుకు సిద్ధపడాలి. వీరిని ఇందుకనుగుణంగా నిలబెట్టేది విప్లవ చైతన్యమే.

మహిళల పట్ల దృక్పథం కూడా మారాలి. పురుషులను సుఖపెట్టేదిగానూ, కోరికలు తీర్చేదిగానూ చూసే ఫ్యూడల్ ధోరణి గానీ, వ్యాపార సరుకుగా చూసే పెట్టుబడిదారీ ధోరణిగానీ సమాజ మార్పు కోసం జరిగే ఉద్యమానికి తోడ్పడవు. శ్రామికులలో భాగంగా పరిగణించాలి. తోటి మనిషిగా, పౌరురాలుగా గుర్తించాలి. సమాన హోదాను, నిర్ణయాలలో భాగస్వామ్యాన్నీ అంగీకరించాలి. ఇది అనునిత్యం కుటుంబ జీవితంలో ప్రదర్శించవల్సిన నిబద్ధత. దీనిమీద ఎవరి పర్యవేక్షణ ఉండదు. భార్య ప్రశ్నిస్తే తప్ప పార్టీ దృష్టికి రాని విషయం. కానీ తోటి కామ్రేడ్స్‌గానీ, ఇరుగుపొరుగు జనం గానీ గమనిస్తారు కదా! భార్యాభర్తలు పరస్పరం గౌరవించుకుంటూ సమాన హోదాలో గడపటం పరిసర కుటుంబాల మీద ప్రభావం చూపుతుంది. మన కుటుంబం మీద, పార్టీ మీద గౌరవం పెరుగుతుంది.

ప్రజాప్రతినిధులుగా గెలిచిన కార్యకర్తలు ప్రజలపట్ల నిబద్ధతతో వ్యవహరించటం పరీక్ష. తన దగ్గర డబ్బుంటే పార్టీ అభ్యర్థి గెలుపుకోసం విరాళంగా ఇవ్వటం స్ఫూర్తిదాయకం. కానీ తనకు పోటీ చేసే అవకాశం ఇస్తే ఖర్చుపెట్టుకుంటాననటం ఆదర్శప్రాయం కాజాలదు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అట్లా పోటీ చేసే అవకాశం వచ్చినప్పటికీ, పార్టీ శ్రేణులలో గౌరవం పెరగదు. ఇది పార్టీ శ్రేణులలో త్యాగనిరతిని, పట్టుదలను, విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తుంది. దీనికితోడు కొన్ని సందర్భాలలో ప్రజా ప్రతినిధులు బూర్జువా పార్టీల క్యాంపులలో ఉండేందుకు ప్రయత్నించటం, డబ్బు తీసుకుని వారికి ఓటేయడం వల్ల క్రమశిక్షణా చర్యలకు గురికావటం కూడా జరిగింది కదా! కొన్నిచోట్ల వ్యసనాలను సమర్థించే ధోరణి కూడా చూస్తాం. సాధారణంగా కష్టం మరచిపోవడానికి శ్రామికులు మద్యం తీసుకుంటారు. పాలకవర్గాలు కూడా వీరిని మద్యానికి బానిసలుగా చేసి, పోరాట పటిమను, ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తారు. యువతలో బాధ్యతా రాహిత్యాన్ని ప్రోత్సహిస్తారు. ఈ వ్యసనాలకు అలవాటుపడే కార్యకర్తలను సరిదిద్దేప్రయత్నం చేయకుండా, అది 'వ్యక్తిగతం' అనే పేరుతో చూసీచూడనట్టుండాలన్న ధోరణి విప్లవోద్యమానికి హానికరం. బాధ్యతాయుతమైన పోరాటానికి ఇది ఆటంకం.

ఆధునిక సౌకర్యాల పేరుతో మార్కెట్ సృష్టించుకోవటం పెట్టుబడిదారీ సంస్కృతి. ఆర్థిక వనరులు, ప్రజల స్థితిగతులను పట్టించుకోకుండా పార్టీ శ్రేణులు తమ సౌకర్యాలకు ప్రాధాన్యతనివ్వటం స్ఫూర్తినివ్వదు. హోదా, దర్పం ప్రదర్శించటం కష్టజీవుల ఉద్యమానికి సరిపడదు. విప్లవోద్యమ చరిత్రలో పోరాటయోధులు ఆధునిక సౌకర్యాలు వినియోగించుకున్న సందర్భాలున్నాయి. వాటి నేపధ్యాన్ని వదిలేసి, సౌకర్యాన్ని మాత్రమే చూడటం స్వార్థపరుల లక్షణం. ముంబై నుంచి అడవుల్లో, కొండల్లో పడి పోలీసులను తప్పించుకుని వచ్చిన సందర్భంలో ఆ రోజుల్లోనే పుచ్చలపల్లి సుందరయ్య కారును కూడా ఉపయోగించుకున్నారు. అవసరానికి వాడటం వేరు. హోదా కోసం వాడటం వేరు. పూర్తికాలం కార్యకర్తలు అలవెన్సులు లేక ఇబ్బంది పడుతుండగా, మరోవైపు ఆర్భాటాలు, అదనపు సౌకర్యాలు వినియోగించుకోవటం స్ఫూర్తి నింపదు. నిరాడంబర జీవితం గడపటం, ప్రజలతో సన్నిహితంగా మెదలటం, మమేకం కావటంలో సుందరయ్య ఒక నమూనా. ఈ పద్ధతులు పాటించేందుకు సిద్ధంగా లేనపుడు, "సుందరయ్య కాలంలో అది నడిచింది... ఇప్పుడు కాలం మారింది... ఇంకా వాటినే ఆదర్శాలుగా భావించటం చాదస్తం" అనే అభిప్రాయాలు కూడా వింటున్నాం. ప్రజా ఉద్యమ శ్రేణులకు స్ఫూర్తినిచ్చే నమూనాను మసకబార్చటమే ఇది. పెట్టుబడిదారీ, భూస్వామ్య సంస్కృతికి తలవంచటమే! కోల్‌కతా ప్లీనం 'మాస్‌లైన్' గురించి నొక్కిచెప్పింది. ఆధునిక వాహనాలు ఉపయోగించి నిత్యం అనేకమందితో కలవటం ఒక పద్ధతి. ప్రజలతో మమేకమై, వారి ఇండ్లలో బసచేసి, వారి జీవన స్థితిగతుల మధ్య వారితో మమేకం కావటం మరో పద్ధతి. ఈ రెండింటిలో ఏది నిజమైన ప్రజాపంథా (మాస్‌లైన్) అవుతుంది? అవసరమైనపుడు ఏ వాహనమైనా వాడవచ్చు, కానీ ప్రజలతో బంధం నిత్యం అలవాటుగా మారాలి. ఇందుకు భిన్నంగా అవసరమైనపుడు, కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రజలకు దగ్గరై,

**“ శ్రమను మరిచిపోయేందుకు అలవాటైంది మద్యం. కానీ పెట్టుబడిదారీ సమాజంలో ఇదొక వ్యసనంగా మారుతున్నది. పెట్టుబడిదారులకు లాభం తెచ్చిపెట్టే వ్యాపారం. పాలకులకు ఆదాయ మార్గం. వీటన్నింటికీ మించి మద్యం, గంజాయి తదితర మాదకద్రవ్యాల వాడకాన్ని ప్రోత్సహించటం ద్వారా శ్రామికవర్గంలో, యువతలో పోరాటస్ఫూర్తిని నీరుగార్చే సాధనంగా పెట్టుబడిదారీ వర్గం ఉపయోగిస్తున్నది. ”**

నిత్యజీవితంలో అన్ని సౌకర్యాలు అనుభవించటం ఒక అలవాటుగా ఉండాలని బూర్జువావర్గం కోరుకుంటుంది. కమ్యూనిస్టులు కూడా తమ బాటలోనే నడవాలని భావిస్తుంది. వారికి భిన్నంగా, ప్రత్యామ్నాయంగా, ప్రజల హృదయాలను కమ్యూనిస్టులు గెలుచుకోవటం వారికి ఇష్టం ఉండదు కదా!

స్వప్రయోజనం సమిష్టి ప్రయోజనానికి ఆటంకం. అవినీతి పోరాట స్ఫూర్తిని నీరుగారుస్తుంది. వినిమయవాద సంస్కృతి త్యాగనిరతిని బలహీనపరుస్తుంది. అందుకే దోపిడీ వ్యవస్థను అంతమొందించి, సమాజాన్ని మార్చాలనుకున్నవారు భూస్వామ్య, పెట్టుబడిదారీ సంస్కృతులను నిర్మొహమాటంగా వ్యతిరేకించగలగాలి. కార్మికవర్గ సంస్కృతిని ఆహ్వానించగలగాలి. కమ్యూనిస్టు శ్రేణులు కాకుండా ఈ పని ఇంకెవరు చేయగలరు? కమ్యూనిస్టు శ్రేణులే ఇందుకు సాహసించనపుడు సమాజ మార్పు లక్ష్యంగా పనిచేయగలమని అనుకోవటం భ్రమ. కొంతకాలం ప్రజలలో కమ్యూనిస్టులుగా గౌరవం పొందే స్వార్థమే తప్ప, విప్లవ చైతన్యంతో పని చేస్తున్నట్టు భావించలేము. అనేక సందర్భాలలో వలంటీర్స్ పనిలో మార్పులు గమనిస్తున్నాం. వలంటీర్స్ (స్వచ్ఛంద సేవకులు) తమ ఆదాయాలు వదులుకుని, ప్రత్యేక సందర్భాలలో, అనేక ఏర్పాట్లలో కృషి చేయటం సాధారణమే. వీరి కృషి ద్వారా పార్టీకి ఖర్చు తగ్గుతుంది. పార్టీ శ్రేణులే స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకోవటమే ఇది. పోరాట స్ఫూర్తి ప్రధానమైనపుడు, భవిష్యత్తు మీద, విప్లవం మీద విశ్వాసం ఉన్నపుడు ఇది సాధ్యమే. 'వలంటీర్స్' నిజంగానే వలంటీర్స్‌గా పనిచేస్తారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పలుచనైంది కదా! ఈ పరిస్థితి మారాలంటే మళ్ళీ ప్రజా ఉద్యమమే మార్గమవుతుంది. మురికి కొట్టుకుపోవాలంటే వర్షం రావాలి. వరదలు పారాలి. పొరపాటు ధోరణుల ప్రక్షాళన జరగాలంటే ప్రజా ఉద్యమం పెరగాలి. వర్షం మన చేతుల్లో లేదు. ప్రజలతో మమేకం కావటం మాత్రం పూర్తిగా మన చేతుల్లోనే ఉన్నది.

కులం ఒక సామాజిక రుగ్మత. భూస్వామ్య వ్యవస్థలో ఎదిగిన జాడ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ వాడుకుంటున్న ఆయుధం. కానీ ఇది కమ్యూనిస్టు శ్రేణులను కూడా వెంటాడితే? కొన్ని సందర్భాలలో కుల పట్టింపులు కూడా గమనిస్తున్నాము. తప్పు చేసినపుడు పార్టీ క్రమశిక్షణ చర్య తీసుకున్నప్పుడు, కులం కార్డును అడ్డం పెట్టుకునే ప్రయత్నం కూడా ఇలాంటిదే. నేను ఫలానా కులం కాబట్టే కక్షతో చర్య తీసుకున్నారని ఎదురుదాడికి దిగే సందర్భాలున్నాయి. దీనికి అగ్రవర్ణమా, బలహీన వర్గాలా అన్న తేడా లేదు. ఇక్కడ కుల ధోరణి ప్రదర్శించటం, 'కులం' అన్న సాధనాన్ని వాడుకోవడమే కీలకం. పార్టీ నాయకత్వంలో 'కులం' చూడటం మరో పద్ధతి. నిజానికి కులం, మతం, ప్రాంతం వంటి అడ్డుగోడలు ఛేదించుకున్న తర్వాతనే, వదిలించుకున్న తర్వాతనే కమ్యూనిస్టు అవుతారు. అంటే కమ్యూనిస్టులు విశ్వమానవులు. అట్లా కాకుండా తనను తాను కమ్యూనిస్టుగా చెప్పుకుంటూ 'కులం' చుట్టూ ఆలోచనలు చేయటం అంటే... ఆ మేరకు ఫ్యూడల్ సంస్కృతి నుంచి బయటపడనట్టే. పెట్టుబడిదారుల గాలానికి చిక్కుకోవటమే! ఆధునిక సౌకర్యాలు వచ్చిన నేపథ్యంలో కులాల ప్రాతిపదికన వాట్సాప్ గ్రూపులు ఏర్పడుతున్నాయి. తమ కులం గ్రూపులో ఉన్న తర్వాత, కులసంఘంలో పాల్గొన్న తర్వాత కమ్యూనిస్టు తత్వం బలంగా ఉన్నదనుకోవటం భ్రమ. అమ్మా నాన్న పెట్టిన పేర్లకు కొత్తగా తోకలు తగిలించటం, అగ్రకులాలతో పోటీపడి ఖర్చు పెట్టాలన్న ప్రయత్నం, దర్పం ప్రదర్శన కూడా ఇలాంటిదే. వివక్ష మీద పోరాటానికీ, సంఘీభావ చర్యలకూ ఈ ధోరణులు పరిమితులు విధిస్తాయి. కార్మికవర్గ దృక్పథం అలవర్చుకోవటం, కార్మికవర్గ సంస్కృతి నిర్మించటం, వర్గ పోరాటంతో మమేకం కావటమే వీటికి విరుగుడు.


ఫ్యూడల్ సమాజంలో వ్యక్తి ఆరాధన సహజమని సర్ది చెప్పే ధోరణి వర్గ పోరాటానికి ఉపయోగపడదు. తమకు తాము గొప్పవారుగా ప్రదర్శించుకోవటం, పొగుడుతుంటే, ఆకాశానికి ఎత్తుతుంటే సంతోషించటం, ప్రత్యేక మర్యాదలు, గౌరవాలు కోరుకోవటం భూస్వామ్య సంస్కృతి కదా! ఫ్యూడల్ సంబంధాలున్న ఈ దేశంలో ప్రజలు ఇంకా విగ్రహాలకు, నాయకుల గొప్పతనానికీ, నాయకులను అనుసరించే ధోరణికీ అలవాటుపడతారన్నది నిజమే! కానీ ఫ్యూడల్ సంబంధాల మీద పోరాడవల్సిన ఉద్యమకారులు ఆ పద్ధతులనే అడ్డం పెట్టుకుని, అది కూడా స్ఫూర్తినిచ్చేందుకు ఉపయోగపడుతుందని సమర్ధించటం ఉద్యమానికి హాని చేస్తుంది. అమరవీరుల స్థానంలో బతికున్నవారిని ఆకాశానికెత్తటం నష్టదాయకం. సుందరయ్య ఆదర్శాలు చాదస్తమనీ లేక ఆయన మహనీయుడు కాబట్టి సాధ్యమైందనీ, ఇప్పుడు అమలుచేయలేమనీ, కాలం మారిందని దాటవేయటం, బతికున్న నాయకులకు భజన చేయటం, దీనిని అనుమతించడం ఫ్యూడల్ సంస్కృతి కొనసాగింపే. అందరివారుగా ఉండటం... అందరిలో ఒకరుగా ఉండటం కార్మికవర్గ సంస్కృతి. చుక్కల్లో చంద్రుడిగా ప్రకాశించాలని తహతహలాడటం, అందరికన్నా పైన ఉండాలనుకోవటం భూస్వామ్య సంస్కృతి. నాయకులకు సన్నిహితంగా ఉండి ఎదగాలనుకోవటం ఫ్యూడల్ ప్రభువుల దయతో ఎదగాలనుకోవటం వంటిదే! ప్రజాఉద్యమంలో ముందుండి, శ్రామికుల మన్ననలు పొందటమే కార్మికవర్గ లక్షణం. ప్రజలలో తగిన స్థానం లేనపుడు, స్వయంకృషితో ఎదిగే సామర్ధ్యం లేనపుడు, 'గాడ్ ఫాదర్' సిద్ధాంతాన్ని ఆశ్రయిస్తారు. ప్రజల పట్ల నిబద్ధత లోపించి, స్వప్రయోజనాలు ముందుకొచ్చినపుడే ఈ ధోరణి బలపడుతుంది. తమ యోగక్షేమాలు చూసుకునేందుకు, తమ ఎదుగుదలకు ఊతమిచ్చేందుకు పై కమిటీలలో 'తన'వారు ఒకరుండాలని కోరుకోవటమే 'గాడ్ ఫాదర్' సిద్ధాంతం. ఇది కమ్యూనిస్టు లక్షణం కాదు. కార్మికవర్గ సంస్కృతి కాదు.

ప్రజా ఉద్యమం ఊపులో ఉన్నపుడు దోపిడీ వర్గాల సంస్కృతి మీద పోరాటం సులభం. అది

(మిగతా 34వ పేజీలో)

# క్రీ.పూ. 200-క్రీ.శ.300 మధ్య ఆర్థిక, సామాజిక పరిస్థితులు

ఎం.వి.ఎస్.శర్మ


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఈ కాలంలో పత్తితో నేసిన నూలు వస్త్రాల తయారీ పరిశ్రమ అభివృద్ధి చెందడం ప్రధానమైన పరిణామంగా చెప్పుకోవాలి. ఆ తర్వాత దాదాపు 1500 సంవత్సరాలపాటు, అంటే బ్రిటన్ నుండి యంత్రాలమీద తయారైన వస్త్రాలు దిగుమతి అయ్యేవరకూ, చేనేత వస్త్రాలకు భారత ఉపఖండం ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉండేది. ఉన్ని, నార, ఇతర జంతువుల బొచ్చుతో నేసిన వస్త్రాల వాడకం ఇంకా కొనసాగుతున్నప్పటికీ ఆ తరహా దుస్తులు ప్రధానంగా పేద తరగతుల ప్రజల వాడకానికి పరిమితం అయివుండేవి. పత్తినుండి తీసిన దారం నాణ్యత బట్టి మేలిరకం మజ్లిన్ వస్త్రాలను, నాసిరకం నూలు వస్త్రాలను నేసేవారు. సంపన్నులు ఎక్కువగా మజ్లిన్ దుస్తులను ఉపయోగించేవారు. క్రమంగా పత్తి లభ్యత పెరుగుతున్నకొద్దీ సామాన్యులు, పేదలు కూడా నూలు వస్త్రాల వాడకానికి మారారు. అర్థశాస్త్రం గ్రంథంలో బెంగాల్, కళింగ, కాశీ, మధుర, కౌశాంబి, కొంకణ్, నర్మదా లోయ ప్రాంతాలలో మేలురకం నూలు వస్త్రాలు తయారయేవని పేర్కొన్నారు. క్రీ.శ. ఒకటో శతాబ్దానికి చెందిన గ్రీకు గ్రంథం పెరిప్లస్‌లో సింధు, ఉజ్జయిని ప్రాంతాలను అదనంగా ప్రస్తావించారు. మొత్తం మీద క్రీ.శ. ఒకటో శతాబ్దం నాటికి భారతీయులు చేసే విదేశీ వ్యాపారంలో మధ్యధరా ప్రాంతానికి ఇక్కడి నుండి ఎగుమతి చేసే మజ్లిన్ వస్త్రాలు ప్రధాన సరుకుగా ఉండేవి.

చేనేత రంగం చాలా పెద్ద స్థాయిలో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ముఖ్యంగా స్త్రీలు పత్తిని ఏకడం, దారం తీయడం వంటి పనులలో ఎక్కువగా పాల్గొనేవారు. 14వ శతాబ్దం దాకా భారత ఉపఖండంలోకి రాట్నం ప్రవేశించలేదు. అందుచేత నూలు వడకడానికి ఎక్కువ శ్రమ అవసరం అయ్యేది.

దర్జీ వృత్తి కూడా ఈ కాలంలోనే ఒక ప్రత్యేక వృత్తిగా ఉనికిలోకి వచ్చింది. రుగ్వేదం లోనూ, ఐతరేయబ్రాహ్మణంలోనూ దుస్తులను కుట్టే పనికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఐతే అప్పట్లో ప్రధానంగా మొలచుట్టూ కట్టుకునే ఒక వస్త్రం, భుజాలమీదుగా ఛాతీని కప్పుతూ మరొక వస్త్రం మాత్రమే ధరించే పరిస్థితి ఉండేది. చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందిన తర్వాతనే బట్టలను కుట్టడం అనేది ఒక ప్రత్యేక వ్యాపకంగా మారింది. షరాయిలు, లాల్చీలు, నెత్తిమీద పెట్టుకునే కుళ్ళాయిలు (పొడవాటి టోపీలు) వంటివి తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానం మన దేశానికి వాయవ్య ప్రాంతం నుండి వలస వచ్చిన ప్రజలు తీసుకువచ్చినదే.

నేత తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పించినది మట్టి పాత్రలను తయారు చేసే రంగం. కాల్చి, నగిషీ చేసినమట్టి పాత్రలను రకరకాల ఆకారాలలో అందంగా తయారు చేయగలిగేవారు. దక్షిణాది ప్రాంతంలో మట్టిపాత్రల తయారీలో (రౌలెటెడ్ వేర్) కొత్త పద్ధతిని ఉపయోగించారు. మట్టిపాత్రను గుండ్రంగా తిరిగే ఒక బల్లమీద నిలిపి రకరకాల డిజైన్లు వచ్చేలా చిత్రీకరించేవారు. ఇటువంటి పాత్రల అవశేషాలు దక్షిణాది లోనూ, శ్రీలంక, ఇండోనేసియా లోనూ లభించాయి.

భవన నిర్మాణ రంగం ఎక్కువమందికి ఉపాధి కల్పించిన ఇంకొక రంగం. తక్షశిల వంటి పర్వత సమీప ప్రాంతాలలో రాళ్ళు, కంకర కట్టడాల నిర్మాణానికి ఎక్కువగా ఉపయోగించేవారు. అదే మైదాన ప్రాంతాలలో ఇటుకలను ఉపయోగించేవారు. ప్రస్తుతం మన కాలంలో ఉపయోగించే ఇటుకలకు ఇవి దాదాపు రెట్టింపు సైజులో ఉండేవి. అరికమేడులో లభించిన ఇటుకలు 38 అంగుళాల పొడవు, 27 అంగుళాల వెడల్పు, 7 అంగుళాల మందంతో ఉన్నాయి. రాళ్ళను పెద్ద సైజుల్లో చెక్కి కట్టడాల నిర్మాణానికి ఉపయోగించే పద్ధతి అప్పటికి ఇంకా ఉనికిలో లేదు. కాని నాసిక్, కార్లే, కన్హేరి వంటి (మహారాష్ట్ర) ప్రాంతాలలోని రాతి గుహలలో కొండ లను దొలిచి నిర్మించిన గుహలను పరిశీలిస్తే రాళ్ళను కోయడంలో కొత్త నైపుణ్యాన్ని సాధిం చారని తెలుస్తుంది. ఇనుప పనిముట్లు అంత ఎక్కువగా అభివృద్ధి చెందని ఆ కాలంలో ఈ విధమైన శ్రమ చాలా కష్టంతో కూడుకుని వుండేది.

పైన ప్రస్తావించిన వృత్తులు గాక, గాజు పూసల తయారీ కూడా ఒక వృత్తిగా ఉండేది. వాయవ్యంలోని తక్షశిల ప్రాంతంలో, దక్షిణాది దిండిగల్ జిల్లా (తమిళనాడు)లో ఈ గాజు పూసల తయారీ చిన్నపాటి పరిశ్రమగా ఉండినట్టు తవ్వకాలలో బైటపడింది.

ఆభరణాల తయారీ ఎక్కువగా ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలో ఉండేది. అక్కడ దాదాపు 20,000 బంగారు వస్తువులు, క్రీ.శ. ఒకటో శతాబ్దానికి చెందినవి లభించాయి. బంగారం నాణ్యత ఉన్నత ప్రమాణాలతో ఉంది. ఆభరణాల డిజైన్లు చూస్తే అవి గ్రీకుల నైపుణ్యాన్ని ఉపయోగించి తయారు చేసినవి అని స్పష్టమౌతుంది. కొద్దిమంది ఆ నైపుణ్యం కలిగిన కళాకారులు ఆ ప్రాంతంలో నివాసం ఏర్పరచు కుని వీటిని తయారు చేశారని చెప్పవచ్చు. తక్కిన స్థానిక వృత్తిదారులకు నైపుణ్యం పరిమితంగానే ఉండేది.

### రవాణా

ఆ కాలానికి చెందిన శిల్పాలను పరిశీలిస్తే అప్పటి ప్రధాన రవాణా సాధనాలు ఏ విధంగా ఉండేవో తెలుస్తుంది. పట్టణాలలో ప్రధానంగా గుర్రపు బళ్ళు, ఎద్దులు లాగే బళ్ళు రవాణా సాధనాలుగా ఉండేవి. ఏనుగుల అంబారీలను కూడా ఉపయోగించేవారు. మధురలో లభించిన ఒక జైన స్తూపం మీద చెక్కిన శిల్పంలో పట్టణ రవాణా తీరును చూడవచ్చు. (చూ. ఫిగర్ 4.6)

### పట్టణాలు, వాణిజ్యం

ఈ కాలంలో పట్టణాలు అనేకం ఏర్పడ్డాయి. వాటన్నింటిలోకీ తక్షశిల ప్రధాన పట్టణంగా చెప్పవచ్చు. మౌర్యుల కాలంలో భిర్ ఒక ప్రధాన పట్టణంగా ఉండేది. ఆ కాలంలోనే ఏర్పడిన మరో పట్టణం సిర్కాప్. కుషానుల కాలంలో దానికి పక్కనే సిర్సుఖ్ అనే ఇంకొక పట్టణం ఏర్పడింది. మధుర, అహిచ్ఛత్ర, అత్రంజిఖెర, (ఈ రెండూ పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతంలో ఉండేవి) యమునా తీరాన అలహాబాద్‌కు సమీపంలో కౌశాంబి పట్టణం


ఉండేది. దక్షిణాదిలో మదురై ఒక ప్రధాన పట్టణం. దక్కను ప్రాంతంలో ఇక్ష్వాకుల పాలనలో నాగార్జున కొండ వారి రాజధానిగా ఉండేది. నాగార్జునసాగర్ ను నిర్మించినప్పుడు ఆ రిజర్వాయర్ కింద ఇది మునిగిపోయింది.

పైన పేర్కొన్న పట్టణాలకు సమీపంలో శాటిలైట్ పట్టణాలుగా మరికొన్ని చిన్న చిన్న పట్టణాలు కూడా ఏర్పడ్డాయి.

గ్రామాలతో పోల్చుకుంటే అప్పటి పట్టణాలలో ప్రజలమధ్య సామాజిక, ఆర్థిక అంతరాలు ఎక్కువగా ఉండేవి. సేవకులు, బానిసలు హెచ్చు సంఖ్యలో ఉండేవారు. వీరుగాక ధనవంతులను ఆనందింపజేయడానికి సంగీతకారులు, గాయకులు, నర్తకులు కూడా ఎక్కువమంది ఉండేవారు. పేదరికం, విలాసవంతమైన జీవితం పక్కపక్కనే కొనసాగేవి.

వృత్తులు కులాలుగా నడిచే పరిస్థితి ఉండేది. ఆయా వృత్తుల వ్యవహారాలను నిర్వహించడానికి కుల పెద్దలతో ఏర్పడిన శ్రేణులు ఉండేవి. ఆర్థిక, వ్యాపార లావాదేవీలు ఈ శ్రేణులద్వారా జరిగేవి. ఉష్వదత్తుడు అనే శక రాజు పాలనలో (క్రీ.శ.100) గోవర్ధన అనే పట్టణంలోని రెండు చేనేత వృత్తికి చెందిన శ్రేణులకు రుణంగా కొంత మొత్తం చెల్లించినట్టు, దానిపై చెల్లించవలసిన వడ్డీకి బదులుగా ఆ రెండు శ్రేణులూ ఒకానొక బౌద్ధ సంఘానికి చెందిన 20 మంది బౌద్ధ సన్యాసులకు అవసరమైన దుస్తులను సరఫరా చేసేటట్లు ఒకానొక శాసనంలో పేర్కొన్నారు. ఆ రుణాన్ని శ్రేణులు నేతవృత్తిలో ఉన్న వ్యక్తులకు తిరిగి పంపిణీ చేస్తాయి. (నేటి కార్పొరేషన్ల మాదిరిగా). అదేవిధంగా కుమ్మరి వృత్తికి చెందిన శ్రేణులకు రుణం ఇచ్చి దానికి బదులుగా వారు బౌద్ధ సన్యాసులకు కావలసిన ఔషధ మూలికలను సరరా చేసేటట్లు ఆదేశించిన మరో శాసనం దొరికింది. హువిష్కుడి కాలంలో (క్రీ.శ.188) మేదరి వృత్తికి చెందిన శ్రేణులకు ఇచ్చిన గ్రాంట్లకు బదులుగా వాళ్ళు 100 మంది బ్రాహ్మణులకు కావలసిన ఆహారదినుసులను అందించేటట్లు ఒక శాసనం పేర్కొంది. క్రీ.శ. 300 సమీప కాలానికి చెందిన ఒక శాసనం నాగార్జున కొండ సమీపంలో లభించింది. దాని ప్రకారం తమలపాకు అమ్మేవారికి చెందిన శ్రేణికి ఇచ్చిన రుణం మీద చెల్లించవలసిన వడ్డీతో సమీపంలోని ఒక దేవాలయాన్ని నిర్వహించ వలసివుండేది. దీనిని బట్టి ఆ కాలంలో చేతి వృత్తులలో శ్రేణులు ఆయా వృత్తులలోని సంపన్నుల చేతుల్లో ఉండేవని, వారికింద సాధారణ వృత్తిదారులు అనేకులు

> "వ్యవసాయం విస్తరిస్తున్నకొద్దీ అందులో పశువులను వినియోగించడం పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా పొలాలను దున్నడానికి, నీటిని తోడడానికి పశువులు ఎక్కువగా అవసరం అయాయి. దానివలన పశుసంపదను కలిగివుండే ఉన్నత తరగతి గ్రామీణులు ఒక వర్గంగా రూపొందారు. తక్కిన సామాన్య గ్రామస్తులు వేరుగా ఉన్నారు."



URE 4.5 Rouletted Ware fragments from Arikamedu. R.E.H. Wheeler, et al.

కొనసాగేవారని చెప్పవచ్చు. కొన్ని శ్రేణులు ఆ వృత్తితో సంబంధం లేని వ్యాపారుల, కాంట్రాక్టర్ల ఆధీనంలో కూడా ఉండేవి. అర్థశాస్త్రంలో పట్టణాల్లో ఏ వృత్తికి చెందినవారు ఎక్కడ నివాసం ఉండాలో నిర్దేశించిన అధ్యాయంలో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని విదేశీ వ్యాపారులకు, శ్రేణుల సభ్యులకు కేటాయించారు. నిబంధనలు, కట్టుబాట్లు ఈ శ్రేణులద్వారా అమలు జరిగేవి.

పట్టణాలచుట్టూ రక్షణవలయంలా గోడలను ప్రభుత్వం నిర్మించి వాటికి రక్షణ కల్పించే బాధ్యత వహించేది. నగరాల్లోకి ప్రవేశించే చోట చాలా ఖచ్చితంగా సుంకాలను వసూలు చేసేవారు. పట్టణంలో అమ్మకానికి తెచ్చిన సరుకు విలువలో అయిదో వంతు సుంకంగా చెల్లించాలని అర్థశాస్త్రం నిర్దేశించింది. తక్కువ విలువ కల సరుకులమీద సుంకాలు తక్కువగా ఉండేవి. పట్టణ సరిహద్దు కు ఆవల ఏ విధమైన వ్యాపారాన్నీ అనుమతించే వారు కాదు. పట్టణంలోనే ఉంటూ వ్యాపారాన్ని కొనసాగించే వ్యాపా రులమీద వార్షిక పన్ను విధించేవారు. వృత్తిదారులు, శ్రామికులు నెలకు ఒకరోజు ఏ ప్రతిఫల మూ లేకుం డా ప్రభుత్వం చెప్పిన పనులు చేయాల్సివుండేది. ప్రభువు నిర్ణయిస్తే ఇంకా అదనంగా కూడా నిర్బంధ శ్రమ చేయవలసివచ్చేది.

**డబ్బు, పరపతి, రుణం**

క్రీ.పూ. 200–క్రీ.శ. 300 మధ్య కాలంలో గంట్లు పెట్టిన నాణేల స్థానాన్ని క్రమంగా రాజ ముద్రలతో, రాజుల చిత్రాలతో, వారి బిరు దులతో ఉన్న బంగారు, వెండి, రాగి నాణేలు ఆక్రమించాయి. గ్రీస్ నుండి వాయవ్య భారతంలోకి, ఆ తర్వాత తక్కిన భూభాగంలోకి ఈ ఆనవాయితీ విస్తరించింది. మనుస్మృతిలో వెండి నాణేన్ని పురాణ అని, అర్థశాస్త్రంలో దానినే పణం అని పేర్కొన్నారు. మను స్మృతిలో రాగి నాణేన్ని కర్షపణం అని అన్నారు. ఒక బంగారు నాణేనికి 10.1 వెండి నాణేలను సమానంగా పరిగణించారు.

క్రీ.శ.188 నాటి మధుర శాసనాన్ని బట్టి రుణాలు ఇవ్వడం, వాటిపై వడ్డీలు వసూలు చేయడం ఉండేది. వడ్డీలు నెలవారీ వసూలు చేసేవారు. వడ్డీ రేట్లు నెలకు 1 శాతం, లేదా 0.75 శాతం ఉన్నట్టు ఆ శాసనాలు సూచిస్తున్నాయి. అంటే ఏడాదికి 12 శాతం, లేదా 9 శాతం వడ్డీ అవుతుంది. ద్రవ్యోల్బణం లేని ఆ కాలంలో ఈ మోతాదు వడ్డీలు చాలా ఎక్కువ అనే చెప్పాలి. ఈ రేటుకు తీసుకున్న శ్రేణులు మళ్ళీ ఆ సొమ్మును తమ పరిధిలోని వృత్తిదారులకు రుణంగా ఇచ్చేవారు. అంటే సాధారణ వృత్తిదారుడిమీద వడ్డీ భారం ఇంకా ఎక్కువగా పడేది అని చెప్పాలి.

**భూమార్గ, సముద్రమార్గ వాణిజ్యం**

ఆ కాలంలో గ్రామాలలోని ప్రజలు తమ అవసరాల కోసం పట్టణాలమీద ఆధార పడివుండే పరిస్థితి దాదాపు లేదు. ఉప్పు, ఇనుప పనిముట్లు వంటి కొద్దిపాటి సరుకుల కోసమే గ్రామీణులు పట్టణాలమీద ఆధారపడే వారు. దానికి భిన్నంగా పట్టణాలలోని ప్రజలు తమ ఆహారపు అవసరాలకోసం, ముడి పదార్థాల కోసం గ్రామాలమీద ఎక్కువగా ఆధారపడే వారు. గ్రామీణ ప్రజలనుండి పన్నుల రూపంలో వసూలు చేసిన ఆహార దినుసులను పట్టణాలకు తెచ్చి అక్కడ విక్రయించేవారు. అవిగాక పత్తి, నీలిమందు, మిరియాలు, వంటి పంటలను ప్రత్యేకంగా పండించేవారు. ఆ పంటలను సమీపంలోని పట్టణాలకే గాక దూర

> **“ పట్టుకారు, శ్రావణం, కత్తెర వంటి పనిముట్లు, ఇనుముతో చేసినవి తక్షశిల ప్రాంతంలో క్రీ.శ. మొదటి శతాబ్దం నాటికి వాడుకలో ఉన్నట్టు అక్కడి తవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి నిర్ధారించారు. ఈ మూడు రకాల పనిముట్లూ ఒకే యాంత్రిక సూత్రం ఆధారంగా రూపొందాయి. ”**




FIGURE 4.6 Town conveyances, Mathura sculpture. V.A. Smith.

ప్రాంతాలకు కూడా తీసుకుపోయి విక్రయించే వారు. ఇక మజ్లిన్ వస్త్రాలు, వజ్రాలు, ముత్యాలు వంటివి సుదూర ప్రాంతాలవరకూ తీసుకుపోయి అమ్మేవారు. దక్షిణాదిన పాండ్య రాజ్యం ముత్యాలసాగుకు ప్రసిద్ధి చెందింది. అక్కడి నుంచి ముత్యాలను సేకరించి ఖారవేలుడు తన కళింగరాజ్యానికి తీసుకుపోయినట్టు తమిళ సంగం సాహిత్యంలో ప్రస్తావించారు.

దూరప్రాంతాలకు వ్యాపార సరుకులను రవాణా చేయడానికి వీలుగా ప్రధాన పట్టణాలను కలుపుతూ రహదారులు ఉండేవి. అదే విధంగా ప్రధాన రేవు పట్టణాలను భూభాగంలోని పట్టణాలతో కలుపుతూ మరికొన్ని దారులు ఉండేవి. పశ్చిమాన భరుచ్ రేవు ప్రధాన రేవుగా ఉండేది. అక్కడినుండి సముద్ర మార్గాన గ్రీకులకు, పర్షియన్లకు సరుకుల రాకపోకలు సాగేవి. భరుచ్ నుండి వాయవ్య దిశగా పెషావరుు, తూర్పు దిశగా ఉజ్జయిని వరకు కలుపుతూ దారులు ఉండేవి.

మచిలీపట్టణం దక్షిణాదిన ఒక ముఖ్య వాణిజ్యరేవుగా ఉండేది. అక్కడినుండి రోమ్ నగరం దాకా సముద్రమార్గాన వ్యాపారం సాగేది. మచిలీపట్టణం నుండి భూమార్గాన కోయంబత్తూరు (చేర రాజ్యం) కు భూమార్గం ఉండేది.

చైనా నుండి తక్కిన ఆసియా ఖండానికి, యూరప్ ఖండానికి భూమార్గాన ప్రయాణించడానికి వీలుగా సిల్క్ రూట్ ఏర్పడింది. ఇది క్రీ.శ. ఒకటో శతాబ్దం నాటికి వాణిజ్యానికి ఉపయోగించడం మొదలైంది. చైనా ప్రధాన భూభాగంలో తయారయే మేలురకం పట్టు వస్త్రాలు, పింగాణీ పాత్రలు ప్రపంచ ప్రసిద్ధి కెక్కాయి. ఇక భారత ఉపఖండానికి ఉత్తరాన ఉన్న సింజియాంగ్ ప్రాంతం పచ్చలకు (మరకతం) ప్రసిద్ధి. వీటికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను అందుకోవడం కోసం సిల్క్ రూట్ ఉపయోగపడింది. చైనానుండి సింజియాంగ్ మీదుగా బాక్ట్రియాకు, అక్కడినుండి భరుచ్ వరకు రహదారి ఉండేది. ఈ దారి వెంబడి ఉన్న రాజ్యాలకు వాణిజ్య సుంకాల ద్వారా భారీ ఆదాయం లభించేది.


భారత ఉపఖండానికి వేసవి కాలం ముగింపులో నైరుతి దిశనుండి గాలులు సముద్రం మీదుగా వీచడం, మళ్ళీ ఈశాన్యం నుండి గాలులు సముద్రం వైపుగా వీచడం ప్రతీ ఏడూ క్రమం తప్పకుండా జరుగుతుంది. వీటినే రుతుపవనాలు అంటారు. ఈ రుతుపవనాలను ఉపయోగించుకుని సముద్రమార్గాన ప్రయాణా లకు ప్రణాళికలు వేసుకునేవారు. అరేబియన్ సముద్రానికి, భారత ఉపఖండానికి సంబంధించిన భౌగోళిక అవగాహన పశ్చిమదేశాల నుండి వచ్చిపోయే వ్యాపారులకు క్రీ.శ. ఒకటో శతాబ్దం నాటికి స్పష్టంగా వచ్చింది. ఆ కాలంలో లాటిన్‌లో ప్లినీ రచించిన ప్రకృతి చరిత్ర అన్న గ్రంధంలోను, పెరిప్లస్ అన్న గ్రీకు (వాణిజ్య విధివిధానాలకు సంబంధించిన) గ్రంథంలోను ఇది కనిపిస్తుంది. ఆ అవగాహన ప్రాతిపదికన సముద్రయాన ప్రణాళికలను రూపొందించుకునేవారు. ఈశాన్య, నైరుతి రుతుపవనాలను తమ ప్రయాణాలకు అనుకూలంగా ఉపయోగించుకోవడం తెలిసిన తర్వాత సముద్రమార్గాన వాణిజ్యం బాగా పెరిగింది. గ్రీకులే కాకుండా ఈజిప్షియన్లు, అరబ్బులు కూడా ఈ పద్ధతులను వినియోగించడం ప్రారంభించారు. దాంతో అటు ఎర్ర సముద్రం నుండి ఇటు అరేబియా సముద్రం దాకా వాణిజ్యం జోరు పెరిగింది. ఆ తర్వాత శ్రీలంక, మచిలీపట్నం వరకూ విస్తరించింది. క్రీ.పూ. 27-24 మధ్య ఈజిప్టును సందర్శించిన గ్రీకు పర్యాటకుడు స్ట్రాబో ఆ కాలంలో ఎర్ర సముద్రం నుండి భారత ఉపఖండానికి 120 నౌకలు ప్రయాణం చేస్తూవుండేవని పేర్కొన్నాడు. గ్రీకులు నౌకల నిర్మాణంలో మేకులతో చెక్కలను అతికేవారు. కానీ భారత ఉపఖండంలో నారతో కలపలను గట్టిగా కట్టి నౌకలను నిర్మించే విధానం ఉండేది. ఇప్పటికీ నాటు పడవల తయారీలో అదే పద్ధతి అమలు జరుగుతోంది. దీనివలన ఇక్కడ బాగా పెద్ద సైజు నౌకలను తయారు చేయగలిగేవారు. సముద్ర వ్యాపారం విస్తరణతో ఈ నౌకలకు డిమాండ్ కూడా పెరిగింది. నౌకల నిర్మాణం భారత ఉపఖండ తీరం వెంబడి వివిధ రేవు పట్టణాలలో బాగా పెరిగింది. (చూ. మ్యాప్ 4.3)

దక్షిణ భారత ఉపఖండం నుండి మిరియాలు, దాల్చినచెక్క, ముత్యాలు, వజ్రాలు, మరకతాలు ఎగుమతి అయ్యేవి. వీటికి రోమ్ దేశంలో చాలా గిరాకీ ఉండేది. పశ్చిమాన భరుచ్ నుండి నీల మణులు, కెంపులు, గోమేధికాలు, పగడాలు , ఔషధాలు, ఏనుగు దంతాలు ఎగుమతయ్యేవి. దాదాపు అన్ని రేవులనుండి విరివిగా ఎగుమతి జరిగిన సరుకు నూలు దుస్తులు, నూలు దారం. చైనా నుండి మచిలీపట్నం రేవుకు పట్టు దిగుమతి జరిగేది. ఇతర దిగుమతుల్లో పింగాణీ వస్తువులు, గాజు వస్తువులు, రాగి, ఆర్సెనిక్, ఏన్టిమనీ వంటి ఖనిజాలు ఉండేవి. బంగాళాఖాతం ద్వారా సముద్ర వ్యాపారం వియత్నాం వరకూ సాగింది. అదే మాదిరిగా ఇండోనేసియా, థాయ్‌లాండ్, కాంబోడియా, మలయాలకు కూడా సముద్ర మార్గాన వాణిజ్యం, రాకపోకలు విరివిగా సాగాయి. ఆ క్రమంలోనే దక్షిణాసియా ప్రాంతాలనుండి భారతదేశం కొబ్బరి సాగును దిగుమతి చేసుకుంది. మన దేశ తీర ప్రాంతం యావత్తూ ఇప్పుడు కొబ్బరి సాగు ఒక విలువైన వ్యాపకం అయింది.

| కాల పట్టిక | |
|---|---|
| చైనాకు సిల్క్ రూట్ ప్రారంభం | క్రీ.శ.100 |
| అరేబియా సముద్రం గుండా నేరుగా రాకపోకలు | క్రీ.శ. 50 |
| కొబ్బరి చెట్టు గురించి మొదటి ప్రస్తావన | క్రీ.శ. 100 |

ఇంటర్వ్యూ

# ఆటవిక పెట్టుబడిదారీ వ్యవస్థతో ప్రమాదం


రచయిత ప్రముఖ అమెరికన్ భాషా శాస్త్రవేత్త, రాజకీయ విశ్లేషకుడు

నోమ్ చోమ్‌స్కీ

**(పెట్టుబడిదారీ విధానవైఫల్యం, పర్యావరణ పరిరక్షణ, బ్యాంకుల దివాళా, ఉక్రెయిన్ యుద్ధం తదితరాలపై ప్రముఖ ఆర్థికవేత్త నోమ్‌చోమ్‌స్కీతో డేవిడ్ బర్సా మియాన్ జరిపిన ఇంటర్వ్యూ వివరాలను పాఠకులకు అందిస్తున్నాం -సంపాదకుడు.)**

డేవిడ్ బర్సామియాన్: **ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్ గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజస్ సంస్థ మార్చి 20వ తేదీన తన నూతన నివేదికను అందజేసింది. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలతో కూడిన ఈ ఐపిసిసి ఇచ్చిన నూతన నివేదికలో పర్యావరణ సంక్షోభాన్ని పరిష్కరించటానికి సమయం పరిమితంగానే ఉన్నదని, కాబట్టి సమయాన్ని వృధా చేయరాదని పేర్కొంది. "గడిచిన 2000 సంవత్సరాలతో పోలిస్తే గత 50 సంవత్సరాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల రేటు అత్యధికంగా ఉంది. గత 20 లక్షల సంవత్సరాలతో పోలిస్తే ప్రస్తుత 50 సంవత్సరాలలోనే కార్బన్ డై ఆక్సైడ్ కేంద్రీకరణ ఎక్కువగా ఉంది. "పర్యావరణ టైంబాంబు పేలటానికి సిద్ధంగా ఉంది" అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరస్ చెప్పాడు. కాప్ 27 సమావేశంలో ఆయన ఈ విధంగా చెప్పాడు. "పర్యావరణాన్ని విధ్వంసం చేసే మార్గంలో మనం అత్యంత వేగంగా ప్రయాణం చేస్తున్నాం. మనకాలు ఇంకా యాక్సిలరేటర్ పైనే ఉంది. మనకాలానికి సంబంధించిన అత్యంత కీలకమైన, ఈ శతాబ్దానికి సంబంధించి అత్యంత ప్రధానమైన సమస్య ఇది". దీనికి సంబంధించి మిమ్ముల్ని అడుగుతున్న ప్రశ్న, మానవజాతి పునరుజ్జీవన సమస్య ప్రజలందరినీ కదిలిస్తుందా? దీనిని అత్యవసరంగా పరిష్కరించటానికి తగిన చర్యలు ఎందుకు తీసుకోవటం లేదు?"**

**నోమ్‌చోమ్‌స్కీ:** గుటెరస్ చేసిన ప్రకటన చాలా తీవ్రమైనది. అది ఇంకా తీవ్రంగా ఉండాలని నేను భావిస్తున్నాను. ఈ శతాబ్దంలోనే కాదు, మానవజాతి చరిత్రలోనే ఇది అత్యంత ప్రధానమైనది. ఆయన చెప్పినట్లుగానే ఈ రోజు భూమిపై మానవజాతి జీవనం ముందుకు సాగుతుందా అన్న పరిస్థితులలో మనం ఉన్నాం. సులభంగా అర్థం చేసుకొనేలా ఐపిసిసి నివేదిక స్పష్టంగా ఉన్నది. వెనుదిరగటం సాధ్యం కాని పరిణామాలు చోటుచేసుకొనే పరిస్థితులకు మనం చేరుకున్నాం. రేపే అందరం చనిపోతామనేది దీనర్థం కాదు. విధ్వంసాన్ని నివారించటానికి అవసరమైన చర్యలు తీసుకోలేని పరిస్థితులలో ఉన్నాం.

కాబట్టి, సంఘటితమైన మానవ సమాజం ఏ రూపంలో నైనా మిగిలివుంటుం దా అన్నది ప్రశ్న. తీవ్రమైన ప్రమాదాలు, భయానక పరిస్థితులు, ఇటువంటి విధ్వం సాలకు ధనికదేశాలు కారణమౌతు న్నాయి. కాని ఈ విధ్వంసానికి ఏ మాత్రం కారణం కాని దేశాలు దాని దుష్పరిణామాలను అనుభవిస్తున్నాయి. ఈ విపత్తుకు ధనిక దేశాలు కారణమౌతున్నాయని, దాని దుష్పరిణామాలకు మాత్రం పేద దేశాలు బలైపోతున్నాయని సరిగానే చెబుతున్నారు. కాని దానికి చిన్న సవరణ చేయాల్సివుంది. ధనికదేశాలలో ఉన్న ధనికులు ఈ సమస్యకు కారణమౌతున్నారు. పేదదేశాలతో పాటు ధనికదేశాలలో ఉన్న పేదలు కూడా దీని దుష్పరిణామాలను అనుభవిస్తున్నారు.

కాబట్టి ఏమి జరగబోతున్నది? అమెరికాను, అక్కడి రెండు రాజకీయ పార్టీలను చూడండి. ఒక పార్టీ ఈ విపత్తును 100 శాతం తిరస్కరిస్తున్నది. పర్యావరణ మార్పులు చోటు చేసుకోవటం లేదని చెబుతున్నది. ఒకవేళ చోటు చేసుకున్నప్పటికీ అది తమకు సంబంధించిన అంశం కాదంటున్నది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించే చట్టం మౌలికంగా పర్యావరణానికి సంబంధించినది. కాంగ్రెస్ దానిని బాగా నీరుగార్చినప్పటికీ, దానికి ఆమోదం పొందటంలో బైడెన్ విజయం సాధించాడు. రిపబ్లికన్‌లలో ఒక్కరు కూడా దానికి ఓటు చేయలేదు. తాము సేవచేస్తున్న కార్పొరేట్ సంస్థలు, ధనికుల ప్రయోజనాలకు, లాభాలకు విఘాతం కలిగించే ఎటువంటి చట్టాలకు రిపబ్లికన్‌లు ఓటుచేయరు. ఇది ఎప్పుడూ జరుగుతున్నది. జాన్ మెక్‌కెయిన్ అమెరికా అధ్యక్షపదవి కోసం పోటీపడుతున్న 2008 సంవత్సరాన్ని తీసుకోండి. ఆయనకు చిన్న పర్యావరణ కార్యక్రమం ఉన్నది. అది పెద్దది కాదు, చాలా చిన్నది మాత్రమే. ప్రతి ఒక్కరికి తెలిసిన ఈ అంశంపై ఏదైనా చేయటం సంక్షోభాన్ని తీసుకొస్తుందని రిపబ్లికన్‌లతో పాటు కాంగ్రెస్ కూడా భావించింది. ఇంధనరంగంలో ఉన్న కోచ్ సోదరులు దానిని రద్దుచేయించటంలో విజయం సాధించారు. మానవ నాగరికతను ధ్వసం చేయటానికి తాముచేస్తున్న కార్యక్రమాలకు రిపబ్లికన్‌ల మద్దతు పొందటం కోసం వారు సంవత్సరాల తరబడి కృషి చేస్తున్నారు. లాబీయింగ్ చేయటం, బెదిరించటం, లంచాలు ఇవ్వటం, తాము చెప్పినదానిని చిలుక పలుకులుగా వల్లించేలా, రిపబ్లికన్‌లు దీనిని పూర్తిగా తిరస్కరించేలా చేయటం కోసం పెద్ద ప్రచారోద్యమాన్ని నడిపి వారు విజయం సాధించారు. పర్యావరణ ప్రమాదం లేదని ప్రచారం చేసేవారిగా రిపబ్లికన్‌లను మలచారు.

అప్పటి నుండి పర్యావరణ విధ్వంస ప్రమాదాన్ని తిరస్కరించటంలో మొదటిదిగా రిపబ్లికన్ పార్టీ ఉంటున్నది. 2016 అధ్యక్ష

> **“ నారాయణ్ రాణే కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి. మొదట కాంగ్రెస్‌లోను, తరువాత శివసేనలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అవిఘ్న హౌసింగ్ స్కాంలో ఈడి విచారణను ఎదుర్కొన్నారు. ఎప్పుడైతే బిజెపిలో చేరి కేంద్రమంత్రి అయ్యారో అప్పటి నుండి కేసు విచారణలో ఎటువంటి పురోగతి లేదు. ”**

ఎన్నికలలో ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ అవటానికి ముందు అధ్యక్షునిగా పోటీ చేయటం కోసం పార్టీ ఆమోదం పొందటానికి ప్రయత్నించిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులందరూ పర్యావరణ విధ్వంస ప్రమాదాన్ని తిరస్కరించారు లేదా అది తమపనికాదని చెప్పారు. ఓహియో గవర్నర్‌గా ఉన్న జాన్ కాసిక్‌ది చిన్న మినహాయింపు మాత్రమే. ఆయన స్పందన మిగతా వారికంటే అధ్వాన్నంగా ఉంది. “గ్లోబల్ వార్మింగ్ రావచ్చు. మానవులే దానికి కారణం కావచ్చు. కాని ఓహియోలో ఉన్న మేము ఇక్కడ ఉన్న బొగ్గును స్వేచ్ఛగా, ఎవరికీ క్షమాపణలు చెప్పకుండా వినియోగించుకుంటాం” అని ప్రకటించాడు. తర్వాత జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశానికి ఆయనను ఆహ్వానించి, గొప్పగా గౌరవించారు. రెండు రాజకీయ పార్టీలలో ఒకదాని తీరిది. ఈ దారి నుండి మళ్ళే ఆలోచన వారిలో ఏ మాత్రం లేదు. తమ ప్రధాన కేంద్రం సంపన్నంగా, శక్తివంతంగా ఉంటే విధ్వంసాన్ని తీసుకు రావటానికి పోటిపడదామనే ఆలోచనలో వారున్నారు.

ఇపుడు రెండోపార్టీ తీరుతెన్నులు చూద్దాం. బెర్ని శాండర్స్ చొరవ, సన్‌రైజ్ ఉద్యమం చురుకుగా ఉండటం వలన జో బైడెన్‌కి కూడా మొదట్లో ఒక మాదిరి పర్యావరణ కార్యక్రమం ఉన్నది. అయినప్పటికీ కొంతమేరకు ముందడుగు వేయవచ్చన్న ఆశలు అత్యాశలుగా మిగిలాయి. 100 శాతం రిపబ్లికన్‌ల వ్యతిరేకత, డెమొక్రటిక్ పార్టీలోని ఇద్దరు మితవాదులు జో మాన్‌చిన్, కిర్‌స్టిన్ సైనెమాల వ్యతిరేకతతో దానిని క్రమంగా కుదించివేశారు. చివరకు ద్రవ్యోల్బణాన్ని తగ్గించే చట్టం రావటం జరిగింది. ఇంధన కార్పొరేషన్లకు రాయితీలు ప్రకటించటం ద్వారా మాత్రమే దానికి ఆమోదం పొందగలిగారు.

మన సంస్థాగత నిర్మాణం ఎంత దెబ్బతిన్నదో ఇది స్పష్టం చేస్తున్నది. భూగోళాన్ని, భూమిపై మానవజాతి ఉనికిని ధ్వంసం చేయటాన్ని ఆపటానికి ధనికులు, శక్తివంతులైన వారిని నీ వెంట తీసుకెళ్ళాలంటే వారికి లంచాలు ఇవ్వాల్సివస్తున్నది. వారికి కావలసినంత మనం ఇస్తే వారు మనుషులను చంపటం ఆపుతారు. ఇది ఆటవిక పెట్టుబడిదారి విధానం. నీవు ఏదైనా చేయటానికి పూనుకుంటే దానిపై అధికారం ఉన్నవారికి లంచాలు ఇవ్వాల్సివస్తున్నది.

ఏం జరుగుతున్నదో చూడండి. ఆయిల్ ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఇంధనం ప్రజలకు అందుబాటులో ఉండదని కార్పొరేషన్‌లు చెబుతున్నాయి. మనల్ని నాశనం చేయటం ద్వారా మరింతగా లాభాలు సాధిస్తామని వారు చెబుతున్నారు. ఎంతోకొంత చేసే బిపి కంపెనీ కూడా తమ లాభాల కోసం దేన్నైనా ధ్వంసం చేస్తామని చెబుతున్నది.

గ్లాస్గో కాప్ సమావేశంలో ఇది మరింతగా స్పష్టమైంది. అమెరికా పర్యావరణ ప్రతినిధి జాన్‌కెర్రి అత్యంత సంతోషంగా ఉన్నాడు. మౌలికంగా తాము విజయం సాధించామని అతడు చెప్పాడు. ప్రస్తుతం కార్పొరేషన్‌లు తమ వెంట ఉన్నాయని, కాబట్టి తాము ఓడిపోవటం జరగదని చెప్పాడు. ఆర్థిక, రాజకీయవేత్త ఆడం టూంజ్ ఒక చిన్న వివరణను గురించి ప్రస్తావించి, రెండు షరతులతో వారు చెప్పిన దానిని అంగీకరిస్తున్నామని చెప్పాడు. ఒకటి, వారికి లాభకరంగా ఉన్నంతకాలం మనతో కలిసివస్తారు. రెండవది, తమకేమైనా నష్టం జరిగితే దానిని పన్ను చెల్లించే ప్రజలు భరిస్తారని అంతర్జాతీయంగా గ్యారంటి కావాలని కోరారు. దీనినే వారు స్వేచ్ఛా వ్యాపారం అని పిలుస్తున్నారు. ఈ విధమైన సంస్థాగత నిర్మాణం వలన వారి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇపుడు బైడెన్ ప్రభుత్వం ఏం చేస్తున్నది? విల్లో ప్రాజెక్టును తీసుకొండి. అలాస్కాలో ప్రధానమైన ప్రాజెక్టును ప్రారంభించటానికి కొనొకొ ఫిలిప్స్‌కు వారు అవకాశం ఇచ్చారు. అది దశాబ్దాల తరబడి ఆన్‌లైన్ ద్వారా ఎక్కువ శిలాజ ఇంధనాలను తీసుకొస్తున్నది. అలాస్కాలోని ఆయిల్ నిల్వలపై ఉన్న భూమిపై మరింతగా ఒత్తిడి పెంచుతున్నారు. అంతర్గతంగా ఉన్న అపార ఆయిల్ నిల్వలపై ఉన్న ఈ భూభాగం కరిగిపోతే పెద్దమొత్తంలో గ్రీన్‌హౌస్ వాయువులు వాతావరణంలోకి విడుదల అవుతాయి. అది వినాశకరంగా పరిణమిస్తుంది. వారు ఆ భూభాగాన్ని గట్టిగా మార్చటంలో పెద్ద ముందడుగు వేశారు. వారు ఈ పని ఎందుకు చేస్తున్నారు? ఆయిల్‌ను మరింత శక్తివంతంగా వెలికితీయటం కోసం దీనిని వినియోగిస్తున్నారు. ఇది అత్యంత స్పష్టంగా మనకళ్ళ ముందే సాగుతున్న ఆటవిక పెట్టుబడిదారి విధానం.

ప్రజల దృక్పధం ఎలా ఉంటున్నది? ప్యూ సంస్థ వివిధ అంశాలపై క్రమబద్ధంగా పోలింగ్ నిర్వహిస్తుంటుంది. ఈ మధ్య జరిగిన పోలింగ్‌లో రెండు డజన్ల ముఖ్యమైన అంశాలను ఎంపిక చేసి, ప్రాధాన్యతా క్రమంలో జాబితా రాయమని చెప్పారు. కాని పర్యావరణ పరిరక్షణ అంత ప్రాధాన్యత గల అణుయుద్ధం గురించి కనీసం జాబితాలో చేర్చలేదు. పర్యావరణం అంశాన్ని కూడా జాబితా చివరలో ఉంచారు. ఏ మాత్రం సమస్య కానటువంటి బడ్జెట్‌లోటుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. 13 శాతం రిపబ్లికన్‌లు మాత్రమే పర్యావరణం అత్యవసర సమస్య అని భావించారు. డెమొక్రాట్లలో ఈ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఇది సరిపోదు.

ప్రశ్న ఏమిటంటే సాధారణ మానవ విలువలైన ఇష్టాలు, మాటకు విలువ, మానవజాతి కొనసాగటం తదితరాలపై ప్రభుత్వాలు, పెట్టుబడిదారి సంస్థల వ్యతిరేకతను అధిగమించి, ప్రజలను కార్యాచరణ లోకి సమీకరించగలరా?

బర్సామియాన్: **ఈ ప్రశ్న ఎల్లప్పుడూ ముందుకొస్తున్నది. మీరు కూడా లక్షల సార్లు వినివుంటారు. ఆర్థికవ్యవస్థను నిర్వహిస్తున్న వారికి, పరిశ్రమల యజమానులు, సిఇఒలకు కూడా పిల్లలు, మనుమలు, మనుమరాండ్రు ఉంటారు. వారిని కాపాడుకోవటం గురించి ఆలోచించరా? వారి భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టేవిధంగా వ్యవహరిస్తారా?**

**చోమ్‌స్కీ:** మీరు జె పి మోర్గాన్‌కు సి ఇ ఒ అనుకుందాం. జామీ డైమన్ స్థానంలోకి మీరు వస్తారు. శిలాజ ఇంధనాలకు నిధులను ఇచ్చేటపుడు మీరు మీ పిల్లల భవిష్యత్‌ను

నాశనం చేస్తున్నారని మీకు తెలుస్తుంది. నేను వారి ఆలోచనలను చదవలేను కాని వారు ఈ విధంగా ఆలోచిస్తూ ఉండవచ్చు. నేను ఈ పని చేయకపోయినా లాభాలు, మార్కెట్‌లో వాటాను పెంచుకోవటం కోసం వెంపర్లాడే మరొకరు చేస్తారు. నేను బయటికిపోయినా నాలాంటి వాడు ఇంకొకడు వస్తాడు. ప్రతిదానిని నాశనం చేస్తున్నామని, దాని మోతాదును కొంత తగ్గించాలన్న కనీస అవగాహన నాకు ఉంటుంది. నా తర్వాత వచ్చేవారికి అదేమీ ఉండదు. అందువలన మానవజాతికి మేలు చేసేవాడిగా శిలాజ ఇంధనాలను అభివృద్ధి చేయటాన్ని కొనసాగిస్తానని భావిస్తాడు.

ఈ పనిచేస్తున్నవారందరూ ఆ విధంగా తమను తాము ఒప్పించుకుంటారు. ఎగ్జాన్ మొబిల్ శాస్త్రవేత్తలు భూతాపం పెరగటం వలన ఎదురయే ప్రమాదాలు, భయానక పరిణామాలను గమనించటంలో ముందెత్తున ఉన్నారు. మనం ప్రపంచాన్ని నాశనం చేస్తున్నామని దశాబ్దాల తరబడి యాజమాన్యానికి తెలియజేస్తూనే ఉన్నారు.

ప్రఖ్యాత భూభౌతిక శాస్త్రవేత్త జేమ్స్ హన్‌సెన్ మనం విధ్వంసం వైపుకు వెళుతున్నామని సెనెట్‌లో చెప్పి, సాక్ష్యాలను కూడా అందజేశాడు. ఎగ్జాన్ మొబిల్, ఇతర కంపెనీలు దానిని గురించి ఆలోచించాల్సివచ్చింది. ఇంకెంతో కాలం ఈ సమస్యను పక్కన పెట్టటం సాధ్యం కాదని వారికి అర్థమైంది. వారి ప్రజా సంబంధాల అధికారులను పిలిచి 'దీనిని ఏ విధంగా పరిష్కరించగలం' అని అడిగారు. వారు ఈ విధంగా చెప్పారు, "మీరు దీనిని తిరస్కరిస్తే మీ ఆలోచనలు వెల్లడౌతాయి. కాబట్టి దీనిని తిరస్కరించవద్దు. కేవలం అనుమానాలను వ్యక్తం చేయండి. అది నిజం కావచ్చు. కాకపోవచ్చు. అన్ని అవకాశాలను మనం పరిశీలించలేదు. సూర్యునిపై మచ్చలను అర్థం చేసుకోలేమని చెప్పండి. మేఘాల ముసుగును ప్రశ్నించండి. ఫలితంగా మనం మరింత ధనికుల మౌతాం. మరింత సంపన్నవంతమైన సమాజాన్ని నిర్మిస్తాం. మేమందరం మరింతగా లాభాలను సంపాదిస్తాం. ఇందులో ఏ మాత్రం వాస్తవం ఉన్నా, దానిని పరిష్కరించటంలో మరింత మంచి స్థానంలో ఉంటామని చెప్పండి " అని బోధించారు.

వారి ప్రచార విధానం అది. అప్పుడు మీకు శక్తివంతులైన, రిపబ్లికన్ పార్టీని కొనుగోలు చేసిన కోచ్ సోదరులు ఎదురౌతారు. రిపబ్లికన్ పార్టీ అన్నింటినీ తిరస్కరించేలా వారు చేస్తారు. లిబరల్స్ ఈ పుకార్లు

> **"ఈడి డైరెక్టర్ పదవీకాలం పదేపదే పొడిగించడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆయన 5 ఏళ్ళపాటు పదవిలో కొనసాగేలా చట్టసవరణకు పూనుకుంది. దీనివల్ల అతను నవంబరు 2023లో మాత్రమే పదవీ విరమణ పొందుతాడు. దర్యాప్తు విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నా తనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉందని ఈడి వాదిస్తోంది."**

పుట్టిస్తున్నారని చెబుతారు.

డెమోక్రాట్లు ఇతర మార్గాల ద్వారా దీనికి తోడ్పాటునందిస్తారు. టెక్సాస్ సరిహద్దులలో జరిగిన ఎన్నికలలో ఒక ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. ఎప్పుడూ డెమోక్రాట్లకు ఓటువేసే మెక్సికన్ అమెరికన్లు ఈసారి ట్రంప్‌కు ఓటుచేశారు. ఎందుకు? మీరు తేలికగా అర్థం చేసుకోవచ్చు. 'నాకు ఆయిల్ పరిశ్రమలో ఉద్యోగం వచ్చింది. భూతాపం పెరుగుతున్నదని లిబరల్ ఎలైటిస్టులు చేస్తున్న ప్రచారం వలన డెమోక్రాట్లు నా ఉద్యోగాన్ని ఊడగొడతారు. నా కుటుంబం నాశనం అవుతుంది. వారికి నేనెందుకు ఓటు చేయాలి? ట్రంప్‌కు ఓటువేద్దాం. కనీసం ఉద్యోగాన్ని నిలబెట్టుకొని, కుటుంబాన్ని పోషించుకోవచ్చు' అని ఆలోచించారు.

ప్రజలను సమీకరించి, సమస్యపై అవగాహన పెంచే కార్యక్రమాన్ని డెమోక్రాట్లు చేయలేదు. "పర్యావరణ సమస్య మిమ్ముల్ని, మీ కుటుంబాలను నాశనం చేస్తుంది. ప్రత్యామ్నాయ ఇంధన రంగాలలో మీకు మంచి ఉద్యోగాలు వస్తాయి. మీ కుటుంబాలు క్షేమంగా ఉంటాయి" అన్న విషయాలను వారు ప్రజలకు చెప్పలేదు. ఈ విషయాలు చెప్పిన చోట ప్రజలు వారికే ఓటుచేశారు. తీరప్రాంతంలోని వెస్ట్ వర్జీనియాలోని బొగ్గు పరిశ్రమ ప్రతినిధిగా ఉన్న సెనెటర్ జో మాన్‌చిన్ అన్నింటినీ నిరోధించాడు. ఆర్థిక, రాజకీయ అంశాలపై అధ్యయనం చేస్తున్న మసాచుసెట్స్ యూనివర్సిటీలో ఉన్న నా మిత్రుడు బాబ్ పొల్లిన్, ఆయన గ్రూపు దిగువస్థాయిలో పనిచేస్తున్నారు. వారితో ఉన్న తొమ్మిది మంది కార్మికులు పునరుత్పాదక ఇంధన రంగానికి మారాలని కోరుతున్నారు. ఈ విధంగా మారాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ మైన్ వర్కర్స్ తీర్మానాన్ని ఆమోదించారు.

**ద్రవ్యరంగ సరళీకరణతో బ్యాంకుల దివాళా**

బర్సామియాన్: **సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంకులు దివాళా తీశాయి. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ అనేక సమస్యలలో ఉన్నది. బ్యాంకింగ్‌రంగంలో జరుగుతున్న పరిణామాలపై మీ అభిప్రాయం ఏమిటి?**

**చోమ్‌స్కీ:** ఈ రంగంలో నాకు ప్రత్యేకమైన అనుభవం లేదని మొదటగా చెబుతున్నాను. ఈ రంగంలో అనుభవం ఉన్న, విశ్వసనీయులైన పాల్‌క్రుగ్‌మన్ లాంటి వాళ్ళు చాలా చక్కగా చెబుతున్నారు. దానిని మనం అర్థం చేసుకోలేక పోతున్నాం. నిబంధనలను సడలించాలని సంవత్సరాల క్రితం డిమాండ్ చేసినట్లే ఇప్పుడూ ద్రవ్యరంగాన్ని సరళీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ద్రవ్యరంగాన్ని సరళీకరిస్తే దేశం పారిశ్రామిక రహితం అవుతుంది. ఆర్థికవ్యవస్థకు ద్రవ్యరంగం పునాదిగా మారుతుంది. సరుకులు తయారు చేయటం ద్వారా కాకుండా ద్రవ్యరంగం ద్వారా వారు లాభాలు పొందుతారు. అది బాగా లాభకరమైనప్పటికీ రిస్క్ ఎక్కువగా ఉంటుంది. త్వరగా సంక్షోభాన్ని ఎదుర్కొంటారు. అప్పుడు పన్ను చెల్లింపుదారుల డబ్బుతో తమను గట్టెక్కించమని ప్రభుత్వాన్ని వేడుకుంటారు.

ఆర్థికవ్యవస్థ బాగా అభివృద్ధి చెందిన 1950, 60 దశాబ్దాలలో భారీస్థాయిలో బ్యాంకింగ్ సంక్షోభాలు రాలేదు. బ్యాంకింగ్ రంగంపై ప్రభుత్వానికి గట్టి అదుపు ఉండటమే అందుకు కారణం. ఆ రోజుల్లో బ్యాంకు బ్యాంకులాగానే ఉండేది. మీ దగ్గర ఉన్న అదనపు ధనాన్ని బ్యాంకులో దాచుకొనేవారు. తమ పిల్లలను కాలేజిలో చేర్చటం కోసమో లేక తాము కారు కొనుక్కోవటం కోసమో వేరొకరు వచ్చి డబ్బు తీసుకొనేవారు. అది బ్యాంకింగ్ విధానం. జిమ్మీ కార్టర్ కాలంలో ప్రారంభమైన మార్పు రొనాల్డ్ రీగన్ కాలంలో తుఫాన్‌లా మారింది. లారి సమ్మర్స్ లాంటి వారు డెరివేటివ్స్‌ను సరళతరం చేయమని, అన్నింటిపైనా ఆంక్షలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. దానితో ఒక సంక్షోభం

> “ నేషనల్ హెరాల్ట్ కేసులో ఒక రాజకీయ నాయకుడు ఇచ్చిన వ్యక్తిగత ఫిర్యాదు తప్ప ఎటువంటి ప్రాథమిక నిర్ధారణలు లేవు. ఈ నిర్ధారణ లేకనే ఆగిపోయిన ఈడి ప్రాథమిక విచారణ 2015 సర్క్యులర్‌తో హఠాత్తుగా ఆ సంవత్సరం సెప్టెంబరులో మళ్ళీ తెరమీదకి వచ్చింది. ”

తర్వాత మరో సంక్షోభం చోటు చేసుకుంటున్నాయి. సేవింగ్స్, రుణాలకు సంబంధించి భారీ సంక్షోభాలతో రీగన్ ప్రభుత్వ హయాం ముగిసింది. ప్రజలు పన్నులు చెల్లిస్తుండగా ధనికులు సమృద్ధిగా సంపాదించుకొంటున్నారు.

బాబ్ పొల్లిన్, జెని ఎపిస్టైన్‌లు దీనిని ‘‘బెయిల్ అవుట్ ఆర్థికవ్యవస్థ’’ అని పిలుస్తున్నారు. స్వేచ్ఛగా ఉండే పరిశ్రమలు సాధ్యమైనంత కాలం ధనం సంపాదించుకుంటాయి. సంక్షోభం వచ్చినపుడు ప్రజల డబ్బుతో వారిని సంక్షోభం నుండి బయటపడ వేస్తారు. 2008లో అతిపెద్ద సంక్షోభం నుండి గట్టెక్కించారు. ఏం జరిగింది? బిల్‌క్లింటన్ కాలంలో డెరివేటివ్స్ లాంటి చిక్కులతో కూడిన ద్రవ్య ఉత్పత్తులను సరళీకరించటం వలన ఇళ్ళ నిర్మాణం, ద్రవ్యరంగాలు సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. రెండు అంశాలతో కాంగ్రెస్ టిఎఆర్‌పి ని ఆమోదించింది. ఒబామా ప్రభుత్వం ఒప్పందంలోని ఏ భాగాన్ని అమలుచేసి ఉంటుందో మీరు ఊహించండి. అది ఒక పెద్ద కుంభకోణం. తక్కువ విలువైన ఆస్తులను హామీగా పెట్టి, తాహతుకు మించి రుణాలు తీసుకున్న గుంపులను మొదట సంక్షోభం నుండి బయటపడవేశారు. రుణాలను చెల్లించలేని సామాన్య ప్రజల ఇళ్ళను లాక్కొని వారిని రోడ్లపైకి నెట్టారు. జరిగిన దానిని ఖండిస్తూ ట్రెజరి డిపార్ట్‌మెంటు ఇన్స్‌స్పెక్టర్ జనరల్ నీల్ బారోఫ్‌స్కీ ఒక పుస్తకం రాశాడు. అయినా ఏ మాత్రం ప్రయోజనం లేదు. తమకోసం పార్టీ ఉన్నదని నమ్మి, మార్పు తీసుకువస్తాడని భావించి ఒబామాకు ఓటు వేసిన ఓటర్లు తాము మోసపోయామని భావించటంతో ట్రంప్ ఓటర్లుగా మారారు.

### ఉక్రెయిన్ యుద్ధం ముగింపును వ్యతిరేకిస్తున్న అమెరికా

**బర్సామియాన్: రెండవ సంవత్సరంలోకి ప్రవేశించిన ఉక్రెయిన్ యుద్ధానికి కనుచూపు మేరలో ముగింపు కనిపించటం లేదు. యుద్ధాన్ని ముగించటం కోసం చైనా ఒక శాంతి ప్రతిపాదన చేసింది. యుద్ధం త్వరగా ముగియటానికి అవకాశాలు ఉన్నాయా?**

**చోమ్‌స్కీ:** యుద్ధం వలన పరిస్థితులు మరింత దిగజారకముందే దానికి ఒక ముగింపును కనుగొనాలని ప్రపంచంలోని వర్ధమాన దేశాలన్నీ పిలుపునిచ్చాయి. రష్యా దాడి నేరపూరితమైన దురాక్రమణ. తమను తాము రక్షించుకొనే హక్కు ఉక్రేనియన్లకు ఉంది. అయితే అమెరికా చర్చలు జరగటానికి అంగీకరిస్తుందా అన్నది ప్రధానమైన పశ్న. రష్యా తీవ్రంగా బలహీనపడిపోయే వరకు యుద్ధాన్ని కొనసాగించాలనేది అమెరికా అధికారిక విధానంగా ఉంది. వాస్తవానికి ఈ యుద్ధం నుండి అమెరికా ప్రయోజనం పొందుతున్నది. బ్రహ్మాండమైన తన సైనిక బడ్జెట్‌లో కొద్ది మొత్తంతో సైనికంగా తనకు ప్రధాన శత్రువు అయిన రష్యాను బలహీనపరచాలని భావిస్తున్నది. రష్యా ఆర్థికంగా బలమైన శక్తిగా లేనప్పటికీ దానికి బలమైన సైనికశక్తి ఉంది. దానిని బలహీనపరచటం కోసమే ఈ యుద్ధం చేస్తున్నారా అని మీరు అడగవచ్చు. అందుకోసమే యుద్ధం చేస్తున్నారన్నది వాస్తవం.

యుద్ధాన్ని కొనసాగించటానికి వారొక సాకు చూపుతున్నారు. యుద్ధానికి మద్దతు ఇవ్వటం కొనసాగిస్తే బేరసారాలు చేయటంలో ఉక్రెయిన్ పరిస్థితి మెరుగుపడుతుందని చెబుతున్నారు. కాని వాస్తవానికి యుద్ధం వలన దేశం, ఆర్థికవ్యవస్థ నాశనం కావటంతో వారు చాలా దయనీయమైన పరిస్థితులలో ఉంటారు. వారి సైన్యం అంతా నాశనమైపోయింది. ఇప్పుడు ఏ మాత్రం శిక్షణ లేని వారిని సైన్యంలోకి తీసుకొంటున్నారు. రష్యా కూడా తీవ్రంగానే నష్టపోయింది. బలాబలాలను పరిగణనలోకి తీసుకొంటే ఈ విధమైన పరిస్థితులలో ఎవరు విజయం సాధిస్తారు అన్నదేమీ పెద్ద రహస్యం కాదు. ఉక్రెయిన్ నాశనం అవుతుంది. మేం యుద్ధం కొనసాగించి రష్యాను బలహీనపరిచాం. ఏదైనా అద్భుతం జరిగితే ఉక్రెయిన్ బలంగా తయారవుతుంది అనేది అమెరికా వైఖరిగా ఉంది.

బ్రిటన్ అమెరికాను అనుసరిస్తున్నది. కాని యూరప్ సంగతేమిటి? ప్రధాన దేశాలన్నీ ఇప్పటివరకు అమెరికాతోనే ఉన్నాయి. ఆ దేశాలలోని ప్రజలు అంత స్పష్టంగా లేరు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్యవర్గాలు తీవ్రమైన ఆందోళనతో ఉన్నాయి. పుతిన్ నేరపూరిత దురాక్రమణ ఆయన మూర్ఖత్వాన్ని కూడా వెల్లడిస్తున్నది. రష్యా, యూరప్ దేశాలు సహజమైన వాణిజ్యమిత్రులు. రష్యాకు వనరులు, ఖనిజాలు ఉండగా, యూరప్‌కు సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు ఉన్నాయి. దీనిని కొనసాగించటానికి బదులుగా పుతిన్ అమెరికా కోరిన దానిని వెండిపళ్ళెంలో పెట్టి అందించటానికి పూనుకున్నాడు. మీరు అమెరికా ఉపగ్రహాలుగా మారతారు. అంటే మీరు పారిశ్రామిక రహితవౌతారని చెబుతున్నాడు.

నాటో మద్దతున్న, అమెరికా ఆధ్వర్యంలో జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి యూరప్ మద్దతివ్వటం కొనసాగితే అది పారిశ్రామిక రహితం కావటానికి దారితీస్తుందని ది ఎకనామిస్ట్ మేగజైన్ హెచ్చరించింది. ఇది ఉక్రెయిన్ భూభాగం కోసం రష్యా–అమెరికాల మధ్య జరుగుతున్న యుద్ధమని ప్రపంచం భావిస్తున్నది. వాస్తవానికి ఈ యుద్ధం అంతకన్నా ఎక్కువ సమస్యలపై జరుగుతున్నది. అమెరికా కోరికపై నాటో ప్రస్తుతం ఇండో–పసిఫిక్ ప్రాంతానికి విస్తరించింది. చైనాతో అమెరికా అనుసరిస్తున్న ఘర్షణాత్మక విధానంలో అమెరికా తయారీ ఆయుధాలతో ఉన్న దేశాలను, యూరప్‌ను తన వైపు నిలబెట్టుకొని, చైనాను దిగ్బంధం చేయటానికి ప్రయత్నిస్తున్నది.

చైనా అభివృద్ధిని నిరోధించటం కోసం ఒకతరం పాటు వాణిజ్యయుద్ధం జరపాలని బైడెన్ ప్రభుత్వం పిలుపునిచ్చింది. వారితో మనం పోటి పడలేం. కాబట్టి వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందకుండా నిరోధించాలి. ప్రపంచంలోని ప్రతి అంశం–సాంకేతిక పరిజ్ఞానం, పేటెంట్లు, ఇతరంగా అన్నిటిలోనూ ఏదో మేరకు అమెరికన్ ఉత్పత్తులు ఉంటున్నాయి. చైనాతో వాణిజ్యంలో వీటిని ఏ దేశం వినియోగించరాదని అమెరికా

ఆంక్షలు పెడుతున్నది. ప్రపంచంలోనే అత్యున్నతమైన లితోగ్రాఫిక్ పరిశ్రమలు ఉండి, సెమి కండక్టర్లలో వినియోగించే చిప్స్‌ను తయారు చేస్తున్న నెదర్లాండ్‌పై దీని ప్రభావం ఏ విధంగా ఉంటుందో ఆలోచించండి. చైనా దానికి ప్రధాన మార్కెట్‌గా ఉన్నది. వాషింగ్టన్ ఆదేశాలతో చైనాతో వాణిజ్యాన్ని ఆపితే అక్కడి పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటాయి. దానికి ఆ దేశం అంగీకరిస్తుందా? దక్షిణ కొరియాకు కూడా అదే సమస్య ఎదురౌతుంది. మీరు చేస్తున్న ఉత్పత్తులలో మా పేటెంట్ ఉన్న సరుకులు కొన్ని ఉన్నాయి. కాబట్టి మీ ప్రధాన మార్కెట్ చైనాకు వాటిని సరఫరా చేయవద్దని ఆ దేశపు ప్రధాన కంపెని శాంసంగ్‌కు అమెరికా చెబుతున్నది. జపాన్‌కు కూడా ఇదే విధంగా చెబుతున్నది.

వారేవిధంగా స్పందిస్తారనేది తెలియదు. అమెరికా ప్రపంచాధిపత్యాన్ని సాధించటం కోసం తాము పారిశ్రామిక రహితం కావటానికి వారు అంగీకరిస్తారా? ఈ ఆంక్షలను అమలు జరపబోమని వర్ధమాన దేశాలు–ఇండియా, ఇండోనేషియా, లాటిన్ అమెరికా– ఇంతకు ముందే ప్రకటించాయి. ప్రపంచ రంగస్థలంలో ఇదొక ప్రధానాంశంగా ముందుకొస్తున్నది.

బర్సామియాన్: **ఉక్రెయిన్‌లో ఉన్న అణు రియాక్టర్లతో ఎదురవనున్న ప్రమాదాన్ని గురించి అంతర్జాతీయ అణుశక్తి సంస్థ డైరెక్టర్ రాఫెల్ గ్రాసి హెచ్చరించాడు. వాటి సమీపంలో యుద్ధం జరగటం, పేలుడు పదార్థాలను వినియోగించటం అణు ప్రమాదానికి దారి తీస్తుందని చెప్పాడు. అమెరికా ఈ మధ్య కాలంలో అణ్వాయుధాలను ఆధునీకరిస్తున్నది. ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నవారు వారి జీవితాలను అదుపు చేస్తున్నారనే దానికి ఇదొక ఉదాహరణ అనుకోవచ్చా?**

**చోమ్‌స్కీ:** పెరుగుతున్న అణుయుద్ధ ప్రమాదం గురించి మనం అర్థం చేసుకొనేలా చేయటం కోసం డాన్ ఎల్లెస్‌బర్గ్, మరికొందరు సంవత్సరాల తరబడి ప్రయత్నిస్తున్నారు. వాషింగ్టన్‌లోని వారు మాత్రం ఇదొక జోక్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. చైనాతో చిన్న యుద్ధం జరగాలని వారు భావిస్తున్నారు. రెండు సంవత్సరాలలో చైనాతో యుద్ధం వస్తుందని అమెరికా వైమానికదళ జనరల్ మైక్ మినిహాన్ చెబుతున్నాడు. ఇంతకన్నా వెర్రితనం లేదు. అణుశక్తి ఉన్న దేశాల మధ్య యుద్ధం జరగరాదు.

రెండు అణ్వాయుధ దేశాలైన చైనా, రష్యాలతో అణుయుద్ధం జరపటానికి ట్రంప్

> **❝ మైఖేల్‌ను ఇండియాకు రప్పించడానికి ప్రతిగా యుఏఈ ప్రభుత్వానికి ముఖ్యమైన ఖైదీని అప్పగించారని ఐక్యరాజ్య సమితి వర్కింగ్ గ్రూప్ ఆరోపించింది. యుఏఈ ప్రధాని కూతురు, రాకుమార్తె లతీఫా 2018లో తన తండ్రి నుండి తప్పించుకునే ప్రయత్నంలో ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లచే అరెస్టు చేయబడి నిర్బంధంలో ఉంచబడ్డారు. లతీఫాను ఆమె తండ్రికి అప్పగించి అందుకు ప్రతిగా 2018 డిసెంబరు 4న మైఖేల్‌ను భారత్‌కు రప్పించినట్లుగా సమాచారం. ❞**

ఆధ్వర్యంలో ప్రారంభమైన వ్యూహాత్మక ప్రణాళికను బైడెన్ మరింత విస్తరిస్తున్నాడు. ఉక్రెయిన్ అణు రియాక్టర్లు ముఖ్యమైన సమస్య. కానీ ఇది అంతకన్నా తీవ్రమైనది. ఇప్పుడు ఉక్రెయిన్‌కు అమెరికా ట్యాంకులు, ఇతర ఆయుధాలు పంపిస్తున్నది. పోలాండ్ జెట్ యుద్ధ విమానాలను పంపుతున్నది. ఇప్పుడో లేక మరి కొద్దికాలం తర్వాతో రష్యా వీటి సరఫరా మార్గాలపై దాడిచేస్తుంది. సరఫరా మార్గాలతో పాటు పశ్చిమ ఉక్రెయిన్‌పై రష్యా దాడిచేస్తే అది నాటోతో ప్రత్యక్షయుద్ధానికి దారితీయవచ్చు. ఉక్రెయిన్ తీవ్రంగా దెబ్బతింది. వాషింగ్టన్ నుండి ముఖ్యమైన వారు కీవ్‌కు వచ్చి వెళుతున్నారు. ఇరాక్‌ను అమెరికా ధ్వంసం చేస్తున్నప్పుడు ఇరాక్ రాజధాని బాగ్దాద్‌కు ఎవరైనా వచ్చినట్లు మీకు గుర్తుందా? నాకు గుర్తున్నంతవరకు ఎవరూ రాలేదు. ఇరాక్‌ను నాశనం చేస్తున్నపుడు శాంతికోసం పనిచేస్తున్న కొద్దిమంది వలంటీర్లను ఆ దేశం విడిచివెళ్ళాలని ఆదేశించారు.

ఈ యుద్ధం ఇప్పటికే తీవ్రమవుతున్నది. అది ఎంతవరకు పోతుంది? నల్ల సముద్రంలో ఉన్న రష్యా యుద్ధనౌకలను ముంచివేద్దామనే యుద్ధోన్మాదులు ఉన్నారు. వాస్తవానికి ప్యూ పోల్ ఫలితాలను మనం చూసినట్లైతే ప్రజలు అణుయుద్ధాన్ని కనీసం జాబితాలో కూడా చేర్చలేదు. ఉన్మాదంతో మాత్రమే దానిని గురించి ప్రస్తావిస్తున్నారు.

బర్సామియాన్: **భూగోళానికి ఎదురవుతున్న ప్రమాదాలను పరిశీలించినపుడు వ్యూహాత్మక అణ్వాయుధాలను అభివృద్ధి చేసే అంశంపై అమెరికా–రష్యాల మీద స్టార్ట్ ఒప్పందం కొన్ని పరిమితులను విధించింది. ఆ ఒప్పందం నుండి రష్యా తాత్కాలికంగా బయటికొచ్చింది. దీనివలన ఎదురయే ప్రమాదాలేమిటి?**

**చోమ్‌స్కీ:** దీనిపై రష్యాను తీవ్రంగా విమర్శించారు. ఆ విమర్శ సరైనదే. ప్రతికూల చర్యలను విమర్శించాల్సిందే. కాని దానికి దారితీసిన అంశాలను గురించి మనం మాట్లాడటం లేదు. 60 సంవత్సరాల కఠోరశ్రమ ద్వారా ఆయుధాలకు పరిమితి విధించే యంత్రాంగాన్ని రూపొందించారు. అమెరికా, యూరప్‌లలో జరిగిన భారీ ప్రజా ప్రదర్శనలు, రష్యా నాయకుడు మిహాయిల్ గోర్బచేవ్ ప్రతిపాదించిన ఇంటర్మీడియేట్ షార్ట్‌రేంజ్ మిస్సైల్ ట్రీటీని రొనాల్డ్ రీగన్ అంగీకరించాల్సివచ్చింది. 1987లో జరిగిన ముఖ్యమైన సంఘటన ఇది. స్వేచ్ఛా ఆకాశం ఒప్పందం (ఓపెన్ స్కై ట్రీటి) గురించి ఐసెన్‌హోవర్ ప్రతిపాదించాడు. జాన్ ఎఫ్ కెన్నెడి కొన్ని చర్యలు తీసుకున్నాడు. జార్జి డబ్ల్యు బుష్ అధ్యక్షుడు అయేవరకు దశలవారీగా అభివృద్ధి మార్గంలో సాగింది.

60 సంవత్సరాలుగా అమలులో ఉన్న ఆయుధ పరిమితి ఒప్పందాలను అప్పటి నుండి రిపబ్లికన్ పార్టీ క్రమపద్ధతిలో నీరుగార్చుతున్నది. యాంటి బాలిస్టిక్ మిస్సైల్స్ ఒప్పందాన్ని బుష్ రద్దుచేశాడు. ఇది కీలకమైన ఒప్పందం. ఇవి మొదట దాడి చేయటానికి ఉపయోగించే ఆయుధాలు. యాంటి బాలిస్టిక్ మిసైల్స్‌ను రష్యా సరిహద్దులలో ఏర్పాటు చేస్తున్నారు కాబట్టి రష్యాకు ఇది ఎక్కువ ప్రమాదం కలిగిస్తుంది. కొత్త స్టార్ట్ ఒప్పందం తర్వాత ట్రంప్ తన విధ్వంసక విధానాలతో రీగన్ –గోర్బచేవ్ ఐఎన్ఎఫ్ ఒప్పందాన్ని, తర్వాత స్వేచ్ఛా ఆకాశ ఒప్పందాలను రద్దుచేశాడు. కాని దానిని విస్తరించాలన్న రష్యా ప్రతిపాదనను బైడెన్ సరైన సమయంలో ఆమోదించాడు. ఇపుడు రష్యన్‌లు దానిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇదంతా విధ్వంసానికి దారితీస్తుంది. అమెరికాలోని రిపబ్లికన్ పార్టీ దీనిలో ప్రధానమైన నేరస్తునిగా ఉన్నది. పుతిన్ చర్యలను ఖండించాల్సిందే. కాని అవి ఇతర అంశాలతో సంబంధం లేకుండా తీసుకున్న

**" రాజకీయ ప్రతినిధులపై ఉన్న కేసుల విచారణలో జాప్యం జరుగుతున్న అంశానికి సంబంధించి 2021 ఆగస్టులో ఈడి సుప్రీంకోర్టుకు ఒక జాబితాను సమర్పించింది. అది 122 మంది ఎన్నికైన ప్రజాప్రతినిధుల జాబితా. సమాచార హక్కు చట్టం క్రింద ఈ సమాచారాన్ని అడిగినపుడు ఇవ్వడానికి ఈడి నిరాకరించింది. టైమ్స్ ఆఫ్ ఇండియా ఎలాగో ఈ రిపోర్టు నుండి 52 మంది పేర్లను రాబట్టి ప్రచురించగలిగింది. వీరంతా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారే. "**

చర్యలు కావు.

బర్సామియాన్: **రానున్న ప్రమాదంపై అమెరికా ఇంటెలిజెన్స్ వార్షిక అంచనాలను ఈ మధ్యనే విడుదల చేసింది. "ప్రపంచంలోని ప్రతి ప్రాంతం, ప్రతిరంగంలోనూ నిబంధనలకు అనుగుణంగా నడిచేలా ప్రపంచవ్యవస్థను మార్చటానికి ప్రయత్నం చేయగలిగిన శక్తిసామర్థ్యాలు చైనాకు ఉన్నాయని, అమెరికాకు ప్రధానపోటీదారుగా చైనా ఉన్నదని, ప్రపంచంలో అమలులో ఉన్న నిబంధనలను మార్చటానికి ప్రయత్నం చేస్తున్నదని" నివేదికలో పేర్కొన్నారు. "నిబంధనలపై ఆధారపడిన ప్రపంచవ్యవస్థ" అన్నదానికి కాలం చెల్లిందా?**

**చోమ్‌స్కీ:** అది చాలా ఆసక్తికరమైన వాక్యం. మీరుగాని అణిగివుండే మేధావి లేదా పండితులు గాని అయివుంటే అమెరికాలో నిబంధనలపై ఆధారపడిన వ్యవస్థ ఉన్నట్లుగా వ్యవహరించవచ్చు. కానీ ఈ నిబంధనలను ఎవరు రూపొందించారు? దానికి స్పష్టమైన సమాధానం ఉన్నది కాబట్టి ఆ ప్రశ్నను మనం అడగరాదు. వాషింగ్టన్‌లో ఉన్న గాడ్‌ఫాదర్ ఈ నిబంధనలను రూపొందించాడు. చైనా దీనిని బహిరంగంగా సవాలు చేస్తున్నది. ఐక్యరాజ్యసమితిపై ఆధారపడిన ప్రపంచవ్యవస్థ కావాలని అనేక సంవత్సరాల నుండి చైనా డిమాండ్ చేస్తున్నది. వర్ధమాన దేశాలు, ప్రపంచంలోని అత్యధిక భాగం చైనా డిమాండ్‌ను బలపరుస్తున్నాయి. అంతర్జాతీయ వ్యవహారాలలో బెదిరించటం, బలప్రయోగం చేయటాన్ని నిరోధించటం అమెరికా విదేశాంగ విధానానికి ఆటంకంగా ఉంటాయి. కాబట్టి తాను నిబంధనలు రూపొందించకుండా ఉండటానికి అమెరికా అంగీకరించదు. బెదిరించని, బలప్రయోగం చేయని అమెరికా అధ్యక్షుడు ఉన్నాడని మీరు భావిస్తున్నారా? ఇరాక్‌పై దాడిచేయటం లాంటి సామూహిక నేరపూరిత చర్యలు మాత్రమే కాదు. మేం చెప్పినట్లు మీరు చేయకపోతే అన్ని విధాలైన చర్యలు తీసుకోవటానికి అవకాశాలు ఉంటాయని ఒబామా ఇరాన్‌ను బెదిరించటం బలప్రయోగం చేయటమే. అంతర్జాతీయ వ్యవస్థను నడపటానికి ఉద్దేశించిన ఐక్యరాజ్యసమితి నిబంధనలను ప్రతి అమెరికన్ అధ్యక్షుడూ ఉల్లంఘించాడు.

మీరు ప్రస్తావించిన చిన్న ఫుట్‌నోట్ కూడా ఇక్కడ ఉంది. వారు అమెరికా రాజ్యాంగాన్ని కూడా ఉల్లంఘించారు. అమెరికా చేసుకున్న ఒప్పందాలు అత్యున్నతమైనవని, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వాటిని అమలు చేయాల్సిందేనని రాజ్యాంగంలోని ఆర్టికల్ ఆరులో పేర్కొన్నారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత జరిగిన ఒప్పందాలలో ఐక్యరాజ్య సమితి చార్టర్ ముఖ్యమైనది. ఇతర దేశాలను బెదిరించటాన్ని, బలప్రయోగం చేయటాన్ని అది నిషేధించింది. మరోవిధంగా చెప్పుకోవాలంటే మనకు దైవం ప్రసాదించినదిగా భావించి పూజిస్తున్న రాజ్యాంగాన్ని ప్రతి అమెరికా అధ్యక్షుడూ ఉల్లంఘించాడు.

కాబట్టి చైనా ప్రధాన పోటీదారుగా అవతరిస్తున్నదా? దానికి చుట్టుపట్ల ఉన్న ప్రాంతాలలో అమెరికాకు ప్రధాన పోటీదారుగానే ఉన్నది. పెంటగాన్ ముందుకు తెస్తున్న యుద్ధాలను చూడండి. తైవాన్ విషయంలో గనుక యుద్ధం జరిగినట్లైతే చైనాయే విజయం సాధించవచ్చు. ఏ యుద్ధమైనా కొద్దికాలంలోనే సర్వ విధ్వంసకంగా మారుతున్న పరిస్థితులలో ఈ భావన హాస్యాస్పదంగా ఉంటుంది. కాని వారు ఈ ఆటను ఆడుతూనే ఉంటారు. కాబట్టి ప్రధాన పోటీదారుగా ఉన్న చైనా చట్టబద్ధంగా వ్యవహరిస్తుందా? అలా వ్యవహరించక పోవచ్చు. దక్షిణచైనా సముద్రంలో అది బలపడుతున్నది. అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి ప్రత్యేక తీర్పులను ఉల్లంఘిస్తూ విస్తరిస్తున్నది.

చైనా నుండి వస్తున్నాయని చెబుతున్న ప్రమాదాలలో ప్రధానమైనవి సౌది అరేబియా, ఇరాన్‌ల మధ్య సయోధ్య కుదర్చటానికి చొరవ చేయటం. మధ్యప్రాచ్యంపై అదుపు సాధించటం కోసం 80 సంవత్సరాల నుండి అమెరికా అనుసరిస్తున్న విధానాలకు ఇది తీవ్ర సవాలుగా పరిణమిస్తుంది. అది ప్రపంచంలోనే అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతం అని ప్రభుత్వం చెబుతున్నది. రాజకీయ పరిష్కారం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించటానికి చైనా ప్రయత్నం చేస్తున్నది. దాని వలన ఎమెన్‌లో యుద్ధం ఆగిపోవచ్చు. అమెరికా ప్రధాన నేస్తమైన సౌది అరేబియా, దాని పెద్ద శత్రువు అయిన ఇరాన్‌లను చైనా ఒకచోటికి తీసుకువస్తున్నది. అమెరికా దీనిని సహించలేకపోతున్నది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇది నిజంగా పెద్దదెబ్బ.

బర్సామియాన్: **'అంగీకారాన్ని తయారుచేయటం' (మాన్యుఫాక్చరింగ్ ది కన్‌సెంట్) మీరు రాసిన ప్రముఖ గ్రంథం. దానిని మీరు ఈ రోజు పునర్వీకరిస్తే సోవియట్ యూనియన్ స్థానంలో చైనా లేక రష్యాను చేరుస్తారా? సోషల్‌మీడియా పెరుగుదలను విశ్లేషిస్తారా? అదనంగా ఇతర అంశాలను చేర్చటానికి అవకాశం ఉందా?**

**చోమ్‌స్కీ:** అవి ప్రధానమైన అంశాలు. సోషల్‌మీడియా అన్నది చిన్న విషయం కాదు. అమెరికా సమాజంపై అది చూపిస్తున్న ప్రభావం సంక్లిష్టంగా ఉన్నది. ఇరాక్‌పై అమెరికా దాడి విషయానికి వెళ్ళండి. అధిక సంఖ్యాక ప్రజానీకం 9/11 ఘటనకు సద్దాం హుస్సేన్ కారణమని నమ్మారు. అది నమ్మశక్యం కానిదైనప్పటికీ దానిని నమ్మటానికి అవసరమైనంత ప్రచారం జరిగింది. సోషల్‌మీడియా అన్ని అంశాలను మరింతగా దిగజారుస్తున్నది. యువతపై –జనరేషన్ జడ్ అని చెబుతున్నవారిపై–ఈ మధ్యకాలంలో జరిగిన అధ్యయనంలో వారికి సమాచారం ఎక్కడి నుండి వస్తున్నదని పరిశీలించినపుడు వారెవ్వరూ వార్తా పత్రికలు చదవటం లేదని స్పష్టమైంది. దాదాపు ఎవరూ టెలివిజన్ చూడటం లేదు. కొద్దిమంది మాత్రమే ఫేస్‌బుక్ చూస్తున్నారు. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రాంల ద్వారా వారు వార్తలు, సమాచారం తెలుసుకుంటున్నారు. టిక్‌టాక్ ద్వారా హాస్యపూరితమైన

(మిగతా 34వ పేజీలో)

# కమ్యూనిస్టు దార్శనికుడు కామ్రేడ్ రజనీ పామీదత్



రచయిత డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

**వై. రాము**

**1920**-30 దశకంలో భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ అందించిన సహాయ-సహ కారాలు ప్రత్యేకమైనవి. పార్టీ ప్రారంభ దినాల్లోనే నిర్బంధం చుట్టుముట్టిన కాలంలో పార్టీ విస్తరణకు సముచిత దిశా నిర్దేశం కోసం గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ తన క్యాడర్‌ని ఆర్గనైజర్లుగా పంపింది. అలా ఈ దేశం వచ్చి ఇక్కడి కామ్రేడ్స్ మన్ననలు పొందిన వ్యక్తి రజనీ పామీదత్. ఈయనతో పాటు బెన్ బ్రాడ్లీ, ఫిలిప్స్ స్ప్రాట్, లెస్టర్ హచిన్ సన్‌లు కూడా వచ్చారు. తరువాత వీరి పై మీరట్ కుట్ర కేసు బనాయించింది బ్రిటిష్ ప్రభుత్వం.

రజనీ పామీదత్ ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లోని మిల్‌రోడ్‌లో 1896 జూన్ 19న జన్మించారు. తండ్రి డా॥ ఉపేంద్ర దత్ భారతీయ సర్జన్, తల్లి అన్నా పాల్మే స్వీడన్ జాతీయురాలు. దత్ ఆక్స్‌ఫర్డ్‌లోని పెర్స్ స్కూల్, కేంబ్రిడ్జ్, బల్లిమోల్ కాలేజీలో చదువుకున్నాడు. 1922 లో సాల్మే యురిక్ ఎస్టోనియన్‌ను వివాహం చేసుకున్నాడు.

### దత్ రచనలు

1921లో దత్ లేబర్ మంత్లీ మాసపత్రికను స్థాపించారు. 1922లో వర్కర్స్ వీక్లీకి సంపాదకునిగా పని చేశారు. దత్ అనేక రచనలు చేశారు. అందులో ఆయన రాసిన "ఫాసిజం అండ్ సోషల్ రివల్యూషన్" ఇటలీ, జర్మనీ ఇంకా ఇతర దేశాల్లో తలెత్తిన ఫాసిజాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడింది. 1923లో 'గాంధీ ముగింపు', 'బ్రిటిష్ సామ్రాజ్యవాదం', 'ది ఇష్యూ ఇన్ యూరప్', 1935లో 'ది క్వశ్చన్ ఆఫ్ ఫాసిజం అండ్ క్యాపిటలిస్ట్ డికే', 'బ్రిటిష్ పాలసి, నాజీ జర్మనీ', 'బ్రిటిష్ - జర్మన్ అలయెన్స్', 1936 సం॥లో 'భారతదేశంలో వామపక్ష జాతీయవాదం', 1938లో రాసిన 'ది ఫిలాసఫీ ఆఫ్ ఎ నేచురల్ సైంటిస్ట్', 'ఏ రీజాయిండర్ టు లెవీ' వంటి అనేక రచనలు చేశారు. ముఖ్యంగా భారతదేశ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా 1935 లో రాసిన దత్ -బ్రాడ్లీ థీసిస్ 1940లో రాసిన "ఇండియా టుడే" ప్రసిద్ధమైనవి.

### దత్ - బ్రాడ్లీ థీసిస్ ప్రాముఖ్యత

భారతదేశంలో నెలకొన్న పరిస్థితుల



(జూన్ 19న పామీదత్ జయంతి)

ఆధారంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను, వివిధ దశల్లో చేపట్టాల్సిన వ్యూహాన్ని ఈ థీసిస్‌లో వివరించారు. తన సహచరుడు బెన్ బ్రాడ్లీతో కలసి రూపొందించిన ఈ డాక్యుమెంట్ మార్గదర్శిగా నిలిచింది. ఇండియాలో "సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన" ను నిర్మించటం ద్వారా అశేష ప్రజానీకాన్ని సమీకరించి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబెట్ట గలమని ఈ థీసీస్ ఉద్ఘాటించింది. ఈ సూత్రీకరణ భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది. కమ్యూనిస్టు పార్టీ ఎత్తుగడలలో గణనీయమైన మార్పులను తీసుకొచ్చింది.

దీని నేపథ్యాన్ని పరిశీలిస్తే 1920లో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుండి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్‌ని ఒత్తిడి చేస్తూనే ఉంది. లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభ వరకూ జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం గాక డొమినియన్ హెూదాను సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. లాహెూర్ కాంగ్రెస్‌లో కమ్యూనిస్టులు ప్రతిపాదించిన సంపూర్ణ స్వాతంత్ర్యం అనంతరం తన గమ్యాన్ని మార్చుకుంది. బూర్జువా వర్గం నాయకత్వాన జరుగుతున్న జాతీయోద్యమంలో భాగం కాకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని ఆనాటి కమ్యూనిస్టులు భావించారు. ఈ పరిస్థితులలో జాతీయ విముక్తి పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తదితర జాతీయ శక్తులతో కలిసి పనిచేసినప్పుడే శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించగలమని, అ విధంగా మాత్రమే దేశ స్వాతంత్ర్యాన్ని సాధించగలమని దత్-బ్రాడ్లీ డాక్యుమెంట్ తేల్చి చెప్పింది. ఈ సూత్రీకరణ ఆధారంగా తన సొంత అనుభవాల నుండి పార్టీ కేంద్ర కమిటీ సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన నిర్మించేందుకు పటిష్టమైన ఎత్తుగడలు రూపొందించి పని చేసింది.

పార్టీ ఈ ఎత్తుగడల పంథాను అనుసరించిన ఫలితంగా అనేక రాష్ట్రాల్లో జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల్లోని ప్రభావితం చేయగల నాయకులు ఆకర్షితులైనారు. వారే తరువాతి కాలంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులుగా తయారయ్యారు. ప్రజలతో సంబంధాలు పెంచుకుంటూ 1936-1939 కాలం నాటికి పార్టీ, ప్రజాసంఘాల కార్యకలాపాలను

**“ దత్ - బ్రాడ్లీ థీసీస్ భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది. కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగడానికి, పార్టీ విస్తరణకు దోహద పడింది. ఆ కాలంలో వచ్చిన కార్యకర్తలు, నాయకులే తరువాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి, అభివృద్ధి చేయడానికి కృషి చేశారు. ”**

విసర్జింపచేసింది. దేశవ్యాప్తంగా అనేక కార్మిక సంఘాలను నెలకొల్పి సమ్మెలు, పోరాటాలను నిర్వహించింది. 1936లో కాంగ్రెస్‌లో అతివాదులను కలుపుకుని “అఖిల భారత కిసాన్ సభ”, విద్యార్థులతో “అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్” లను ఏర్పరిచింది. పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ అ కాలంలో విస్తృతంగా కార్యకలాపాలను నిర్వహించింది.

దత్ – బ్రాడ్లీ థీసీస్ భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది. కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగడానికి, పార్టీ విస్తరణకు దోహదపడింది. ఆ కాలంలో వచ్చిన కార్యకర్తలు, నాయకులే తరువాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి, అభివృద్ధి చేయడానికి కృషి చేశారు.

**“నేటి భారతం” రచన ప్రాముఖ్యత**

దత్ రాసిన “ఇండియా టుడే” 1940లో ప్రచురించబడింది. ఈ పుస్తకాన్ని ఆయన తండ్రి ఉపేంద్ర కృష్ణదత్‌కు అంకితమిచ్చారు. ఈ గ్రంథం భారతదేశ పరిస్థితులను సంపూర్ణంగా విశ్లేషించింది. బ్రిటన్ పాలన వల్ల దేశంలో వచ్చిన మార్పులు, స్వాతంత్ర్య ఉద్యమ గమనాన్ని, కార్మికుల, కర్షకుల ఉద్యమాలను వివరించింది. ఇది ఒక మార్గదర్శక రచన మాత్రమే కాదు, బ్రిటిష్ పాలన ప్రారంభ రోజుల నుండి భారతదేశ స్థితిగతులను, ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషించింది ఈ పుస్తకం. “నేటి భారతం'' గ్రంథ ప్రచురణకు అనేక అవరోధాలను ఎదుర్కొంది. ప్రచురణ సంస్థ నుండి అభ్యంతరాలు రావడంతో దత్ రాసిన ప్రతిలో వందకి పైగా మార్పులను చేయాల్సి వచ్చింది. ముద్రణ అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం ఈ పుస్తకాన్ని నిషేధించింది. కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు రహస్యంగా ఈ పుస్తక ప్రతులను అధ్యయనం చేసేవారు. అనంతరం 1970లో తొలగించిన భాగాలను కూడా పొందుపరిచి నూతన ముందుమాటతో తిరిగి ప్రచురించారు.

1920 ఆగష్టులో స్థాపించిన బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుల్లో దత్ ఒకరు. చాలా కాలం పార్టీ ఉపాధ్యక్షులుగా పని చేశారు. 1922లో కేంద్ర కమిటి సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎన్నికై 1965 వరకూ అ బాధ్యతలను నిర్వహించారు. 1936 నుండి 1938 వరకు ''డైలీ వర్కర్'' పత్రికకు సంపాదకుడిగా పని చేశారు. 1945లోను, 1950లోను బ్రిటిష్ పార్లమెంట్‌కు కమ్యూనిస్టు పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయారు. దత్ గొప్ప రచయిత. ఆయన 16 గ్రంథాలను, వందలాది వ్యాసాలను, కరపత్రాలను రచించా డు. ఆయన మరణించడానికి 3 రోజులు ముందు కూడా “లేబర్ మంత్లీ కి వ్యాసాన్ని రాశాడు.

రజనీపామీ దత్ గురించి హరికిషన్ సూర్జిత్ ప్రస్తావించినట్లుగా “సామ్రాజ్యవాద స్వభావాన్ని, జాతీయ విముక్తి పోరాటం ప్రాధాన్యత, అలాగే సోషలిస్టు విప్లవాన్ని గురించి అవగాహన చేసుకొనదగిన విద్యార్థులందరికీ ఆయన రచనలు ఉపయోగపడతాయి. మార్క్సిజం అభివృద్ధి చెందే శాస్త్రంగా ఆయన అభివర్ణించారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను నిర్దిష్టంగా అన్వయించడానికి తన శక్తి కొలది ప్రయత్నించారు. భారతదేశ స్వాతంత్ర్యం విషయంలో ఆయన అత్యంత శ్రద్ద తీసుకున్నారు. 1946 లో ఆయన భారతదేశాన్ని సందర్శించినప్పుడు తనను భారతీయుడినని గర్వంగా చెప్పుకున్నారు.”

రజనీపామిదత్ మరణించి ఇప్పటికి 49 సంవత్సరాలు గడిచాయి. అయితే కమ్యూనిస్టు జాతీయ విముక్తి పోరాటాలకి ఆయన అందించిన అమోఘమైన రచనలు ఎప్పటికీ విస్మరించజాలనివి, మరువలేనివి. మానవజాతి మంచి భవిష్యత్ కోసం పోరాడే వారందరకీ పామీదత్ జరిపిన కృషి, నిర్వహించిన పాత్ర సదా ఉత్తేజం ఇవ్వగలవు. పార్టీ నిర్ణయాన్ని స్వీకరించి దేశాల సరిహద్దులు దాటి వచ్చి, ప్రాంతం కానీ ప్రాంతంలో విప్లవ ఉద్యమాన్ని నిర్మించడంలో రజనీ పామీ దత్ చేసిన కృషి నేటి కామ్రేడ్స్‌కి స్ఫూర్తిదాయకం. పార్టీ నిర్దేశించిన పనిని నిర్వహించటం కోసం సౌకర్యాలు, సౌఖ్యాలతో సంబంధం లేకుండా కార్యోన్ముఖులం కావడమే రజనీ పామీదత్ జీవితం నుండి నేర్చుకోవల్సిన పాఠం. జూన్ 19 న ఆయన జయంతి సందర్భంగా రజనీ పామీదత్‌ను స్మరించుకుందాం. ❋

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# మన్‌కీ బాత్ 'మహారాజు'కి మల్లయోధుల గోడు పట్టదా?



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

ఎ. కోటిరెడ్డి

ప్రధాని నరేంద్రమోడి మే 28వ తేదీన నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాడు. నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాల్సి ఉండగా, ఆమెను పక్కన పెట్టి మోడి తానే పార్లమెంటు భవనాన్ని ప్రారంభించాడు. రాష్ట్రపతిని ఆహ్వానించ కుండా పార్లమెంటు భవనాన్ని ప్రారంభించటాన్ని వ్యతిరేకిస్తూ 20 పైగా రాజకీయ పార్టీలు ప్రారంభ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. దేశాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నుండి ఫ్యూడల్ వ్యవస్థలోకి తీసుకెళ్ళటానికి, రాజులు, చక్రవర్తుల వలె నిరంకుశ పాలనను సాగించటానికి మోడి, ఆర్ఎస్ఎస్ చేస్తున్న సన్నాహాలు కూడా ఈ సందర్భంగా వెల్లడైనాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు భవనం ప్రారంభ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు, ప్రజాస్వామిక వ్యవస్థను బలపరిచే వ్యక్తులకు ప్రాధాన్యత లభించాల్సి వుండగా, వీటన్నింటినీ పక్కన పెట్టిన మోడి, ఆర్ఎస్ఎస్‌లు సన్యాసులు, స్వాములు, మఠాధిపతులకు ప్రాధాన్యత నిచ్చారు. స్వాములు, పీఠాధిపతులను ముందుపెట్టటం అంటే ఒక మతానికి చెందిన ఆచారాలు, సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్ళటం, లౌకిక, ప్రజాస్వామిక విధానాలను పక్కన పెట్టటం చేస్తున్నారు. లౌకిక విధానాలతో జరగాల్సిన కార్యక్రమాలను మతపరమైన కార్యక్రమాలతో ముడిపెడుతున్నారు.

మతాలకు సంబంధించి ప్రభుత్వం లౌకిక పద్ధతిలో వ్యవహరించాల్సి వుండగా, ప్రభుత్వ కార్యక్రమాలలో క్రమంగా ఒక మతానికి సంబంధించిన ఆచారాలను అమలుచేస్తున్నారు. పార్లమెంటు భవన ప్రారంభ కార్యక్రమంలో తంజావూరు నుండి తెప్పించిన రాజదండాన్ని ధరించటం, దానికి సాష్టాంగ దండప్రణామాలు చేయటం ప్రజాస్వామిక వ్యవస్థకు మోడి గోరి కడుతున్నాడని స్పష్టం చేస్తున్నాయి.

ఆర్ఎస్ఎస్ దేశంలో ప్రజాస్వామిక విధానానికి, లౌకిక విధానాలను అమలుచేయటానికి వ్యతిరేకమని స్పష్టంగా ప్రకటించింది. పాకిస్థాన్ ఏ విధంగా మతపరమైన దేశంగా ఉందో ఆ విధంగా భారతదేశం కూడా హిందుమతం అధికారమతంగా ఉండే దేశంగా ఉండాలని, మన రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలుచేయాలని డిమాండ్ చేసింది. ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటికీ దానిని ఆర్ఎస్ఎస్ నిరంతరం తూలనాడుతున్నది. ఇపుడు రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, ఆ స్థానంలో మనుస్మృతిని అమలు జరపటానికి అవసరమైన సన్నాహాలను చేస్తున్నది.

చిన్న విషయాలలో సామాన్య ప్రజలను అనేక విధాలుగా హింసిస్తున్న ప్రభుత్వం పాలకపార్టీ పెద్దలు తప్పుచేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. వారికి శిక్షల నుండి మినహాయింపు ఇస్తున్నది. ఎంత పెద్దతప్పు చేసినప్పటికీ వారిపై కనీసం కేసులు కూడా నమోదు చేయటం లేదు.

2020లో ఢిల్లీలో బిజెపి నాయకులు మతోద్రిక్తలను పెంచే విధంగా ప్రసంగాలు చేసినప్పటికీ వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ సందర్భంగా జరిగిన మాణకాండలో వందల మంది మరణించారు. వేలాదిమంది ప్రజలు అనేక ఇక్కట్లకు గురి అయ్యారు. ఆర్ ఎస్ ఎస్, బిజెపిలకు చెందిన నాయకులు మతోద్రిక్తలను పెంచే విధంగా మాట్లాడటం, అవి ఉద్రిక్తతలకు దారితీయటం, ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ఉండటం అనేక సందర్భాలలో జరుగుతున్నది. వీటిని వ్యతిరేకిస్తున్న లౌకిక, ప్రజాస్వామిక వాదులను ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇప్పటి వరకు ఇటువంటివి అనధికారికంగా జరిగాయి. ఇపుడిక ఇటువంటి వాటిని అధికారికంగా చేయబోతున్నారని ప్రభుత్వం పార్లమెంటు భవన ప్రారంభ కార్యక్రమంలో వ్యవహరించిన తీరు స్పష్టం చేస్తున్నది. హిందుమత కార్యక్రమాలను తీవ్రం చేస్తూ మైనారిటీలపై వివక్షను మరింత పెంచుతారని, అనధికారికంగా రాజ్యాంగాన్ని పక్కన పెట్టే విధానాల స్థానంలో అధికారికంగానే ఆ పనిచేయటానికి సన్నద్ధమౌతున్నారని పరిణామలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలుజరపటానికి ఆర్ఎస్ఎస్–బిజెపిలు ఉవ్విళ్ళూరుతున్నాయి.

దేశంలో మెజారిటీ ప్రజలు హిందువులు కాబట్టి మతం పేరుతో తామేం చేసినా ప్రజలు తమవెంటే ఉంటారని ఆర్ఎస్ఎస్, బిజెపిలు కలలు కంటున్నాయి. అందువలన మనుస్మృతిని అమలులోకి తెచ్చినా పెద్దగా ప్రతిఘటన ఉండదని భావిస్తున్నారు. దానికోసం క్రమపద్ధతిలో సన్నాహాలు చేస్తున్నారు. అయితే ప్రజలు మతం పేరుతో ఆర్ఎస్ఎస్–బిజెపిలు అమలుచేసే తిరోగమన విధానాలను సహించటానికి సిద్ధంగా లేరని అనేక సంధర్భాలలో స్పష్టం చేశారు. ఇపుడు రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, మనుస్మృతిని రుద్దుతామంటే దేశ ప్రజానీకం సహించే పరిస్థితి ఉండదు.

### మోడి మన్ కి బాత్ బూటకమేనా రెజ్లర్ల గోడు పట్టదా

ప్రధాని నరేంద్రమోడి అధికారానికి వచ్చినప్పటి నుండి మనసులో మాట పేరుతో ప్రతినెలా రేడియోలో ప్రసంగించటం చూస్తున్నాం. మనసులో మాట పేరుతో జరిపే ఈ కార్యక్రమాన్ని ప్రజలను దారి తప్పించటానికి ప్రధాని వినియోగించు కుంటున్నాడు. ఆయన ఈ కార్యక్రమం 100 ఎపిసోడ్‌లు పూర్తిచేశాడు. అయితే ఏ ఒక్క ఎపిసోడ్‌లో కూడా ఆయన నిజమైన ప్రజల సమస్యలను ప్రస్తావించలేదు. ఎక్కడో మారుమూలన ఉన్న చిన్న అంశాలను ప్రస్తావించటం, తానేదో ప్రజల సమస్యలను పరిష్కరించటం చేసినట్లు

> **"ఇపుడు బిజెపి ఎం పి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడని, అతనిపై చర్చతీసుకోవాలని ఆందోళన చేస్తుంటే దానిని మాత్రం పట్టించుకోవటం లేదు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొని, దేశప్రతిష్ఠను నిలబెట్టి దేశానికి అనేక పతకాలు సాధించిన రెజ్లర్లు తమకు న్యాయం కావాలని ఆందోళన చేస్తున్నారు. రెజ్లర్ల ఆందోళన సందర్భంలో వారి ఆరోపణలలోని వాస్తవాలను తెలుసుకొనేందుకు ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీని ఏర్పాటు చేసిన తీరులోనే ప్రభుత్వం వాగ్దానభంగానికి పాల్పడింది."**

ఫోజు పెట్టటం చూస్తున్నాం. ఈ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలను చూస్తే మనసులోని మాట బూటకత్వం ఏమిటో వెల్లడైతుంది. ఈ కాలంలో ప్రభుత్వం చేసిన రైతాంగ వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా దేశంలోని రైతులందరూ కదిలారు. లక్షలమంది డిల్లీ సరిహద్దులకు చేరుకొని సంవత్సరానికి పైగా పోరాటం చేశారు. వాటర్ ఫిరంగులు, బారికేడ్లు, లాఠీఛార్జిలకు ఎదురొడ్డి నిలిచారు. ఇన్నింటిని ఎదుర్కొని, ప్రపంచవ్యాపితంగా ప్రశంసలు పొందిన, అనేక ఉద్యమాలకు ప్రేరణ నిచ్చిన రైతాంగ పోరాటం ఏనాడూ మోడి మన్‌కి బాత్‌లో స్థానం సంపాదించుకోలేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 800 వందల రోజులకు పైగా పోరాటం జరుగుతుంటే దానికీ స్థానం దొరకలేదు. దేశంలోని రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు, దళితులు, గిరిజనులు తదితర పీడిత ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆయన మన్ కి బాత్‌లో చోటే దొరకదు.

ఇపుడు బిజెపి ఎం పి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడని, అతనిపై చర్చతీసుకోవాలని ఆందోళన చేస్తుంటే దానిని మాత్రం పట్టించుకోవటం లేదు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొని, దేశప్రతిష్ఠను నిలబెట్టి దేశానికి అనేక పతకాలు సాధించిన రెజ్లర్లు తమకు న్యాయం కావాలని ఆందోళన చేస్తున్నారు. రెజ్లర్ల ఆందోళన సందర్భంలో వారి ఆరోపణలలోని వాస్తవాలను తెలుసుకొనేందుకు ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీని ఏర్పాటు చేసిన తీరులోనే ప్రభుత్వం వాగ్దానభంగానికి పాల్పడింది. చర్చల సందర్భంలో కమిటీని ఏర్పాటు చేయటానికి ముందు కమిటిలో ఉండబోయే సభ్యుల విషయమై రెజ్లర్లతో ముందుగానే చర్చలు జరుపుతామని హామి ఇచ్చింది. ఆ హామిని తుంగలో తొక్కి, ఏకపక్షంగా కమిటీని నియమించారు. రెజ్లర్ల ఆరోపణలపై విచారణ జరిపి, కమిటీ రూపొందించిన నివేదికను ఇంతవరకు బహిరంగపరచలేదు. బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు లేవు. ఇపుడు రెజ్లింగ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఆ ఎన్నికలలో పాల్గొంటానని, రెజ్లింగ్ ఫెడరేషన్‌లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన ప్రకటిస్తున్నాడు. అంటే లైంగిక వేధింపులపై ఆరోపణలు రెజ్లర్లు చేసిన ఆరోపణలకు ప్రభుత్వం గడ్డిపరకంత విలువ కూడా ఇవ్వలేదని స్పష్టమౌతున్నది.

ఇటువంటి పరిస్థితులలో లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ఆందోళనకు పూనుకున్నారు. శరణ్‌సింగ్‌ను అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించమని పట్టుబట్టి ఆందోళన కొనసాగిస్తున్నా, ప్రధాని మన్ కి బాత్‌లో ఆ అభాగ్యులకు స్థానం దొరకలేదు. రెండుసార్లు ఢిల్లీ పోలీసులు రెజ్లర్లపై దాడిచేశారు. మే 28న కొత్త పార్లమెంటు భవనం వద్ద నిరసన తెలుపుతామని ప్రకటించారు. వారి పోరాటానికి రైతులు, కార్మికులు, వివిధ సంఘాలకు చెందిన వారు మద్దతు తెలిపారు. ప్రభుత్వం బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయటం, వారి సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవటం కాకుండా వారిపై తీవ్రమైన దమనకాండను అమలుచేసింది. పార్లమెంటుకు బయటుదేరుతున్న రెజ్లర్లపై దాడికి పూనుకొని, వారిని అరెస్ట్ చేసి, నిర్బంధించారు. మరోవైపున బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ పార్లమెంటు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నాడు. చేసిన తప్పులకు జైలులో ఉండవలసిన బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ నూతన పార్లమెంటు భవన ప్రారంభ కార్యక్రమంలో దర్జాగా పాల్గొనటమేమిటి? తమకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పోరాటం చేస్తున్న రెజ్లర్లపై పోలీసులు దాడి చేయటమేమిటి? వారిని అరెస్టు చేసి నిర్బంధించటం ఏమిటి? ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల పాలనలో న్యాయం ఎలా తల్లకిందులుగా అమలౌతుందనే దానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. తప్పులు చేసినవారందరూ ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల పంచన చేరి పునీతులుగా మారుతున్నారు. నేరాలు, వేధింపులు, హత్యాకాండకు బలైనవారు నేరస్తులుగా ముద్రవేయబడి, శిక్షలు అనుభవిస్తున్నారు. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ జమానాలో 'బేటి పఢావో–బేటి బచావో అంటే ఏమిటో అర్థమైందా? న్యాయం అంటే ఏమిటో తెలిసిందా? రానున్న కాలంలో పాలన ఎలా వుంటుందో తెలిసిందా?

బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశంలోని దోపిడీదారులు, మోసగాళ్ళు, అక్రమాలు, అన్యాయాలు చేసేవారు, కాషాయ ముసుగు వేసుకున్న మోసగాళ్ళు దొంగస్వాముల కోసం పరిపాలన చేస్తుంది. ఇటువంటి వారు, ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి అనుయాయులు అన్నిచట్టాలకు అతీతులుగా ఉంటారు. సామాన్యప్రజలు, న్యాయం కోసం, ప్రజల కోసం పోరాటం చేసేవారు నేరస్తులుగా ముద్రవేయబడి జైళ్ళలో కాలం గడపాల్సివస్తుంది. అన్యాయం, అక్రమాలే న్యాయంగా ఛలామణి అయ్యే ఇటువంటి వ్యవస్థ కోసం ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలు తిరోగమన మార్గంలో ప్రయాణిస్తున్నాయి. ఈ తిరోగమనాన్ని నిరోధించి, లౌకిక, ప్రజాస్వామిక, రాజ్యాంగాన్ని, భారతదేశాన్ని రక్షించుకోవటానికి ప్రజానీకం కదలాలి. ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల కుట్రలకు చెక్ పెట్టాలి.

**సత్యపాల్‌మాలిక్ వెల్లడించిన వాస్తవాలతో ఇరుకునపడ్డ మోడి**

జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రానికి చివరి గవర్నర్‌గా పనిచేసినన సత్యపాల్ మాలిక్ ద వైర్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వాస్తవాలు మోడి ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించాయి. ఆయన ఆ తర్వాత బిబిసి, ఇతర మరికొన్ని ఛానెళ్ళకు కూడా ఇంటర్వ్యూలు ఇచ్చాడు. కొన్ని సభలలో కూడా ప్రసంగించాడు. ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతిస్తు చేసిన ప్రసంగంలో కూడా కొన్ని అంశాలను పేర్కొన్నాడు. ఆయన

చేసిన ఆరోపణలలో ప్రధానమైనవి ప్రభుత్వం విమానాలు అందజేస్తే 2019 ఎన్నికలకు ముందు జరిగిన పుల్వామా తీవ్రవాదుల దాడిలో సైనికులు మరణించేవారు కాదని, ప్రధాని చుట్టూ అవినీతిపరులు ఉన్నారని, వారికి ఆయన రక్షణ కల్పిస్తున్నాడని, అదానిపై హిండెన్‌బెర్గ్ నివేదికపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు, బిబిసి డాక్యుమెంటరి, కాశ్మీర్ విషయంలో మోడి అజ్ఞానంతో ఉన్నాడని, జమ్మూ-కాశ్మీర్‌లో రిలయన్స్ వైద్యబీమా పథకం ఆమోదం కోసం బిజెపి ప్రధానకార్యదర్శిగా ఉన్న రాం మాధవ్ తనను కలవటం తదితర అనేక అంశాలపై ఆయన మాట్లాడుతున్నాడు. ఆయన చెపుతున్న విష యాలను బిజెపి ఖండించటం లేదు. ఆయనపై ప్రతీకారంగా ప్రతిపక్ష నాయకులపై వ్యవహరిస్తున్న శైలిలోనే ఇడిని ప్రయో గించింది. తననెవరూ భయపెట్ట లేరని, తాను వాస్తవాలను వెల్లడిస్తూనే ఉంటానని ఇడి దాడి తర్వాత ఆయన ప్రకటించాడు.

❝ తనకుతాను గొప్ప నాయకుడినని, అవి నీతిని సహించనని ప్రచారం చేసుకుంటున్న మోడి, ఆయన ప్రభుత్వ బండారాన్ని సత్యపాల్ మాలిక్ ఎండగడుతున్నాడు. మోడి అవినీతి పరులను కాపాడుతున్నాడని, దేశ ప్రయో జనాలను పక్కన పెట్టి తన చిత్తం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాడని, జమ్మూ-కాశ్మీర్ లాంటి అత్యంత సున్నితమైన విషయంలో బాధ్యతా రహితంగా వ్యవహరించటం తదితరాలు మోడి చేసిన తప్పుడు పనులను వెల్లడిస్తున్నాయి. ❞

తనకుతాను గొప్ప నాయకుడినని, అవి నీతిని సహించనని ప్రచారం చేసుకుంటున్న మోడి, ఆయన ప్రభుత్వ బండారాన్ని సత్యపాల్ మాలిక్ ఎండగడుతున్నాడు. మోడి అవినీతి పరులను కాపాడుతున్నాడని, దేశ ప్రయో జనాలను పక్కన పెట్టి తన చిత్తం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాడని, జమ్మూ- కాశ్మీర్ లాంటి అత్యంత సున్నితమైన విషయంలో బాధ్యతా రహితంగా వ్యవహరించటం తదితరాలు మోడి చేసిన తప్పుడు పనులను వెల్లడిస్తున్నాయి. దేశం పట్ల తమకు అపారమైన ప్రేమ ఉన్నట్లు, ప్రతిపక్ష పార్టీలు, తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారు దేశద్రోహానికి పాల్పడుతున్నారని చేస్తున్న ప్రచార బండారాన్ని కూడా సత్యపాల్ మాలిక్ చెప్పిన అంశాలు బట్టబయలు చేస్తున్నాయి. భారత సమాజాన్ని వేల సంవత్సరాల వెనక్కు నడిపించటం, మనుస్మృతిని అమలుజరపటం ద్వారా చాతుర్వర్ణ వ్యవస్థను పునరుద్ధరించటం, బ్రాహ్మణాధిక్యతను తిరిగి తీసుకురావటం, భారతదేశ ప్రజలు ఐక్యంగా అభివృద్ధి చెందకుండా మతాల పేరుతో వారి మధ్య దూరాన్ని పెంచటం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. దేశం, ప్రజలు ఏమైనా వారికి పట్టదు. ఇవి నెరవేరితే చాలు అన్న విధంగా వీరు వ్యవహరిస్తున్నారు. దేశప్రజలు చైతన్యవంతంగా పోరాటం చేస్తేనే సమైక్య, లౌకిక భారతదేశాన్ని కాపాడుకోవటం సాధ్యమౌతుంది.

**కర్ణాటక ఎన్నికల పాఠాలు**

2023 మే నెల 10వ తేదీన కర్ణాటక శాసనసభకు ఎన్నికలు జరిగాయి. 224 స్థానాలున్న శాసనసభలో ఏ విధంగా నైనా మెజారిటీ సాధించాలని బిజెపి అన్ని విధాలైన అక్రమ పద్ధతులు అనుసరించింది. సాక్షాత్తు ప్రధానమంత్రి మతోన్మాదంతో ఓటర్లను ఆకర్షించటానికి పూనుకున్నాడు. అసత్యాలు, అభూతకల్పనలతో ఓటర్లను మభ్యపెట్టేలా ప్రచారం చేశారు. కర్ణాటకను హిందుత్వ ప్రయోగశాలగా మార్చి, తద్వారా లబ్ది పొందటం కోసం బిజెపి గత కొన్ని సంవత్సరాల నుండి ప్రయత్నం చేస్తున్నది. ఈ కాలంలో దానిని మరింత తీవ్రం చేసింది. ముస్లీం విద్యార్థినులు హిజాబ్ ధరించరాదని వివాదం రేపి, ఆంక్షలు పెట్టింది. హిజాబ్ ధరించిన వారిని తరగతి గదులలోకి అనుమతించలేదు. ఆజాన్‌పై వివాదం సృష్టించారు. టిప్పుసుల్తాన్‌ను బ్రిటిష్ వారు చంపలేదని, రాష్ట్రంలోని ప్రధాన కులాలలో ఒకటైన వొక్కలిగ కుల నాయకులు చంపారని కట్టుకథను సృష్టించి ప్రచారం చేశారు. టిప్పుసుల్తాన్‌తో సావర్కర్‌ను పోటీ పెట్టారు. దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న కర్ణాటకలో విజయం సాధించి, ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించాలని బిజెపి పథకం రూపొందించింది.



బిజెపి ఎంపీ లైంగిక వేధింపులకు ఢిల్లీలో నిరసన తెలుపుతున్న మల్లయోధులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కాన్ని కర్ణాటక ప్రజలు బిజెపి దుష్ట పథకాలను తిప్పికొట్టారు. మతోన్మాద ప్రచారానికి తాము లొంగిపోవని, లౌకికతత్వానికే కట్టుబడి ఉంటామని ఫలితాల ద్వారా స్పష్టం చేశారు. ఎన్నికలలో తప్పుడు ప్రచారం చేసిన బిజెపికి గట్టిగా బుద్ధిచెప్పారు. రాష్ట్రంలోని 224 స్థానాలకు గానూ బిజెపి 66 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 135 స్థానాలు ఇచ్చారు. రాష్ట్ర రాజకీయాలలో కింగ్‌మేకర్‌గా ఉన్న జెడిఎస్‌ను 19 స్థానాలకే పరిమితం చేశారు. ప్రజలు తనను తిరస్కరించి, అధికారానికి రావటానికి తగినన్ని స్థానాలు ఇవ్వకపోయినా, ఇతర పార్టీల శాసనసభ్యులను ప్రలోభపెట్టటం, ఫిరాయింపులకు ప్రోత్సహించటం ద్వారా అక్రమమార్గంలో అధికారంలోకి వస్తున్న బిజెపిని అదుపులో ఉంచారు. అటువంటి అక్రమాలకు పాల్పడటానికి అవకాశం లేకుండా 66 స్థానాలకే పరిమితం చేశారు.

కర్ణాటక అనుభవం ఉన్నా బిజెపి పూర్తిగా మతతత్వంపై ఆధారపడి ఎన్నికలలో విజయం సాధించాలని ప్రణాళికలు వేస్తున్నదని పార్లమెంటు ప్రారంభం సందర్భంగా మోడి, బిజెపి నాయకత్వం వ్యవహరించిన తీరు తెలియజేస్తున్నది. 2023లో ఐదు రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికలు, 2024 పార్లమెంటు ఎన్నికలను పూర్తిగా మతప్రాతిపదికపై జరపటం కోసం బిజెపి సన్నాహాలు చేస్తున్నది. కర్ణాటక ప్రజలు మతతత్వాన్ని ఓడించిన స్ఫూర్తితో రానున్న ఐదు రాష్ట్రాలు, 2024 పార్లమెంటు ఎన్నికలలో బిజెపిని ఓడించటానికి, లౌకికశక్తులను గెలిపించటానికి ప్రజలు సన్నద్ధం కావాలి.

❃

# ఆటవిక పెట్టుబడిదారీ వ్యవస్థతో ప్రమాదం

(28వ పేజీ తరువాయి)

అంశాలను తెలుసుకొనే తరం ఈ ప్రపంచాన్ని ఏ విధంగా అవగాహన చేసుకుంటుంది?

తాము స్వంతంగా రూపొందించుకున్న పరిమితులలో ప్రజలు ఉండేలా సోషల్‌మీడియా ప్రభావితం చేస్తున్నది. వీటన్నింటికీ మనం గురి అవుతున్నాం. నాలాంటి వారు మీ కార్యక్రమాన్ని లేదా డెమోక్రసి నౌ ప్రసారాలను వింటారు. మేము బ్రెయిట్‌బర్ట్‌ను వినం. కాని అది అనేక వాస్తవాలను వెల్లడిస్తున్నది. వీటితో పాటు మరొక ప్రమాదకరమైన శక్తి కూడా వస్తున్నది. కృత్రిమ మేధతో ఇంటర్‌నెట్ ద్వారా మనుషులతో సంభాషించటానికి అవసరమైన ప్రోగ్రాంను రూపొందిస్తున్నారు. దీనితో మరింత ఎక్కువగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేయటం, వ్యక్తులను చెడ్డవారిగా చిత్రీకరించటం, పరువు ప్రతిష్ఠలను తేలికగా నాశనం చేయటం తదితరాలు జరుగుతాయి. దానిని అదుపు చేయటానికి ఎటువంటి మార్గం లేదు. ఇదంతా అంగీకారాన్ని తయారు చేయటంలో భాగం. ఇన్ని జరుగుతున్నప్పటికీ మనమే మంచివారం, తెలివైనవారం అని అనుకుంటున్నాం.

బర్సామియాన్: **ఈ విధమైన ప్రచారాలను ఏ విధంగా ఎదుర్కోవాలి? ఆటవికమైన పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కోవటానికి ఉన్న మార్గాలేమిటి?**

**చోమ్‌స్కీ:** ఈ ప్రచారాలను మీరు సవాలు చేయాలంటే మీరు మీ పద్ధతిలో మరింత ఎక్కువగా, యాక్టివ్‌గా, సరైనమార్గంలో ప్రచారం చేయాలి. ఆటవిక పెట్టుబడిదారీ విధానాన్ని రెండు దశలుగా ఎదుర్కోవాలి. అందులో చిన్నభాగం ఆటవికతను తొలగించటం. 'రీగన్ ముందుకాలం నాటికి మనం వెళ్ళాలి. పెట్టుబడిదారీ విధానం కౄరంగా ఉన్నప్పటికీ కొంతమేరకు మంచి వేతనాలు, ప్రజలకు కొన్ని హక్కులు తదితరాలున్న కాలానికి తిరిగి వెళ్ళాలని చెప్పటం పూర్తిగా ఊహాజనితం కాదు.

రెండవ దశలో కీలకమైన సమస్యను పరిష్కరించాలి. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పారిశ్రామిక విప్లవం జరిగిన కాలానికి మనం తిరిగివెళ్ళాలి. వేతన ఒప్పందాల ద్వారా తమపై అన్యాయంగా దాడి చేస్తున్నారని, తమను వేతన బానిసలుగా మారుస్తున్నారని అప్పుడు కార్మికులు భావించేవారు. మా జీవితకాలమంతా ఒక యజమాని ఆదేశాలను మేమెందుకు పాటించాలని ప్రశ్నించేవారు. ఈ విధానాన్ని కార్మికులు అంగీకరించలేదు. లింకన్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీ దీనిని ఏ మాత్రం సహించలేదు. 20వ శతాబ్దంలో సోషలిస్టు పార్టీని, కార్మిక ఉద్యమాన్ని ఉడ్రో విల్సన్ నాయకత్వంలోని రెడ్ స్కేర్ తుడిచిపెట్టే వరకు ఈ ఉద్యమం కొనసాగింది. ముప్పైయవ దశాబ్దంలో కొంతమేరకు పుంజుకున్నప్పటికీ ఆ స్థాయికి చేరలేదు.

ప్రస్తుతం అదికూడా లేకుండాపోయింది. తాము పనిచేసే జీవితకాలంలో ఒక యజమాని ఆదేశాలకు కట్టుబడి ఉండటం తమ అత్యున్నత లక్ష్యంగా ప్రజలు భావిస్తున్నారు. అదికూడా మారుతున్నది. కార్మికులు యాజమాన్యంలో భాగస్వాములు కావాలని ఇప్పటికే ప్రతిపాదనలు రావటం ఊహాజనితం కాదు. ఈ విధానం జర్మని, ఇతరచోట్ల ఉన్నది. పరిశ్రమను మనమే ఎందుకు నడుపుకోకూడదు? దీనిని మనం బాగా నడుపుకొనేటపుడు న్యూయార్క్‌లో ఉండే బ్యాంకర్ల ఆదేశాలను మనం ఎందుకు పాటించాలి? ఇవన్నీ చాలాదూరంలో ఉన్నాయని నేను భావించటం లేదు.

బర్సామియాన్: **ప్రభుత్వాలతో కలిసి కౄరంగా వ్యవహరించేవారు ప్రజల జీవితాలను అదుపుచేస్తున్నారు. ఇటువంటి దుర్మార్గులను ఎదుర్కోవటానికి ఉన్న అవకాశాలు ఏమిటి?**

**చోమ్‌స్కీ:** చాలా ఉన్నాయి. భారీస్థాయిలో ప్రజలు కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. ఉద్యమిస్తూ బజార్లలోకి వస్తున్నారు. ఇతరులను గౌరవంగా చూడాలని యువత భావిస్తున్నది. ఇది చాలా దృఢంగానూ, తీవ్రంగానూ ఉన్నది. భూగోళాన్ని వినాశనం నుండి కాపాడాలని అనేకమంది ప్రచారం చేస్తున్నారు. యువర్స్, డెమోక్రసి నౌ, క్రిస్ హెడ్జెస్ ఉద్యమాలు, ఆల్టర్‌నేట్, కామన్ డ్రీమ్స్, ట్రూత్ అవుట్, ది ఇంటర్‌సెప్ట్, టామ్ డిస్పాచ్ తదితర అనేక సైట్లు ఉన్నాయి. మానవులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా ప్రత్యామ్నాయ ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయి. ప్రపంచానికి ఇవే ఆశాదీపాలు.

**(స్వేచ్ఛానుసరణ: ఎ కోటిరెడ్డి)**

# ప్రత్యామ్నాయ సంస్కృతికోసం పోరాటం

**(19వ పేజీ తరువాయి)**

బలహీనంగా ఉన్నపుడే ఇలాంటి పెడధోరణులు, మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలు ముందుకొస్తాయి. ఇప్పుడు అదే జరుగుతున్నది. ప్రజాక్షేత్రంలో, పోరుబాటలో ఉన్నవారు కార్మికవర్గ లక్షణాలు అలవర్చుకోవటం సులభం. సమస్యలు పరిష్కారమైనపుడు ప్రజలకు మానవాతీత శక్తుల అవసరం ఉండదు. సమస్యలు పరిష్కరించే దోపిడీరహిత వ్యవస్థ కోసం సాగే పోరాటం ప్రత్యామ్నాయ సంస్కృతితోనే సాధ్యం. భూస్వామ్య, పెట్టుబడిదారీ సంస్కృతి దోపిడీ వ్యవస్థకు మనల్ని బానిసలుగా చేస్తుంది. కార్మికవర్గ సంస్కృతి ఇందుకు ప్రత్యామ్నాయం చూపిస్తుంది. దోపిడీ వ్యవస్థను అంతం చేసే ఆయుధంగా ఉపయోగపడుతుంది. అందుకే ప్రతి కార్యకర్తా తనమీద తాను పోరాడుతూ, దోపిడీ వ్యవస్థ మీద పోరాడాలి.

ప్రజా పోరాటాలే కాదు... నిత్య జీవితంలో ప్రజలతో ప్రత్యామ్నాయ సాంస్కృతిక సంబంధాలు పెంచుకోవాలి. పార్టీలోనే కాదు, ప్రజలతో సహకార ధోరణి ప్రదర్శించాలి. కష్టాలలో ఉన్నవారికి చేతనైనమేరకు సహకారం అందించాలి. శ్రామికులు కుటుంబసమేతంగా పాల్గొనే సాంస్కృతిక సందర్భాలు రూపొందించాలి. మేడే సందర్భంగా పతాకావిష్కరణలు, ప్రదర్శనలకు మాత్రమే పరిమితం కాకుండా, కుటుంబాలను భాగస్వాములను చేసే ప్రయత్నాలు మంచి అనుభవాలు పంచుతున్నాయి. కార్మికుల నివాస ప్రాంతాలలో చికాగో అమరవీరుల శిబిరం ఏర్పాటు చేసి, వారం రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు సాధారణ కార్మికులను, వారి కుటుంబాలనూ ఆకర్షిస్తున్నాయి. పండుగ వాతావరణంలో, ప్రత్యామ్నాయ సందడి జరుగుతున్నది. బీటీఆర్ వర్ధంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు కార్మికవర్గంలో సామాజిక వివక్షల మీద నిర్వహిస్తున్న క్యాంపెయిన్స్, వివక్ష వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ నిధి వసూళ్ళు మంచి ప్రభావం చూపుతున్నాయి. మే 1 నుండి 19 వరకు నిర్వహించే కార్యకలాపాలు సుందరయ్య వారసత్వం పాదుకొల్పేందుకు తోడ్పడతాయి. ఇలాంటివే అనేకం. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, కొమురం భీం, అల్లూరి సీతారామరాజు వంటి యోధుల వర్ధంతులు, కేవల్ కిషన్ జాతరలో జోక్యం, సమ్మక్క-సారలమ్మ జాతరలో జోక్యం, తెలుగు సంవత్సరాది, ఉర్దూ సంవత్సరాది, సంక్రాంతి, బతుకమ్మ, పశువుల పండుగ వంటి సందర్భాలలో శాస్త్రీయ దృక్పథంతో సందడి చేయవచ్చు. పండుగల పేరుతో ఫ్యూడల్ సంస్కృతిని విస్తరింపజేసే ప్రయత్నాలకు ప్రత్యామ్నాయాలు రూపొందించవచ్చు. ఏమైనా... ఇది సాంస్కృతిక రంగంలో ఒక పెద్ద పోరాటం. అందుకే పార్టీ కేంద్రకమిటీ ఒక తీర్మానమే చేయవల్సి వచ్చింది. అదే భవిష్యత్తు పోరాటాలకు దిక్సూచి కావాలి.

# ఋగ్వేద ఋషులు

**(2వ పేజీ తరువాయి)**

నాటడం గురించి (యవం క్రిష్ జెండ్ ఆ వేస్తా లో కరీష్) తద్వారా వచ్చే ఫలసాయాన్ని (సస్య, ఆ వేస్తా లోహహ్యా) గురించి ప్రస్తావనలు ఉన్నాయి. బార్లీని ప్రత్యేక అర్థంలో యవ అన్నారు. సింధు నాగరికత లో ప్రత్తి పండించే వారు. తర్వాతి కాలంలో కూడా సాగయింది. కానీ దీని ప్రస్తావన ఋగ్వేదంలో ఎక్కడా లేదు. ఋగ్వేద కర్తల దృష్టిలో సంపద అంటే గుర్రాలు పశువులు ముఖ్యంగా ఆవులు, ఒంటెలు, గొర్రెలు ఎద్దులు . ఆహారధాన్యాలను యవలు అని అన్నారు. సాగు భూమిని (ఉర్వర) ప్రస్తా విస్తుంది ఋగ్వేదం. ఈ భూమిని తప్పనిసరిగా స్వాధీనం చేసుకునే వారు (ఉ ర్వరజిత్), అనుభవ కర్త (ఉర్వర పతి) అన్నారు. నాగలికి, నీటిపారుదలకు, బళ్ల రవాణాకు ఎద్దులు అవసరం కావటంతో, పశువులకు అంతకు ముందు లేనంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పశు గణాలు లేకుంటే వ్యవసాయం సాధ్యప డదు. ఈ పశువుల ద్వారా లభ్యమయ్యే పాలను మాంసం కూడా ప్రాముఖ్యత వహించిన అంశమే. పశువుల అవసరం అంతకంతకు పెరగడంతో పెద్ద పెద్ద మందలు కలిగి ఉండటం అవసరమైంది. సేద్యపు భూములు పక్కనే పచ్చికబయళ్ళు (గోష్ఠ) ఉండేవి. ఋగ్వేద ప్రజలు ఈ పశువుల మందుల గురించి కూడా సంఘర్షణ పడ్డారు. యుద్ధం అన్న మాటకు" గవిష్టి "అన్న పదం కూడా వాడబడింది. గవిష్టి అన్న మాటకు అర్థం గోవుల్ని వెతకటం అని అర్థం.. ఆ వెతుకులాటలో ఆవుల కొరకు సంఘర్షణలు జరిగేవని ఋగ్వేదం చెబుతోంది.

ఋగ్వేదంలో చేతి వృత్తులకు సంబంధించిన సమాచారం బహు కొద్దిగా మాత్రమే అందులో ఉన్నట్లుగా అర్థమవుతుంది. నేతకా రుడు (వాయ) ఉన్ని తో దుస్తులు తయారు చేసే వాడు అని చెప్పబడింది. అంటే ఋగ్వేద ప్రజలు ఉన్ని వస్త్రాలను ధరించేవారు. పంజాబ్ ,కాశ్మీర్ చలి ప్రాంతం అవటం వలన ఇది అసహజం కాదు. నూలు వస్త్రాల ప్రస్తావన ఋగ్వేదంలో లేదు. కుండలగురించి తరచుగా ప్రస్తావించిన అప్పటికీ కుమ్మరిని ప్రస్తావించక పోవడం స్పష్టంగా రుగ్వేదంలో గమనించవచ్చు. బంగారానికి (హిరణ్య) ఎక్కువ విలువ ఉండేది. దాన్ని నదులనుండి సేకరించేవారు. అందువల్లనే సింధు నదిని సువర్ణ నది గా పిలిచేవారు(10-75-8). ఆ బంగారాన్ని సేకరించి భూమిలో పాతి పెట్టేవారు. ఈ బంగారాన్ని నిష్క లేదా నిష్కం అంటే ఆభరణం లేదా కంఠహారం ని సూచిస్తుంది. వంద యజ్ఞాలకు తనకు సంభావన కింద, 100 గుర్రాల తో పాటు 100 నిష్కములు లభించినట్లు ఒక పురోహితుడు చెప్తాడు (1-126-2). ఋగ్వేదం వడ్రంగుల ను, రథాలను తయారు చేసే వారు, సాలీలు, చర్మకారులు మొదలైన చేతివృత్తుల వారిని పేర్కొంటుంది.

**రుగ్వేద ప్రజల ఆహార పానీయాలు**

ఋగ్వేద ప్రజలు ప్రధానంగా మాంసాహారులు. యజ్ఞంలో ఇంద్రుడికి హవిస్సులు అర్పించి హోమగుండంలో, నరికిన మాంసాన్ని కాల్చుకుని తినేవారు. గోవులు, గుర్రాలు ,ఎద్దులు, మేకలు ,గొర్రెల మాంసాన్ని ఆరగించే వాళ్లు. రుషులకు ఆతిథ్యం ఇచ్చే టప్పుడు కూడా మాంసాన్ని వండి పెట్టే వారు. తరువాత సూత్రాల కాలంలో కూడా ఈ విషయం వివరించ బడింది. ధర్మ సూత్రకారులు "నామాంసో మధు పర్కోభవతి". అంటే మాంసం లేకుండా మధుపర్కం కాదు (ఆశ్వలాయన గృహ్య సూత్రం (1-4). అతిథి సత్కారానికి తయారు చేసే ఆహారాన్ని మధుపర్కం అనేవారు.

మాంసాహారాన్ని గురించి దాని మహి మను గురించి బృహదారణ్యకం లో (6-4-18) ఇలా వర్ణించారు. పండితుడు ,ప్రసిద్ధుడు ,సామాజికుడు, శ్రోతలున్న వక్త ,వేద పాఠి ,దీర్ఘాయుష్మంతుడు అయిన నా కొడుకును కనాలనుకునే తల్లి ఆబోతు లేక ఎద్దు మాంసాన్ని నేతితో వండుకొని తినవలెను. దీనికి శంకరా చార్యులు టీకా కూడా వ్రాశారు. అనగా మాంసము వయసులో ఉన్న లేక ముదురు వయసులో ఉన్న ఎద్దుదై ఉండవలెను అని . ఆర్యులకు మరింత ఇష్టమైన మాంసం బలిసిన గొర్రె,లేక మేక మాంసం."నివానంమేషమ పచంతవీరః "అనగా వీరులు బలిసిన మేకను వండు దుకొంటున్నారు (1-162-17). దీర్ఘ తమ రుషి మాంసాన్ని తినే వారు అది ఉడుకుతుండగా చూస్తున్న వారు దాని సుగంధాన్ని బాగా వర్ణిస్తున్నారు (1-162-12) అని ఈ రుక్కు లో చెప్పాడు. అరుణ రుషి యజ్ఞ పశువులను కొన్నిటి పేర్లు పేర్కొన్నాడు. గుర్రాలు , ఎద్దులు, ఆవులు, గొర్రెలు హవనం చేయబడు తున్నాయి (10-91,14,15,),(10-27).

దీర్ఘ తమ రుషి మంచి వాసనతో ఉడుపుతున్న గుర్రం సంగతి చెప్పాడు. ఉడుకుతున్న గుర్రాన్ని చూసినవారు "మంచి వాసన వస్తుంది". దేవతలకు అర్పించండి అని అంటున్నారు. సురభి సుగంధిత అశ్వ మాంసం, వా జనం పక్వం సురభి మాంసం.గుర్రపు మాంసాన్ని తినుచున్న వారు వీరి సంకల్పం మాకు సహాయం చేయు గాక. (1-16-21) ఈ ఋక్కులో ఓ అశ్వ మా యజ్ఞంలో నీవు చంపబడ్డావు. కానీ నీవు చచ్చుటలేదు.సుగమ మార్గాన దేవుళ్ల దగ్గరకు వెళుతున్నావు.అని వర్ణించారు.మాంసం వండే కుండ (ఉ ఖా) ను చూస్తున్నారు. రసాన్ని వేసే పాత్రలున్నాయి. వేడిని కాపాడే మూకుళ్ళుఉన్నాయి. "సూనా" అంటే పశువు నరుకుటకు ఉంచిన పీట. దాని పై అశ్వాన్ని అలంకరిస్తున్నారు. (10-162),(10-162-12).

నేడు ఆవు మాంసం కనపడితే కేసులు పెడుతున్నారు. కానీ ఋగ్వేద కాలంలో లో నే కాకుండా తరువాత కాలమైన బుద్ధుని కాలంలో కూడా వాడుకలో ఉన్న ఆహారం ఈ మాంసమే. బౌద్ధ వాఙ్మయం అయిన మధ్యమనికాయంలో కూడా ఇలా చెప్పబడి ఉంది. గో ఘాతకుడు గోవుని చాతుర్యంగా చంపి లోపలి మాంసం కానీ, బయట చర్మం కానీ దెబ్బతినకుండా చేసి అతడు మాంసాన్ని వేరు చేశాడు. (మధ్యమని కాయం3-5-4). గోవు మాంసాన్ని నరికి బజార్లో పోగు పెట్టినట్లు కూడా వర్ణించబడింది. గోవు ని చంపే స్థలానికి సూనా అని పేరు. అక్కడ కుక్కలు ఎముకల కొరకు కాచుకుని ఉన్నవట. ఆవుని వధించే కత్తిని గోభికర్తనం అన్నారు.(మధ్యమని కాయం2-4-5). ఋగ్వేదంలో రుషి ఇలా చెప్పాడు. కత్తి ఆవును కణుపు కణుపు నా కోయు గాత.(10-79-6). ఉపనిషత్తుల కాలంలో కూడా ఉపనిషత్ కారుడు యజ్ఞవల్క్య రుషి ఎద్దు లేదా గోమాంసం మృదువుగా ఉన్నట్లయితే అది ఏదైనా తింటాను అని అంటాడు.

ఋగ్వేద ప్రజలు పాలతో చేసిన అనేక వంట కాలను కూడా తినేవారు. వీరికి నెయ్యి చాలా ముఖ్య మైన పదార్థం. విశ్వామిత్రుడు పురోడాశం గురించి వర్ణించాడు. తర్వాత ఇది పాయసాని కి పర్యాయ పదం అయింది. (3-28-2). పాలు లేక పెరుగు తో ఒక రకం ఆహారాన్ని చేసేవారు. దాన్ని ఆశీరమ న్నారు. దీని గురించి అనేక చోట్ల వచ్చింది. (1-134-6,3-53-14,9-75-6,23,81,10-49-10,67). గవా శిరం, దధ్వా శిరం మొదలైన పేర్లు అనేక ఉన్నాయి. మరొక చోట క్షీర పాకం అని వచ్చింది(8-77-10). భరద్వాజుడు విశ్వామిత్రుడు వాసుదేవుడు మొదలైన రుషులు "కరంభ"అంటే పిండి లేక సత్తు, అపూపం అంటే రొట్టె,లి దానా" అంటే వేయించిన ధాన్యం ఈ ఆహార పదార్థాలను గురించి (3-62-1,7),(5-7-2),(6-56-1) రుక్కులలో వర్ణించారు. ఈ ఆహారాన్ని తయారు చేసుకొనుట కు సామాగ్రి "ఓ ఖం"అంటే రోలు, "తితు" అంటే జల్లెడ, "ఉ ఖా"అంటే కుండ లను పేర్కొన్నారు (1-28-1). పాలకు సంబంధించిన పాలు పెరుగు మజ్జిగ వారికి చాలా ఇష్టం. అవి వారికి సులభంగా దొరికేవి. జున్ను సంగతి గురించి ఎక్కడా చెప్పలేదు. పశువుల సంపద ఎక్కువగా ఉండటంతో పాలు పెరుగు మజ్జిగ వెన్న వీరికి బాగా అంటే సమృద్ధిగా దొరికేవి. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, Issue : 1 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఎన్నికల ప్రజాస్వామ్యంలో 123వ స్థానానికి దిగజారిన భారత్



ఎన్నికల ప్రజాస్వామ్య సూచీలో భారత దేశ స్థానం 108కు దిగజారిపోయిందని, సమానత్వ సూచీలో మరింతగా 123వ స్థానానికి దిగజారిందని 2023 వి-డెమ్ నివేదిక వెల్లడించింది. "గత పదేళ్లలో నియంతృత్వంవైపు నడిచిన దేశాల్లో భారత్ అత్యంత హీన స్థితిలో ఉంది" అని స్వీడన్‌కు చెందిన వి-డెమ్ (వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ) నివేదిక తెలపింది. లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్‌లో భారత 97వ స్థానంలో ఉందనీ, 10 ఏళ్ల క్రితంలో పోలిస్తే భారత్‌లో అకాడమిక్ స్వేచ్ఛ నేడు గణనీయంగా తగ్గిందని నివేదిక వివరించింది.

వి-డెమ్ ఇచ్చిన గణాంకాల ప్రకారం భారత దేశంలో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వ స్కోరు 1975లో 0.59 నుండి 1995లో 0.60కి పెరిగింది. 1 అయితే సంపూర్ణ ప్రాతినిధ్యం ఉన్నట్లు. 2015లో ఈ స్కోరు భారత్‌లో 0.72కు పెరిగింది. అయితే 2020లో ఇది మళ్లీ 0.61కి తగ్గిపోయింది. అంటే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన నాటి కాలానికి ఇది తగ్గిపోయిందన్నమాట. 1975 తరువాత మతస్వేచ్ఛ తగ్గిపోయి అధ్వాన్న స్థితికి చేరుకున్న దేశాల్లో భారత్, శ్రీలంక, ఇండోనీషియాలు ఉన్నాయి.

వి-డెమ్ నివేదిక.. మొత్తం ప్రపంచవ్యాప్త పరిస్థితి గురించి వివరిస్తూ 2022లో 72 శాతం మంది ప్రజలు (570 కోట్ల మంది ప్రజలు) నియంతృత్వ దేశాల్లో ఉన్నారని చెప్పింది. గత 35 ఏళ్లలో ప్రపంచ వ్యాపితంగా పురోగమించిన ప్రజాస్వామ్యం ఇప్పుడు తుడిచిపెట్టుకుపోయిందని తెలిపింది. ప్రపంచంలో వంద కోట్ల మంది ప్రజలు మాత్రమే లిబరల్ డెమోక్రసీలో జీవిస్తున్నారని అది తెలిపింది.

35 దేశాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛ తగ్గిపోయింది. 47 దేశాల్లో ప్రభుత్వ సెన్సార్‌షిప్పు పెరిగింది. 37 దేశాల్లో పౌర సమాజంపై రాజ్యం అణచివేత పెరిగింది. 30 దేశాల్లో ఎన్నికల నాణ్యత తగ్గింది. కరోనా మహమ్మారిని ఉపయోగించుకుని అనేక దేశాలు తమతమ దేశాల్లో నియంతృత్వాలను పెంచివేశాయని నివేదిక పేర్కొంది. భారత దేశంలో కూడా కరోనా మహమ్మారి సమయంలోనే ప్రభుత్వం జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర విభజనతో పాటు అనేక అప్రజాస్వామిక చర్యలకు పాల్పడిందని నివేదిక ఉదహరించింది. డొమినికన్ రిపబ్లిక్, గాంబియా, షెచెల్స్ వంటి దేశాలు ప్రజల మధ్య చీలికలు నివారించి ప్రజా స్వామ్య స్కోరును పెంచుకుంటే ఆఫ్ఘనిస్థాన్, భారత్, బ్రెజిల్, మ్యాన్మార్‌లు ప్రజలను చీల్చడం ద్వారా నియంతృత్వాన్ని పెంచుతున్నాయని వి-డెమ్ నివేదిక తెలియజేసింది.

అయితే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజాబాహుళ్యం కదిలిన చోట, ఐక్య ప్రతిపక్షం పౌర సమాజంతో కలిసి పనిచేసిన చోట, పాలనాయంత్రాంగం పూర్తిగా అధికారాన్ని చేజిక్కించుకోకుండా న్యాయవ్యవస్థ అడ్డుకున్న చోట పరిస్థితిని మళ్లీ సాధారణ స్థితికి తేవడం సాధ్యమవుతోందని నివేదిక తెలిపింది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు........................................

వీధి........................................

గ్రామం........................................

మండలం లేదా పట్టణం........................................

జిల్లా........................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.